# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 25 మే 2025 సంపుటి : 23 సంచిక : 348 పేజీలు : 12 వెల : రూ.4.00

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.










## పుష్కరాల్లో గవర్నర్ దంపతులు

-స్వాగతం పలికిన మంత్రి శ్రీధర్ బాబు

నినాదం మహాదేవపూర్ :సరస్వతి పుష్కరాల్లో పుణ్య స్నానం ఆచరించేందుకు ఆదివారం కాళేశ్వరానికి విచ్చేసిన గవర్నర్ దంపతులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సాదర స్వాగతం పలికారు. సరస్వతి పుష్కర ఘాట్ లో పుణ్య స్నానం అనంతరం గవర్నర్ దంపతులు "కాళేశ్వర ముక్తీశ్వర" స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



## 'నీరా కేఫ్' టెండర్లు రద్దు చేయాలి

### -మాజీ మంత్రి శ్రీనివాస్

యాదాద్రి భువనగిరి : తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నీరా కేఫ్‌లను జిల్లాలకు విస్తరించాల్సింది పోయి, పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన దాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తక్షణమే టెండర్లు రద్దు చేసి, కల్లుగీత కార్పొరేషన్ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## ఏం అద్భుతం జరిగిందో..?

హైదరాబాద్ : దేశ రాజధాని ఢిల్లీలో శనివారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, అనంతరం ప్రధాని నరేంద్ర మోదీని ప్రత్యేకంగా కలుసుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.నీతి ఆయోగ్ చివరి సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బహిష్కరించారు. కానీ నిన్న నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కావడమే కాకుండా.. ప్రధాన మంత్రితో రేవంత్ రెడ్డి సరదాగా గడుపుతూ కనిపించారు.



## ఈసెట్ ఫలితాలు విడుదల

### -93.87 శాతం ఉత్తీర్ణత నమోదు

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో టీజీ ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణ రెడ్డి విడుదల చేశారు. ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెటలార్జికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ కుమార్, ఆచార్య చంద్రశేఖర్ పాల్గొన్నారు.బీఎస్సీ మ్యాథ్స్‌లో సంతోష్ కుమార్, కెమికల్ ఇంజినీరింగ్‌లో లెంక తేజ సాయి, సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్కొండ నిఖిల్ కౌశిక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో శ్రీకాంత్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కట్లే రేవతి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో కాసుల శ్రావణి, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో రాపర్తి చందన, మొదటి ర్యాంకు సాధించారు.

## చిన్నారులను ఛిదిమేస్తున్నారు

- వివాహేతర సంబంధాలే ప్రధాన కారణం
- యమకింకరులుగా మారిన తల్లిదండ్రులు
- ఆర్థిక పరిస్థితులు మరోకారణం
- మానవత్వం మంటగలుస్తోందటున్న పెద్దలు
- భవిష్యత్తుకు ప్రమాదం అంటున్న నిపుణులు



**హైదరాబాద్ :** వివాహం అయిన స్త్రీ,పురుషులు పిల్లలు పుట్టిన అనంతరం కూడా తమ సుఖాల కోసం పర స్త్రీ, పురుషుడి మాయలో పడి వారితో వెళ్లిపోయేందుకు చిన్నారులు అడ్డు వస్తున్నారని వారిని అడ్డు తొలగించుకుంటున్నారు. పిల్లలను దైవంతో పోలుస్తారు. అలాంటి వాళ్లను కనీసం కనికరం లేకుండా చంపి తమ సుఖాలను చూసుకుంటున్నారని వారిపై పలువురు దుమ్మెత్తి పోస్తున్నారు.

**ఆర్థిక పరిస్థితులు మరో కారణం:** ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ఖర్చులు, పాఠశాలల ఖర్చులు భరించలేక పిల్లలను పోషించలేక ఇలాంటి అగాయిత్యాలకు పాల్పడుతున్నారు. వీరు ఆదాయానికి మించి ఖర్చు పెడుతూ.. ఇతరుల లాగా జీవించాలని ఆడంబరాలకు వెళ్లి అప్పులు చేస్తూ, చివరికి అప్పులు తీర్చలేని స్థితిలో కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నారు.

**ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం:** ఉమ్మడి కుటుంబాల విచ్ఛినం కూడా మరో కారణంగా చెప్ప వచ్చు. ఎందుకంటే పాతకాలంలో పెళ్లయిన వారు అత్తమామలతో కలిసి ఉండే వారు భార్యా,

-మిగతా 2లో..

## చిన్న, మధ్య తరగతి హాస్పిటల్స్ కు సింగల్ విండో పద్ధతి ద్వారా అనుమతులు

### రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

# దిగ్విజయంగా ముగిసిన తానాకాన్ 2025 సదస్సు




**కరీంనగర్ :** తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హెూమ్ డాక్టర్స్ అసోసియేషన్ 2025 రాష్ట్ర వ్యాప్త సదస్సు రెండో రోజు కార్యక్రమాల నిర్వహణ ముగింపు కార్యక్రమం స్థానిక ప్రతిమ హెూటల్ నందు దిగ్విజయంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్న మధ్య స్థాయి హాస్పిటల్స్ ఎదుర్కొంటున్న సమస్యలు అట్లే వివిధ స్థాయిలలో డాక్టర్లు బెడ్స్ హాస్పిటల్ కి పర్మిషన్ ల కు సింగిల్ విండో పద్ధతి ద్వారా అనుమతులు ఇవ్వాలని, వైద్య కమిషన్ ఏర్పాటుకు సహకరించాలని మినిస్టర్ కు నివేదించగా దీనిపై స్పందించిన ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐ.టి. మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు , డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే మానకొండూరు , డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి ఎమ్మెల్యే , కే.సంజయ్ కోరుట్ల ఎమ్మెల్యే , పాల్వాయి హరీష్ బాబు సిర్పూర్ కాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్గొని కార్యక్రమానికి వన్నె తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్, తెలంగాణా లోని వివిధ జిల్లాల నుండి వచ్చిన డాక్టర్ లు చిన్న మధ్య స్థాయి హాస్పిటల్ అనుమతుల కొరకు, ఎదుర్కొంటున్న సమస్యలు 50, 50 కంటే తక్కువ ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు సమస్య పరిష్కారానికి ఒక కమిటీని వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో డా ఎలగందుల శ్రీనివాస్ ఆర్గనైజేషన్ చైర్మన్, డాక్టర్స్అరుణ్ కటారి ప్రెసిడెంట్ ఎలెక్ట్ తానా తెలంగాణ స్టేట్, చాట్ల శ్రీధర్, డాక్టర్ రాజకుమార్, మంగీలాల్, సునీల్ రెడ్డి, డాక్టర్ మహేష్, సూర్యనారాయణ రెడ్డి, జగన్ మోహన్ రావు, బిఎన్.రావు, విజేందర్ రెడ్డి, టీకేకే నాయుడు, లక్ష్మణ్, డాక్టర్ నాగ రఘురాం, డాక్టర్ విజయ మోహన్ రెడ్డి, శ్రీలత రెడ్డి, శైలజ, మమతారెడ్డి, వై. నరేంద్ర, వి.జయరాం, డాక్టర్ ఇ. శైలజ, డాక్టర్ శేష శైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ రమణాచారి, డాక్టర్ రామ్ కిరణ్ డాక్టర్ అలిమ్, డాక్టర్ ఎం ఎల్ ఎన్ రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

### ఉపాధి, ఆదాయం వచ్చే పరిశ్రమలు

# రాష్ట్రం దాటకుండా చూడండి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు








**హైదరాబాద్ :** రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజా భవన్లో డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఇండస్ట్రియల్ ప్రమోషన్ సబ్ కమిటీ సమావేశం జరగా కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్, ఇప్పటికే చేసుకున్న ఎంవోయుల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒక పరిశ్రమ స్థాపిస్తే అందుకు అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇకనుంచి ప్రతి శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. ఒక పరిశ్రమ ఏర్పాటుతో అనేక అనుబంధ పరిశ్రమలు రావడం తద్వారా రాష్ట్ర యువతకు వేళల్లో ఉద్యోగాలు, రాష్ట్ర ఖజానాకు పెద్ద సంఖ్యలో ఆదాయం సమకూరే వ్యూహాత్మక ప్రాధాన్యతను అధికారులు దృష్టిలో పెట్టుకొని ఆ రకమైన ప్రతిపాదనలపై కసరత్తు చేయాలని అధికారులకు సబ్ కమిటీ సూచించింది. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హుండాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో 8528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయం గా సబ్ కమిటీ అభిప్రాయపడింది. ఈ రీసర్చ్ సెంటర్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుతో కొత్తగా 4276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు. రీసెర్చ్ సెంటర్ లో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ లైన్, ప్రోటో టైపింగ్ ప్రధాన వ్యవస్థలు ఉంటాయని కంపెనీ ప్రతినిధులు సబ్ కమిటీకి వివరించారు. ప్రస్తుతం ప్రారంభించబోతున్న పరిశ్రమలు రాబోయే కొద్ది సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉపాధి, ఆదాయాన్ని రాష్ట్రానికి సమకూరుస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్, సీఈఓ సెక్రటరీ అజిత్ రెడ్డి, %ఎస ్స్త్రఱఱఎ% విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత లేఖతో బీఆర్ఎస్‌కు నష్టం : జగ్గారెడ్డి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసీఆర్ కు రాసిన ఆరు పేజీల చేతితో రాసిన లేఖ ఇంకా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. అయితే ఈ లేఖపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. నేడు వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం లో జగ్గారెడ్డి మాట్లాడుతూ. కవిత లేఖ వల్ల కాంగ్రెస్ కు వచ్చిన నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 64 సీట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో బలంగా ఉందని.. అలాంటి లేఖలు వంద పుట్టుకొచ్చినా తమకు జరిగే ఏమీ లేదని, ఈ గొడవ వల్ల గులాబీ పార్టీకే తీరని నష్టమని స్పష్టం చేశారు.కవిత లేఖ బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుటుంబ "పంచాయితీ"ని బయటపెట్టిందన్న జగ్గారెడ్డి.. కొడుకు కేటీఆర్ ఉండగా వారసత్వం కూతురుకు ఎలా దక్కుతుందని వ్యాఖ్యానించారు.

### మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై

# విచారణకు ఆదేశించిన ప్రభుత్వం



**హైదరాబాద్ :** మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వీడియోలను సైతం రికార్డు చేస్తుండటం గమనార్హం. దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో సీఎం నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్టు సమాచారం. కంటెస్టెంట్‌లతో పాటు.. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ నుంచి సైతం పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న డిన్నర్‌లో ఎవరెవరు పాల్గొన్నారు, ఆరోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతో పాటు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

**మిల్లా మాగీ ఆరోపణలివే..**

'హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా' అంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణపై గౌరవం పెరిగిందని, అతిథ్యం బాగుందని మెచ్చుకుంటూనే మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలని పేర్కొన్నారు. ప్రపంచ సుందరి-2025 పోటీల నుంచి అర్థాంతరంగా వైదొలిగిన ఆమె ఇంగ్లాండ్ చేరిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యల్ని బ్రిటిష్ మీడియా ప్రచురించింది. ఈ కథనాలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఖండించారు. ఆ వాదనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సైతం తోసిపుచ్చారు.

## మొదటి పేజీ తరువాయి...

### కొచ్చి తీరంలోహై అలర్ట్..

**మునిగిన నౌకలో ప్రమాదకర రసాయనాలు..!**

**13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు**

**2 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్**



లైబీరియా: లైబీరియాకు చెందిన ఓభారీ నౌక కేరళ సము ద్రతీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో శని వారం ప్రమాదానికి గురైంది. తాజాగా అది పూర్తిగా సముద్రంలో మునిగిపోయినట్లు ఇండియన్‌కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. ఈనౌకలో 640 కంటైనర్లు ఉండగా..వాటిలో 13కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు, 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్న ట్లు తెలిపింది. ఇవి లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చితీరంలో హైఅలర్ట్ ప్రకటించారు. కంటైన ర్లను,అందులోంచి బయటకు వ చ్చిన ఇంధనం తీరంవైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళవిపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ' వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటన కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ప్రమాదంలో లైబీరియా నౌక**

లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివరం కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో తొలుత ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో అందులోని కొన్ని కం టైనర్లు సముద్రంలో పడిపోయాయి.విఝింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయ ల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా-3 నౌక శనివారం మధ్యాహ్నా నికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉండగా.. కంటైనర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమ నించిన ఇండియన్ కోస్ట్‌గార్డ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

### జపాన్‌ను అధిగమించిన భారత్..

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్ :** 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో మనం ఇప్పుడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నామని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వివరాలు తెలిపారు. 4 ట్రిలి యన్ డాలర్లతో జపాన్ ను అధిగమించి భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, త్వరలో జర్మనీని కూడా అధిగమించనుందని తెలిపారు. మనకంటే ముందు స్థానంలో అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే 2సంవత్సరాలలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవత రిస్తుందని ఐఎంఎఫ్ కూడా అం చనా వేస్తోందని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 2025 లో 6.2 శాతం, 2026 లో 6.3 శాతం వృద్ధి చెందుతుం దని అంచనా వేయడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రపంచంలో, ప్రాంతీయంగా మనతో పోటీ పడే దేశాల కంటే ఎక్కువ అని తెలిపారు. ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక వృద్ధిని 2025 లో 2.8 శాతంగా, 2026 లో 3.0 శాతంగా అంచనా వేసిందని వెల్లడించారు.

### ఫలించిన దర్యాప్తు బృందం ప్రయత్నాలు..

**హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెడ్ కార్నర్ నోటీసు అమలు ప్రక్రియను అమెరికా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభాకర్‌రావును అమె రికా నుంచి డిపోర్ట్ చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఆయ నను అమెరికా నుంచి భారత్‌కు పంపించేందుకు యూఎస్ హోంల్యాండ్ సెక్యూ రిటీ ఏజెన్సీ చర్యలు చేపట్టింది.దర్యాప్తు బృందం ప్రయత్నాలు ఫలించాయి. ప్రభాకర్ రావు తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని భారత్ తిరిగి పంపొద్దని పిటీషన్ వేశారు.దీనిపై స్పందించిన దర్యాప్తుబృందం.. ప్రభా కర్‌రావును రాజకీయ శరణార్థిగా గుర్తించకుండా ఫోన్‌ట్యాపింగ్ అక్రమా లను నివేదిక రూపంలో పంపింది.కాగా ఇప్పటికే ప్రభాకర్‌రావుకు నాంపల్లి కోర్టు జూన్ 20లోపు హాజరుకావాలని.. లేకుంటే ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తామని నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

**జూన్ 20వ తేదీ వరకు గడువు..**

కాగా ఈ కేసులో కీలక నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు ప్రొక్లె యిమ్డ్ అఫెండర్ (ప్రకటిత నేరస్థుడు) నోటీసులు జారీ అయ్యాయి. ప్రభా కర్‌రావు పోలీసు విచారణకు హాజరుకానందున ఆయనను ప్రకటిత నేరస్థ డిగా ప్రకటించాలని కోరుతూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి కోర్టు అనుమతించింది. అయితే, ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు న్యాయస్థానం జూన్ 20వ తేదీ వరకు గడువు ఇచ్చింది. జూన్ 20లోగా ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారి ముందు హాజరు కాని పక్షంలో ఆయనను ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు తారామతిలోని ప్రభాకర్ రావు ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు.. అక్కడి గోడకు నోటీసు అంటించారు.

**గడువులోగా విచారణకు హాజరు కాకపోతే..**

గడువులోగా ప్రభాకర్ రావు విచారణకు హాజరు కాకపోతే.. ప్రకటిత నేరస్థుడిగా గుర్తించి ప్రభాకర్‌రావుకు చెందిన స్థిర, చర ఆస్తులను దర్యాప్తు అధికారులు సీజ్ చేసే అవకాశం ఉంది. కాగా, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇప్పటికే తోసిపుచ్చిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావును అమెరికా నుంచి రప్పించడం కోసం దర్యాప్తు అధికారులు ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేయిం చారు. ప్రభాకర్‌రావు తప్పనిసరిగా విచారణకు హాజరుకావా ల్సిందేనని లేకపోతే ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు ద్వారా అమెరికా అధికారులతో మాట్లాడి ఆయ నను స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని సిట్ అధికారులు పేర్కొన్నారు.

### పూలే' సినిమా వీక్షించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ :** ప్రముఖ సామాజిక తత్వవేత్త, మహిళల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మహాత్మా జ్యోతి రావు పూలే, అతని భార్య సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రల ఆధారంగా బాలీవుడ్‌లో 'పూలే' సినిమా రూపొందించిన విషయం తెలిసిందే. పూలే దంపతుల జీవితం వారి పోరాటాలు, సామాజిక సంస్కరణలు, వారు చేసిన కృషి తదితర అంశాలపై సినిమా ద్వారా చూపించారు. తాజాగా ఈ సినిమాను బంజా రాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో బీసీ నాయకులు వీక్షించారు. ప్రసాద్ ల్యాబ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు బీసీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతిని ధులు, బీసీ సంఘాలు నేతలు, ప్రముఖులు కలిసి సినిమాను వీక్షించారు. సామాజానికి పూలే దంపతులు చేసిన కృషిని వారు కొనియాడారు. ఈ దంపతులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీ నేతలు పిలుపునిచ్చారు.కాగా, అనంత్ మహాదేవన్ దర్శకత్వంలో ప్రముఖ నటు లు ప్రతీక్ గాంధీ, పత్రలేఖ ప్రధాన పాత్రలలో 'పూలే' సినిమాను బాలివుడ్‌లో రూపొందించారు. మొదట ఈ చిత్రం ఏప్రిల్ 11న విడుదల కావాల్సి ఉంది.

# తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపాన్ని పునర్మించాలి

- మరొకచోట కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- లేకుంటే స్వయంగా మేమే తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని నిర్మిస్తాం
- అమరవీరుల స్మారక పిల్లర్ వద్ద ఉద్యమకారుల హెచ్చరిక



**పాలకుర్తి, (జనగాం జిల్లా) :** తెలంగాణ అమరవీరుల స్మారకార్థం కోసం నిర్మించిన పిల్లర్ వద్ద తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని పున నిర్మాణం చేయాలని, అందుకు స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవ చూపాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్మారకార్థం రాజీవ్ చౌరస్తాలో నిర్మించిన పిల్లర్ వద్ద తెలంగాణ ఉద్యమకారులు తమ నిరసనను వ్యక్తం చేశారు. కొద్ది మంది కావాలని విచ్ఛిన్నకర శక్తులు తెలంగాణ అమరవీరుల స్మారక పిల్లర్ ను ఆక్రమించి మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇది దుర్మార్గపు చర్య అని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన త్యాగం మరువలేని అని ఆయన విగ్రహం మరొకచోట పెట్టి, చౌరస్తాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆయనను గౌరవించుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే కొద్ది మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. ప్రభుత్వం నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్మారక పిల్లర్ ను ఆక్రమించడం సరికాదని హితవు పలికారు. పాలకుర్తి ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందని అలాంటి ఈ ప్రాంతానికి చెడ్డ పేరు తీసుకురావద్దని సూచించారు. తెలంగాణ కోసం 1500 మంది ప్రాణాలర్పించిన అమరవీరుల కోసం నిర్మించిన స్మారక పిల్లర్ ఆక్రమణ గురైనప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వెంటనే స్పందించి దానిని స్వాధీనం చేసుకొని స్థూపాన్ని పునర్నిర్మానం చేయాలని, ప్రారంభించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారులు స్పందించకపోతే.. ఉద్యమకారులుగా తాము స్పందిస్తామని తాము స్మారక స్థూపాన్ని నిర్మిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర అధ్యక్షులు గోధుమల కుమారస్వామి, తెలంగాణ ఉద్యమకారుడు బద్రి, వివిధ జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు, జనగామ జిల్లా కన్వీనర్ పోలాస సోమయ్య, జిల్లాలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల పలు మండలాల ఉద్యమకారులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు వారి పిల్లలను శక్తి మేర చదివించాలి : పొన్నం

**హైదరాబాద్ :** విద్యను రాబోయే తరానికి అందించే క్రమంలో పిల్లలను వారి శక్తి మేరకు చదివించాలని తల్లిదండ్రులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. అప్పుడు సమాజంలో అందరూ విద్యకు దగ్గరవుతారన్నారు.మహిళలను స్వేచ్ఛగా ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ఆకాం క్షించారు. ఆదివారం బంజారాహి ల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సామాజికవేత్త మహాత్మా జ్యోతిరావుపూలే సినిమాను బీసీ ప్రజా ప్రతిని ధులతోపాటు బీసీ సంఘాలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ వీక్షించారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటిసారిగా వెనుకబ డిన బలహీన వర్గాలకు సంబంధించి కాకా సాహెబు కాలేల్కర్ ఒక ప్రతిపాదనను సిద్ధం చేశారన్నారు. ఆయన ప్రతిపాదన మేరకు బీసీ మండల కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు.



దేశంలో బీసీల వికాసం కోసం వీరు పని చేశారని చెప్పారు. వీరికి స్ఫూర్తి జ్యోతిరావు పూలే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. వీరందరి కృషిని కొనసాగిస్తూ తెలంగాణ ప్రభుత్వ సారథ్యంలో దేశంలోనే తొలిసారిగా కుల గణన చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. అందుకు మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తిదాయక మని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్లు వచ్చినప్పుడు ఎస్సీ,ఎస్టీ లకు సైతం ఇవ్వాలన్నప్పుడు ఆ బిల్లు పెండిం గ్‌లో పడిందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డిని సినిమా ప్రముఖులతో కలిసి ట్యాక్స్ మినహాయింపు జరిగేలా చేస్తామన్నారు. ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా కుల గణన చేసుకున్నా మని.. తద్వారా బీసీలకు చట్టంలో రిజర్వేషన్లు పెంచుకున్నామన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక సమీకరణలు మారాలని చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినిమాలో చూపించిన సారాంశాన్ని సమాజంలో ప్రతి బలహీన వర్గాల బిడ్డ విద్యకు దూరంగా ఉం డకుండా చూడాలని పిలుపు నిచ్చారు. మహి ళా అభ్యున్నతికి వాళ్లు సాధికారత సాధించా లని చెప్పారు.ప్రొ. కంచె ఐలయ్య సూచన మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు బీసీ సంఘాల నేతలకు ఈ సినిమా చూపించామ న్నారు.ఇక తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావుపూలే సినిమా అద్భుతంగా ఉంద న్నారు. ఈసినిమా చూపించినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. 1888 నుండి ఇప్పటి వరకు సమాజంలో మార్పులు.. వీటితోపాటు బ్రహ్మణిజంఉందా? అనేది మీరు ఆలోచించు కోవాలన్నారు.సామాజిక సంస్కరణ, విద్య ముఖ్యమన్నారు. ఇక ఈ సినిమాలో పూలే గురించి 10 శాతమే ఉందన్నారు. ఆ రోజు ల్లో ఆయన సమాజంలో ఎన్నో కష్టాలు పడ్డా రని చెప్పారు. మహిళల విద్యకి ప్రాధాన్యత ఇవ్వాలని.. అలాగే ఈ చిత్రాన్ని అందరికీ చూపించాలని కే కేశవరావు పిలుపునిచ్చారు.

# సీఎం రేవంత్ ఏం చేస్తున్నట్లు?

**-ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రాజెక్టులకు ఏపీ ప్రభు త్వాలు అనేకసార్లు అడ్డుపడ్డాయని, కోర్టులు, ట్రిబ్యునల్స్ లో అనేక కేసులు వేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు పై మీడియాతో మాట్లాడిన ఆయన.. ఏ రాష్ట్రం లోనైనా కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే కేఆర్ఎంబీ , జీఆర్ఎంబీ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. సంబంధిత నదిపరివాహక రాష్ట్రాల నుంచి అంతర్రాష్ట్ర ఒప్పందం జరగాలంటే నదిపరివాహక ప్రాంతానికి అనుకుని అన్ని రాష్ట్రాలు అందుకు ఒప్పుకోవాలి. సెం ట్రల్ వాటర్ కమిషన్ క్లియరెన్స్, ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ తీసుకోవాలి. ఈ నియమ, నిబంధనలేవీ పాటించకుండానే గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. కేంద్రం జుట్టు



తమచేతిలో ఉందని రాత్రికి రాత్రే ప్రాజెక్ట్ రూపకల్పన చేసి, టెండర్లు పిలిచి కేంద్రం ముందు పెట్టారని ఆరోపించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మొదలుపెట్టిన ప్రాజెక్టులకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అడ్డుపడ్డాయని, ఇప్పుడు కొత్త ప్రాజెక్టును నియమ, నిబంధనలను ఉల్లంఘించి ఎలా కడుతున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ పై సీఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్ మీటింగ్ లో ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. కేంద్ర బడ్జెట్ (2025-26) లో తెలంగాణకు అన్యాయం చేశారని వాపోయిన సీఎం.. ఇప్పుడెందుకు నోరు మెదపట్లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేని వారికి పదవుల్లో కొనసాగే అర్హత ఉందా ? అని ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. బనకచర్ల ప్రాజెక్టులో కలిసేవి సముద్రం నీరు కాదని, రాష్ట్రం నుంచి నీళ్లను ఎత్తుకెళ్తుంటే కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారు ? ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఎలా అనుమతిస్తుంది? అని హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పటికే మూసీ సుందరీకరణకు అప్పు రాలేదు. మెట్రో రైల్ ప్రాజెక్ట్ కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. నీతి ఆయోగ్ లో ఈ ప్రాజెక్ట్ గురించి సీఎం రేవంత్ గట్టిగా నిలదీస్తారని అనుకున్నానని, తీరా చూస్తే ఈ ప్రాజెక్ట్ ప్రస్తావనే ప్రధాని వద్ద రాలేదన్నారు.రాష్ట్రానికి నీటి నష్టం జరగబోతుంటే సీఎం, జలవనరులశాఖ మంత్రి నోరు మెదపరేంటని హరీష్ రావు ప్రశ్నించారు. ఆర్డీఎస్ ప్రాజెక్ట్ కట్టేశాం కాబట్టి నీళ్లు తీసుకుంటామని పథకం ప్రకారం జరుగుతున్న కుట్ర అన్నారు. ఏపీలో పోలవరంకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రం.. తెలంగాణలో కాళేశ్వరం , మరో ప్రాజెక్టుకు ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టులకు రూ.60 వేల కోట్ల వరకూ సహాయం చేస్తున్న కేంద్రం.. తెలంగాణలో ప్రాజెక్టులకు ఒక్కపైసా అయినా ఇచ్చారా? అని నిలదీశారు. తెలంగాణ వాడుకోలేకపోవడం వల్లే ఆ నీరు కిందికి పోతుందేతప్ప.. తెలంగాణ వాడుకుంటే అవి సముద్రంలోకి పోవన్నారు. తెలంగాణ నీళ్లను తీసుకెళు తుంటే.. కేంద్రమంత్రులైన కిషన్ రెడ్డి , బండి సంజయ్ ఏం చేస్తున్నారని అడిగారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని.. అవి వరద జలాలుకావని గుర్తించి గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రాన్ని ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు.

# చిన్నారులను ఛిదిమేస్తున్నారు

**మొదటి పేజీ తరువాయి.....** భర్తల మధ్య ఏదైనా చిన్నచిన్న గొడవలు జరిగినా వారు పరిష్కరించే వారు. అలగే పిల్లల ఆలనా పాలనా సైతం చూసుకునే వారు. వారి తల్లిదం డ్రులు పిల్లల పట్ల ఏమైనా అనుచితంగా ప్రవర్తించినా అడ్డుకునేవారు. కాని ప్రస్తుత కాలంలో వివాహం అయిన వెంటనే వేరు కాపురం పెట్టడంతో వారు పిల్లలు పుట్టాక పెద్దవారైనా మన్న భావనతో అనాలోచితమైన నిర్ణయాలకు పాల్పడుతూ.. అడ్డు చెప్పేవారు లేకపోవడం వల్ల ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. భర్త ప్రవర్తన నచ్చలేదని భార్య, భార్య ప్రవర్తన నచ్చలేదని భర్త ఆరోపణలు చేసుకుంటూ కుటుంబాల్లో కళహాలు పెట్టుకుంటున్నారు. దీన్ని అదునుగా భావించి గతంలో పరిచయం ఉన్నవారితోనో, లేదా కొత్తగా పరిచయాలు సైతం ఏర్పరుచుకుని అక్రమ సంబంధాలు ఏర్పరుచుకుంటున్నారు. అడ్డువస్తే పిల్లలను చంపడానికైనా వెనుకాడడం లేదు.. వారి స్వార్థంకోసం ఎంతటికైనా తెగిస్తారని పరిస్థి తులను చూస్తే అర్థం అవుతోంది. మితిమీరిన స్వేచ్ఛకారణంగానే సహనం కోల్పోయి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, వారు రక్షసులకుంటే ఘోరంగా మారుతుంటారని సైకాలజిస్టులు పేర్కొంటున్నారు.గతంలో కరీంనగర్ జిల్లాకు చెందిన రజని తన ప్రియుడి మాయంలో పడి భర్తను విడిలేసి ప్రియుడి పెళ్లి చేసుకునేందుకు ఇద్దరు కూతు ళ్లను తన తల్లి సహాయంతో చంపేసింది. అనంతరం పోలీసులకు దొరికిపోయి కటకటాల పాలైంది. నెల క్రితం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో భర్త, ముగ్గురు పిల్లలు సాయిక్రిష్ణ, మధుప్రియ, గౌతమ్‌తో నివాసం ఉంటున్న రజిత అనే వివాహిత పదో తరగతి చదువుకున్న స్నేహితులు గెట్‌టూ గెదర్ పార్టీ ఏర్పాటు చేశారు. పార్టీకి హాజరైన ఆమె తన స్నేహితుడు శివతో పరిచయం పెంచుకుని అక్రమ సంబంధం ఏర్పరుచు కుంది. అనంతరం అతన్ని వివాహం చేసుకోవడానికి భర్త పిల్లలు అడ్డు వస్తారనే నెపంతో వారిని అడ్డుతొలగించుకోవాడానికి పథకం వేసింది. పిల్లలకు భోజనంలో విషం కలిపి గొంతు నలిపి చంపేసింది. ఇది రాష్ట్రవ్యాప్తంగా చాలా సంచలనం రేపింది. తన పిల్లలను చంపడం వల్ల భర్త ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు రజిత కటకటాల పాలైంది. గత కొన్ని నెలల క్రితం కాకినాడలోని ఓన్‌జీసీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఒక వ్యక్తి తన ఇద్దరు పిల్లలను చదువులో సరిగా రాణిస్తలేరన్న నేపంతో నీటి బకెట్లలో ముంచి అత్యంత ఘోరంగా చంపేసాడు. అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది తాను అనాలోచిత నిర్ణయాల వల్ల అత్మన్యూనత కారణంతో పిల్లల జీవితాలను నాశనం చేశాడు. ఇత రులతో పోల్చుకోవడమే ప్రధాన కారంణంగా మారిందని నిపుణులు చెబుతున్నారు.అదే విధంగా గత నెలలో హైదరాబాద్‌లోని గాజుల రామారంలో తేజశ్విని రెడ్డి అనే మహిళ తన ఇద్దరి పిల్లలు హర్షిత్ రెడ్డి, హాషిస్ రెడ్డిని అత్యంత దారుణంగా కొబ్బరి బొండాలు నరికే కత్తితో నరికి చంపి తాను కూడా ఆత్మ హత్య చేసుకుంది. ఇది మానవ జాతి అవమానంతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అత్యంత ఘోరమైన చర్యకు భార్యాభర్తల మధ్య కలహాలే కారణమని తెలుస్తోంది.హర్యాణాలో ఏప్రిల్‌లో జరిగిన మరో ఉదంతం.. సీరియల్ చూస్తుండగా తను ఇబ్బంది పెడుతున్నాడని తన బావ కొడుకు జాష్‌ను మొబైల్ కేబుల్‌తో అరేసి చంపెసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేయగా ఆమె మానసిక స్థితి బాగా లేదని పేర్కొన్నారు.ఇలాంటి సమస్యలు సమాజంలో ఏదో ఒక చోట చోటు చేసుకుం టున్నాయి. ఇలాంటి వారిని కిఠినంగా శిక్షించాలని పలు కుటుంబ పెద్దలు, పలు సంఘాల నాయకులు కోరుతున్నారు. లేదంటే సమాజం పెడదారి పట్టే ప్రమాదం ఉందని అంటున్నారు.

# పవన్ కోపంలో న్యాయం ఉంది..

**-లేఖ సమర్థనీయమే : అల్లు అరవింద్**

**హైదరాబాద్ :** తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి వెళ్లి ఎవరు ఏది అడిగినా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సాయం చేస్తున్నారని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. థియేటర్ల బంద్‌పై జరుగుతున్న రచ్చపై ఆయన స్పందించారు. అశ్వినీదత్ సినిమా విషయంలో టికెట్ రేటు పెంచుకునే అవకాశం కోసం పవన్ కల్యాణ్‌ను తాము కలిస్తే సీఎం చంద్రబాబును కలవమని హింట్ ఇచ్చారు. అయితే ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. చంద్రబాబు, పవన్ తమకు తెలిసినవారేనని, తామెల్లి పని చేయించు కుంటామని అన్నారని అశ్వినీదత్ పేర్కొన్నారు. ఛాంబర్ కానీ, ఏం సంస్థ గానీ అధికారికంగా ఏపీ ప్రభుత్వాన్ని కలవలేదన్నారు. ఇండస్ట్రీ పెద్దలు సీఎం చంద్రబాబును కలవకపోవడంపై పవన్ కోపంలో న్యాయముం దని, డిప్యూటీ సీఎం కార్యా లయం లేఖ విడుదల సమర్థనీయమేనని అల్లు అరవింద్ తెలిపారు.

### మానవ శరీర భాగాలు
# బ్లాక్ మార్కెట్‌లో విక్రయం..

**'హార్వర్డ్' మాజీ ఉద్యోగి నిర్వాకం**



**వాషింగ్టన్ :** హార్వర్డ్ యూనివర్సిటీ వైద్య విభాగా నికి దానంగా ఇచ్చిన మృతదేహాల నుంచి శరీర భాగాలను మాయం చేసిన కేసులో విశ్వవిద్యాలయానికి చెందిన మాజీ ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ మార్చురీలో మాజీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన 57 ఏళ్ల సెడ్రిక్ లాడ్జ అనే వ్యక్తి వ్యక్తి మృతదేహాల నుంచి అవయవాలను వేరు చేసి బ్లాక్ మార్కెట్‌లో అమ్మినట్లు అధికారులు పేర్కొన్నారు. పీపుల్ మ్యాగజైన్ చేసిన ఆరోపణల ప్రకారం.. హార్వర్డ్ మెడికల్ స్కూల్ మార్చురీలో మాజీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన 57 ఏళ్ల సెడ్రిక్ లాడ్జ్‌కు పెన్సిల్వేనియాలోని ఒక వ్యక్తి మూడేళ్లలో దాదాపు 37,355.16 బిలియన్ డాలర్లను ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. చెల్లింపుల సమయంలో "హెడ్ నంబర్ 7" వంటి అనుమానాస్పద పదాలు ఉన్నట్లు గుర్తించారు. మసాచుసెట్స్‌లోని ఒక మహిళకు మానవ చర్మాన్ని సరఫరా చేసినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో గతేడాది పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా పెన్సిల్వేనియాలోని ఒక ఫెడరల్ కోర్టులో విచారణ సందర్భంగా అతడు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. 2018- 2020 మధ్య వైద్య పరిశోధన కోసం హార్వర్డ్ అనాటమికల్ గిఫ్ట్ ప్రోగ్రామ్‌కు విరాళంగా ఇచ్చిన మార్చురీలోని శవాల నుంచి శరీర భాగాలను దొంగలించి.. వాటిని డార్క్ వెబ్‌సైట్లలో అంతర్రాష్ట్ర రవాణా చేసినట్లు సెడ్రిక్ లాడ్జ తెలిపాడు. బోస్టన్‌లోని హార్వర్డ్ మార్చురీ నుంచి దొంగలించిన శరీర భాగాలను సెడ్రిక్ లాడ్జ్ న్యూ హాంప్‌షైర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి భద్రపరిచేవాడినని.. అనంతరం వాటిని తన భార్య సహకారంతో రాష్ట్రాల సరిహద్దుల మీదుగా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేవాడినని వెల్లడించాడు. ఒక్కోసారి కొనుగోలుదారులు నేరుగా అతడి నివాసానికి వచ్చి అవయవాలను తీసుకెళ్లేవారని చెప్పాడు. వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడాలని సేవాభావంతో దానం చేసిన మృతదేహాల అవయవాలను అక్రమ రవాణా చేసినందుకు అతడికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతరులపైనా కేసు నమోదు చేశారు. ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్ మసాచుసెట్స్, న్యూహాంప్‌షైర్, పెన్సిల్వేనియా వంటి ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

సోమవారం । తెలంగాణ
26 మే 2025
www.ninadam.co.in

## బీసీల మేలుకొలుపు యాత్ర జక్కని సంజయ్



**మల్హర్ మే 25 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల్ కొయ్యూర్ జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీసీ మేలుకొలుపు యాత్ర నిర్వహించారు. వాన్నిడి నుండి అలంపూర్ వరకు నిర్వహిస్తున్న ఈ యాత్రలో ముఖ్య అతిథిగా జక్కని సంజయ్ కుమార్, క్యాతం మహేందర్ గారు పాల్గొని ఈరోజు కొయ్యూర్ లో యాత్ర నిర్వహించడం జరిగింది.కావున ఆయా బీసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల బీసీ సంఘం నేతలు, నాయకులు, కుల సంఘాల నాయకులు, బహుజన వాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మలహర్ మండల బాద్యులు కొయ్యూరు మాజీ సర్పంచ్ లింగమూర్తి, మండల బీసీ నాయకులు జాగరి హరీష్, అక్కినపేని సుమన్, బండారి సమ్మయ్య, తోట రాజేశ్వర్ రావు, అక్కినవేని సమ్మయ్య, వేముల శ్రీశైలం, మధుకర్ సమ్మయ్య,మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద చర్యలను వ్యతిరేకించాలి



**నర్సంపేట, మే 25(నినాదం):** ప్రజల ప్రజల ప్రాణాలు తీస్తున్న ఉగ్రవాదుల చర్యలను ప్రజా స్వామికవాదులు వ్యతిరేకించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక (టీఎస్డిఎఫ్)రాష్ట్ర బాధ్యులు నైనాల విజయ్ కుమార్, గుర్రం గోవర్ధన్ అన్నారు. నర్సంపేట పట్టణం లోని ఓంకార్ భవనం లో ఎంసిపిఐ(యు),న్యూ డెమోక్రసీ, టీఎస్డిఎఫ్, సిపిఐ ఎం ఎల్ అధ్యర్యంలో పెద్దారపు రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం లో హంసరెడ్డి, మంద రవి, నర్రా ప్రతాప్, సుంచు జగదీశ్వర్, సిపిఐ ఎం ఎల్ నుంచి మోడెం మల్లేశం, న్యూ డెమోక్రసీ నుంచి రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, చంద్రన్న వర్గం నుండి నున్నా అప్పారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్, గోవర్ధన్ లు మాట్లాడుతూ అకారణంగా దేశ పౌరుల ప్రాణాలను తీసే ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ఎదుర్కోవాలన్నారు. ఉగ్రవాద చర్యలను, ఉగ్రవాద చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన పౌరుల జీవితాలను తమ స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకునే పాలకుల కుట్రలను బట్టబయలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక (టి ఎస్ డి ఎఫ్) రాష్ట్ర బాధ్యులు నైనాల గోవర్ధన్ గుర్రం విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. విచక్షణారహితంగా ఉగ్రవాదులు జరిపిన దాడి హేయనీయమైనదని, ఉగ్రవాదుల దాడులను పాకిస్తాన్ కుట్రలను అడ్డుకోవలసిన కేంద్ర ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మతాలలో మధ్య చిచ్చుపెట్టే విధంగా భారత పౌరులను చీల్చే విధంగా ప్రచారం చేపట్టడం సిగ్గుమాలిన చర్య అన్నారు. పర్యాటకులకు తగిన భద్రత కల్పించడంలో విఫలమైన కేంద్రం పాకిస్తాన్ పై దాడి చేసి ఎంతో సాధించామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.పౌరుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని,మనిషిని మనిషి చంపుకుని దొచుకునే విధానాలకు స్వస్తి చెప్పి,మనుషుల మధ్య మానవత్వాన్ని సామరస్యతను మేల్కొల్పే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ క్రమంలో ప్రజల్లో చైతన్యాన్ని నింపేందుకు పాలకులను మేల్కొల్పేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ప్రయత్నిస్తున్నదని అందులో భాగంగా జూన్ 14వ తేదీన వరంగల్ నగరంలో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశాన్ని రక్షించుకునేందుకు సమానత్వాన్ని పొందేందుకు ప్రజలు ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) నుంచి గోనె కుమారస్వామి ఎన్ రెడ్డి హంసారెడ్డి మంద రవి నర్ర ప్రతాప్ సుంచు జగదీశ్వర్, సిపిఐ ఎంఎల్ నుంచి మోడం మల్లేశం, న్యూ డెమోక్రసీ నుంచి రాచర్ల బాలరాజు గంగుల దయాకర్ ఎలకంటి రాజేందర్, చంద్రన్న వర్గం నుంచి నున్న అప్పారావు మొగిలి ప్రతాపరెడ్డి, ఇనాం నుంచి జబీర్ మహమ్మద్, కాజా అస్లం, ఎయిడిఎం నుంచి అబ్దుల్ సుభాన్ రైతు సంఘం నుంచి సోమిడి శ్రీనివాస్, ఊరటి హంసల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**చేవెళ్ల మే 25(నినాదం న్యూస్):** రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు మున్సిపల్ పరిధి చిన్నశంకర్‌పల్లి వార్డుకు చెందిన జొన్నాడ బాలరాజ్ గౌడ్ (66) ఆదివారం మధ్యాహ్నం పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వికారాబాద్ రైల్వే ఆసుపత్రికి తరలించారు. బాలరాజ్ గౌడ్ మృతితో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కుమారుడు మల్లేష్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో గోకకు సన్మానం

**నర్సంపేట, మే 25(నినాదం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమలాపురంలో కోనసీమ చిత్ర చిత్రకళ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన చిత్రకళ మిత్ర అవార్డు పొందిన నర్సంపేట వాస్తవ్యులు గోక రామస్వామికి గవర్నర్ ఎలెక్ట్ వాకర్స్ ఇంటర్నేషనల్ 303,నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో సేవను అందిస్తూ, చిత్రకళ ప్రదర్శనలో అవార్డు పొందిన రామస్వామి ప్రతిభను గుర్తించి నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించినట్లు తెలిపారు..చిత్రకళ మిత్ర అవార్డు గ్రహీత రామస్వామి మాట్లాడుతూ నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని, అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సన్మానం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పుల్లూరి స్వామి,పైడయ్య, అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఆడెపు సదానందంకోశాధికారి సంకినేని కృష్ణ,సహాయ కార్యదర్శి పవిత్రన్,వృద్ధిరాజ్,విక్రమ,పూల్ సింగ్, మోహన్, చంద్రమౌళి, అశోక్, ప్రభాకర్, గోక వినోద్ పాల్గొన్నారు



# వృత్తికులాల ఐక్యతకు గండ దీపం కవిత్వం ప్రతీక

- తెలంగాణ ఆస్తిత్వ, సాంస్కృతిక సంపద గండ దీపం : డా.అంబటి సురేంద్ర రాజు
- గండదీపం కవిత్వం సబ్బండ కులాల గుండె దీపం
- తరతరాల వారసత్వ జీవన తాత్వికత గండ దీపం కవిత్వం
- గండ దీపం ఆవిష్కరణ సభలో ప్రముఖ కవి, పాత్రికేయులు రమేష్ హజారి ఆప్తవాక్యం



**హైదరాబాద్, మే 25 (నినాదం న్యూస్):** పల్లె చుట్టూ అల్లుకున్న మానవ శ్రమ జీవన సౌందర్యాత్మక వృత్తి కళలు, ప్రకృతి వస్తు ప్రపంచ నేపథ్యాన్ని అల్లుకొని రాసిన గండదీపం పుస్తకావిష్కరణ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మెయిన్ హాల్లో జరిగింది. ఈ పుస్తకాన్ని అంబటి సురేంద్ర రాజు ఆవిష్కరించారు. కవి జర్నలిస్టు రమేశ్ హజారి ప్రారంభోపన్యాసం చేశారు. తొలికాపిని ప్రముఖ సైంటిస్ట్ రాపాక సుభాష్ చంద్రబోస్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత విమర్శకులు, కవి, రచయిత గండ దీపం పుస్తక ఆవిష్కర్త, డా. అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ.. సమాజానికి నాగరికత నేర్పింది విశ్వకర్మలేనని, వారి జీవిత అనుభవాలను కవి కవిత్వంగా రాసారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ఆధునికంగా వినిపిస్తున్న గొప్ప కవిత్వం సరసన పుష్పగిరి కవిత్వం నిలుస్తుందని, అబ్బురపరిచే పద చిత్రాలతో వినూత్న కవిత్వాన్ని పుష్పగిరి రాస్తున్నాడని సురేంద్రరాజు తెలిపాడు. తెలంగాణ అస్తిత్వాన్ని సాంస్కృతిక సంపదను సామాజిక తాత్వికతను గండ దీపం' లో కవి పలికించాడని అన్నారు. ప్రస్తుత సామాజిక రాజకీయ వర్తమాన సందర్భంలో పుష్పగిరి కవిత్వానిది కీలక పాత్ర అని అన్నారు. వృత్తికులాల ఐక్యతకు ఈ కవిత్వం ప్రతీకగా నిలుస్తోందని, ప్రతి లైబ్రరీ లో, ప్రతి ఒక్కరి చేతిలో ఈ పుస్తకం ఉండాలని ఈ కవిత్వం పై విస్తృతంగా చర్చ జరగాలని అసుర అన్నారు. కవి రచయిత, పాత్రికేయులు రమేష్ హజారి ఈ సందర్భంగా ఆప్తవాక్యం పలుకుతూ... సామాజిక పద చిత్రాలతో పుష్పగిరి గండ దీపాన్ని వెలిగించాడని, తన కవిత్వం సబ్బండ కులాల గుండె దీపమని అన్నారు. తెలంగాణ ప్రతి పల్లె కుల బంధాలు, రక్తసంబంధాల కంటే మానవ జీవన ఉత్పత్తి సంబంధాలకు నిలయమని రమేష్ హజారీ పేర్కొన్నారు. గండ దీపం కవిత్వం పల్లె, ప్రజల చుట్టూ అల్లుకున్న కవిత్వమని, ఉత్పత్తి లో భాగస్వామ్య మైన ప్రజల జీవన విధానం సంస్కృతి కవిత్వంగా వెలువడిందని అన్నారు. తరతరాల వారసత్వంగా వస్తున్న జీవన తాత్వికత ఈ కవిత్వంలో ఇమిడి ఉందన్నారు. కేసీఆర్ సారధ్యంలో తెలంగాణ మలి దశ ఉద్యమ పోరాటంలో సబ్బండ కులాలు సకలజనులు చైతన్యమై పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నారని, పదేండ్ల అనతికాలంలో సబ్బండ వృత్తి కులాల జీవితాల్లో గుణాత్మక ప్రగతి సాధించుకున్నామని, అదే స్ఫూర్తి నీ కొనసాగిస్తూ భవిష్యత్ తరాల కోసం పాటు పడాలని రమేష్ హజారీ తెలిపారు. అనంతరం రచయిత విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ... గండదీపం కవిత్వం నిండా ఊరు, అమ్మ, ప్రకృతి, కుల వృత్తుల సౌందర్యం, పల్లె జనాల ఆత్మీయత ఉన్నాయని, ఎదుగుతున్న క్రమంలో పల్లె చిద్రమైన దుఃఖమే తన గండదీపం.. కవిత్వమని అన్నారు. ఈ కవిత్వానికి ముందు మాట రాసిన ప్రముఖ కవి వాగ్గేయకారులు గోరేటి వెంకన్న కు, ఆప్తవాక్యంగా కవిత్వాన్ని సమీక్షించి దానికో సైద్ధాంతికత దృక్పథాన్ని అద్దిన రమేష్ హజారి, పుస్తక అంకితాన్ని స్వీకరించి ఆవిష్కరణ చేసిన డా. అంబటి సురేంద్ర రాజుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తల్లి రూపశిల్పి బివిఆర్ చారి, ఏ సి పి కిరణ్ కుమార్, డా. హరికాంత్, అనుముల ప్రభాకరాచారి, డా. నరసింహా చారి, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

## వార్షికోత్సవ వేడుకలకు సాయి బాబా ఆలయం ముస్తాబు







**చింతపల్లి, మే 25 (నినాదం న్యూస్):** పిలిచిన పలికే దైవంగా భక్తకోటి జనుల గుండెల్లో నిలిచిపోయిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ 18 వ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబవుతుంది. అభినవ షిరిడి మందిరముగా పేరుగాంచిన మండల కేంద్రంలో హైదరాబాద్ – నాగార్జున సాగర్ రహదారి పక్కన సుమారు నాలుగు కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. రాజస్థాన్ లోని జయపూర్ నుంచి స్వామివారి పాలరాతి విగ్రహాన్ని తెప్పించి 2007 జూన్ 17 వ తేదీన ఉదయం 11.34 గంటలకు పునర్వసు నక్షత్ర యుక్త సింహ లగ్న పుష్కరాంశమున పుణ్యపాదులు శ్రీ ముక్కామల మహా క్షేత్ర పీఠాధిపతి శ్రీ శ్రీధర స్వామి కరకమలములచే విగ్రహ ప్రతిష్ట ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సరస్వతీ మాత, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ సీతారాముల స్వామి, మహా శివలింగం, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేశారు. మూల విరాట్ కొలువుదీరిన మండపాన్ని పూర్తిగా స్వర్ణమయంగా రూపుదిద్దారు.ప్రతి ఏడాది ఆలయంలో దసరా, ఉగాది, దీపావళి, గురు పౌర్ణమి, ఆలయ వార్షికోత్సవం, శ్రీరామనవమి, తదితర ఉత్సవాల సందర్భంగా దేవతామూర్తుల కళ్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం ఆలవాయితీగా వస్తుంది. అదేవిధంగా భక్తులలో జాతీయ భావం కలగడానికి ప్రతిరోజు ఉదయం జాతీయ జెండాను ఏర్పాటు చేసి జనగణమన ఆలపించడం ఇక్కడి ఆలయ విశేషంగా చెప్పుకోవచ్చు. ఆలయ ఆధ్వర్యంలో సుమారు 400 ఆవులను పోషించడంపట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది.ఈ నేపథ్యంలో ఆలయ 18 వ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 27, 28, 29 తేదీలలో వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య ఆధ్వర్యంలో ఆలయాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 27న మంగళ వారం ఉదయం 8:30 గంటలకు మంగళ వాయిద్య సుంఘోషణ, గణపతి ప్రార్థన, గోపూజ, సాయంత్రం 4.30 గంటలకు అంకురారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 28వ తేదీ బుధవారం రోజున ఉదయం 8.00 గంటలకు గవ్యాంత పూజ, వాస్తు పూజ, వాస్తు హెూమం, కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. ఈ నెల 29వ తేదీ గురువారం ఉదయం 11.00గంటలకు భూలోక వైకుంఠమైన శ్రీ స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసుకొని, శ్రీ వెంకటేశ్వర పద్మావతి ఆండాల్ అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధనుంజయ్య తెలిపారు. ఈ ఉత్సవాలను శ్రీ ముక్కామల పీఠాధిపతి శ్రీ శ్రీధర స్వామి ఆశీస్సులతో, చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ కొడకండ్ల రామశరణ్ శర్మ, శైవాగమ ప్రతిష్ఠాచార్య శానకొండ శివ కిరణ్ శర్మ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సాయంత్రం 6.00 గంటలకు కోలాట బృందం మాస్టారు మొక్కపాటి బ్రహ్మం ఆధ్వర్యంలో స్వామివారి శోభాయాత్రను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం 1:30 గంటలకు నారాయణ సేవ పేరున భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం, రాత్రి 8. 00 గంటలకు అల్పాహార ఏర్పాట్లు కల్పించినట్లు ఆయన తెలిపారు. స్వామివారి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ పాలన ఈ దేశానికి అత్యంత ప్రమాదకరం

- రాజకీయ తరగతులు ప్రారంభంలో
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



**డోర్నకల్/మరిపెడ మే 25(నినాదం న్యూస్) :** నియంత పాలన కొనసాగిస్తున్న నరేంద్ర మోడీ ఈ దేశానికి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యారని సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు.ఆదివారం మహబూబాద్ జిల్లా మరిపెడ పట్టణ కేంద్రంలోని స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో ఐదు రోజులపాటు జరగనున్న రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.అంతకుముందు అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు.అమరవీరులకు జోహార్లు అర్పించారు.అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య అధ్యక్షతన ప్రారంభమైన సభకు సాదుల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ సౌరభామ అధికారాన్ని నియంతృతంగా ప్రధాని నరేంద్ర మోడీ వాడుకుంటున్నారని విమర్శించారు. బిజెపి ఆర్ఎస్ఎస్ కనుసైగల్లో దేశ ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉధృత వాతావరణాన్ని నెలకొల్పుతున్నారని ఆరోపించారు.ప్రజాస్వామ్యహితంగానే మతోన్మాద పాసింజమును అడ్డం పెట్టుకొని ఎన్నికలు, పార్లమెంటు వ్యవస్థలో మతఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు.పాకిస్తాన్.యుద్ధం చేయడం హిందు వాదులు మోడీని బలపరిచిన,చివరికి అమెరికా అధ్యక్షుడు ట్రంఫ్ చెప్పినంకనే మోడీ యుద్ధం ఆపారన్నారు.370 ఆర్టికల్ రద్దుపర్చిన నేపథ్యంలో దేశంలో తలెత్తిన విభేదాలను పరిష్కరించలేక యుద్ధం వాతావరణాన్ని ఉరికొల్పడం కుట్ర దాగిందన్నారు. పహాల్గాం దేశ పౌరులపై దాడి చేసిన ఉగ్రవాదులను పట్టుకోలేక పోయారని దేశం మొత్తం కోడై కూత కూస్తున్న నరేంద్ర మోడీ చెప్పు చేతుల్లో కొనసాగుతున్న కార్పొరేట్ మీడియా ఎక్కడ కూడా ప్రచారం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచార సాధనాలను తన గుప్పెట్లో పెట్టుకొని నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో మోకరిల్లుతున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. అంతేగాక భారతదేశంలో పౌరులుగా ఉన్న మావోయిస్టులను వందలాది మందిని పొట్టన పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు, ఈ దేశ హెూం శాఖామంత్రి 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను లేకుండా అంతమందిస్తామని జెడ్ లైన్ పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ దేశంలో సమస్యలను తీర్చలేక ఆర్థిక అసమానతలను పరిష్కరించకుండా భూ పంపిణీ పరిష్కారం కాకుండా,బడా పెట్టుబడిదారీ విధానాన్ని వ్యవస్థను పెంచి పోషిస్తూ వారు చెప్పిన విధంగా నరేంద్ర మోడీ మోకరిల్లుతున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో గత ఎన్నికల్లో 420 హామీలు, ఆర్ గ్యారంటీలు ప్రజలకు ఇచ్చి నేటికీ అమలు చేయకుండా నిధుల కొరత పేరుతో పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.ఇప్పటికైనా హామీలను అమలు చేయాలని లేకుంటే ప్రభుత్వంపై ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర సంక్షేమంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అక్క తమ్ముడు లేఖ పేరుతో కొత్త నాటకానికి తెర లేపారని, ఆ లెటర్ ముందు పెట్టి కుటుంబ పాలనలో పోగు చేసుకున్న సంపాదన బయటకు రాకుండా నాటకం ఆడుతున్నట్లుగా సాదుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిపక్ష హెూదాలో ఉన్న పార్టీలు ప్రజల కోసం పనిచేయాలి తప్ప వ్యక్తిగత విమర్శలతో కుటుంబ తగాదాలతో రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించవద్దని హితువు పలికారు.ఇంకా ఈ సభలో సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య,గుణగంటి రాజన్న, అలవాల వీరయ్య, ఆకుల రాజు,కుంట ఉపేందర్,మరిపెడ మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్,బాణాల రాజన్న, జిన్నా లచ్చయ్య,బోడపట్ల రాజశేఖర్, కొండ ఉప్పలయ్య, కందాల రమేష్,దొంతు మమత, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం అని చెప్పడం కాదు చిత్తశుద్ధితో పేదల విద్యపై దృష్టి సారించాలి

- ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బొంకూరి రాజు
- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి
- విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



**ఎలుకతుర్తి, మే25 (నినాదం న్యూస్) :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో బొంకూరి రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం పేరిట పాలన సాగిస్తున్నామని పేరుకే చెప్తున్నారు. కానీ పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందుగా వాటిపై దృష్టి సారించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు బొంకూరి రాజు అన్నారు. మన రాష్ట్రంలో అనేక గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి వర్షాకాలం వస్తే భవనాల స్లాబు పెచ్చులు ఊడిపోతాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు టాయిలెట్స్ సౌకర్యాలు సరిగా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అధ్వాన్న పరిస్థితి మూలంగా గ్రామీణ విద్యార్థులు ప్రతి ఏటా చదువుకు దూరమయ్యే వారి సంఖ్య పెరుగుతున్నది ప్రభుత్వం తక్షణమే పాఠశాల భవనాల పునరుద్ధరణ మౌలిక వసతుల కల్పన చేయాలని అన్నారు. భవిష్యత్ తరాలకు నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను అందించే ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక విద్య పూర్తిస్థాయి ఇంగ్లీష్ మీడియం ఆధునిక టెక్నాలజీ అంది పుచ్చుకునే స్థాయిలో విద్యాబోధనను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయాలి. అప్పుడే ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అవుతుందని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు అనేక రకాల ఫీజుల పేరిట ఎల్కేజీ స్థాయిలోనే వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో నోట్ బుక్స్ యూనిఫామ్స్ ఆఖరికి బూట్లు సాక్షులు మొదలగు వాటిని అన్నిటిని వారే అధిక ధరలకు విద్యార్థులకు విక్రయిస్తూ వ్యాపార కేంద్రాలుగా అవతారం ఎత్తుతున్నాయి. ఈ విధానాలపై ప్రభుత్వం సరైన పర్యవేక్షణ చేసి ఇలాంటి చర్యలకు పాల్పడిన పాఠశాలను సరైన రీతిలో శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణపై దృష్టి సారించి విద్యారంగంలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో ఆధిపత్యాన్ని తగ్గించాలని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలకు అందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి పేద విద్యార్థులకు శాపంగా మారుతుంది అందుకు నిదర్శనమే బడ్జెట్లో సైతం విద్యకు నామమాత్రపు కేటాయింపులు చేయడం తెలంగాణ ప్రభుత్వం పేదల విద్యపై వివక్షపూరిత వైఖరి మార్చుకొని విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి పేదలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు రాష్ట్రవ్యాప్తంగా కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థ పై ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ధర్మ సమాజ్ పార్టీ ఉద్యమాలు చేయవలసిన పరిస్థితి వస్తుందని ఈ విద్యా సంవత్సరం నుండి ఉన్నత ప్రమాణాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలో విద్య అందే విధంగా కృషి చేయాలని బొంకూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## స్కూటర్‌పై నుండి పడి మహిళ మృతి



**చేవెళ్ల మే 25(నినాదం న్యూస్):** ప్రమాదవ శాత్తు స్కూటర్ పైనుండి జారిపడి మహిళా మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం, చేవెళ్ల మండలం ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన మంగలి, భార్య మంగళ లక్ష్మి %ఓ/శీ% మంగలి సత్యనారాయణ వయస్సు 32 సంవత్సరాలు, వృత్తిరీత్యా చేవెళ్లలోని వివేకానంద స్కూల్లో ఆయాగా పనిచేస్తూ ఉంటుంది రోజు లాగానే ఆదివారం ఉదయం అంజాదా 8 గంటల 30 నిమిషాల సమయం లో స్కూల్లో పనికి వెళ్లడానికై చేవెళ్ల వద్ద తన స్కూల్ బస్ వెళ్లిపోవడంతో అటుగా వెళ్తున్న మహేందర్ అను వ్యక్తిని లిఫ్ట్ అడగగా అట్టి వ్యక్తి తన స్కూటర్ %దీతీ చీశీ ు+07ూూా%6923 పై లక్ష్మి ని ఎక్కించుకొని వెళ్ళగా అయ్యప్ప టెంపుల్ వద్ద లక్ష్మి అట్టి స్కూటర్ పైనుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తన తలకు రక్తదాయమైందని వెంటనే పట్నం మహేందర్ రెడ్డి హాస్పిటల్ కి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మీ మరణించింది ఇట్టి మరణం ప్రమాదవశాత్తు లక్ష్మి స్కూటర్ పైనుంచి జారి పడటం వల్లే జరిగిందని సత్యనారాయణ తెలపడంతో చేవెళ్ల పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మెకానిక్ శ్రీను



**వనపర్తి ప్రతినిధి, మే 25(నినాదం న్యూస్) :** ఏదుల మండలం ఉప్పితాండ కు చెందిన రాత్లావత్ లక్ష్మి, నాగేంద్రం కుమారుడు రాత్లావత్ చెన్నయ్య, నందిని వివాహానికి 22వ వార్డు నాయకులు ఏర్వ అరుణ మెకానిక్ శ్రీను దంపతులు హాజరయ్యారు. ఈ వివాహం పానగల్ మండలం కిష్టాపూర్ తండాలో జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను అక్షింతలు వేసి వారు ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో నూతన దాంపత్య జీవితాన్ని గడపాలని వారు ఆకాంక్షించారు. ఈ వివాహానికి మెకానిక్ శ్రీను కుటుంబ సభ్యులు రావడం సంతోషంగా ఉందని నూతన వధూవరులు సంతోషపడ్డారు

# టీజేఎఫ్ రజితోత్స వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



**కోదాడ,మే 25(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కీలక పాత్ర పోషించిందని టి యు డబ్ల్యూ జె 143 జిల్లా ప్రధాన కార్యదర్శి నారపరాజు హరికిషన్ రావు నియోజకవర్గ అధ్యక్షుడు వంగవీటి శ్రీనివాసరావు పేర్కొన్నారు .ఆదివారం కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 31న హైదరాబాదులో నిర్వహించనున్న టీజేఎఫ్ రజితోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ పోస్టర్ విడుదల చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. టీజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం బలహీనమైన ప్రతి సందర్భంలోనూ టీజేఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సజీవంగా ఉంచేందుకు సముచిత పాత్ర పోషించింది అన్నారు.. రాష్ట్ర ఆవిర్భావం కోసం అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి న ఘనత టీజేఎఫ్ కు దక్కుతుందన్నారు.. రజితొచ్చా వేడుకలను విజయవంతం చేయాలని వారు జర్నలిస్టులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో... టీయూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంక వెంకటరత్నం, యూనియన్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిచలం నరేష్,యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపాటి సురేష్ ,రూరల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జూలూరి వీరభద్రం అనంతగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుడిమెట్ల రామకృష్ణ శివదాసు శ్రీహరి, నాయిని మల్లయ్య, ఆలూరి చరణ్ ,వేజెండ్ల శివనాగు, తునిగర్ సైదులు, నేలమరి శ్రీకాంత్, చలిగంటి రంగా, శ్రీరామ్ రవికుమార్ ,గంగిరెడ్డి అశోక్ రెడ్డి, గడ్డం అంజి అమరబోయిన వీరబాబు ఉన్నారు.

సంపాదకీయం

# పొరపాటుకు క్షమాపణ చెప్పడం ఓ అద్భుత లక్షణం

(26 మే "జాతీయ క్షమాపణ దినం" సందర్భంగా)




పొరపాట్లు జరగడం మానవ సహజం. నోరు జారడం నాలుక లక్షణం. అనుకోకుండానో, ఉద్దేశపూర్వకంగానో మనం కొన్ని చిన్న చిన్న తప్పులు చేయడం జరుగుతుంది. మనం చేసిన ఒక చర్యవల్ల లేదా మనం మాట్లాడిన మాటల వల్ల మన మిత్రుల లేదా బంధువుల మనస్సు నొచ్చుకోవచ్చు, మానవ సంబంధాలు బలహీనపడవచ్చు. మన వల్ల జరిగిన పొరపాటుకు తక్షణమే క్షమాపణ తెలుపడంతో అపార్థాల మేఘాలు తొలగిపోయి మళ్లీ పూర్వపు సంబంధాలు నెలకొంటాయి. క్షమాపణ చెప్పడం కూడా ఉత్తమ వ్యక్తిత్వంలో ఓ ప్రధాన కళ అవుతుంది. దీనినే 'క్షమాపణ తెలిపే కళ'గా వర్ణిస్తారు. క్షమాపణ తెలుపడం అవమానకరం కాదు, అది ఆత్మన్యూనతకు దారి తీయకూడదు. క్షమాపణ చెప్పడం వల్ల మానసిక గాయాలు మానిపోతాయి. నమ్మకాలు/విశ్వాసాలు పెరుగుతాయి. సంఘర్షణలు సమసిపోతాయి. మన ఆత్మవిశ్వాసాలు పెరుగుతాయి. పారదర్శకత చిక్కబడుతుంది. జవాబుదారీతనం పెరుగుతుంది. అపార్థాలతో అభిప్రాయ భేదాలు మొలిచి వేరైన ఇరు పక్షాలను ఏకం చేసే ఉత్తమ సాధనం 'సారీ' చెప్పడమే.

**జాతీయ క్షమాపణ దినం:**

1998లో ఆస్ట్రేలియాలో ప్రారంభమైన "జాతీయ క్షమాపణ దినం" వెనుక ఓ చరిత్ర ఉన్నది. ఆస్ట్రేలియన్ ఆదివాసీ, స్వదేశీ గిరిజల తెగలకు జరిగిన అన్యాయాలను గుర్తించి వారికి క్షమాపణలు తెలుపడానికి జాతీయ క్షమాపణ దినం వేదికలు ప్రారంభమైనాయి. నేటి వ్యక్తిత్వ వికాస పాఠాల్లో క్షమాపణ అడగడం, క్షమించే గుణాలను పెంచుకోవడా కూడా ఓ ప్రధాన కళ అని వర్ణించబడుతున్నది. "ఐ ఆమ్ సారీ" అనే మాటకు ఓ మహత్తర శక్తి ఉంటుంది. మనం కూడా అనుకోకుండా లేదా ఉద్దేశపూర్వకంగా మరొకరి మనసును నొప్పించా ఉండవచ్చని గమనించాలి. మాటల తూటాలకు మనసులను విరిచే మహత్తర శక్తి ఉంటుంది. ఒక్క మాట యుద్ధ వాతావరణాన్ని సృష్టించగలదు. దశాబ్దాలుగా ఒకటిగా ఉన్న వ్యక్తులను లేదా కుటుంబాలను ఓ అవాంఛనీయ మాట అడ్డుగోడలను కట్టగలదు. క్షమాపణ చెప్పడం వల్ల మనసు తేలికవుతుంది, ఆరోగ్యం కుదుటపడుతుంది, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. క్షమించడం వల్ల తిరిగి బలమైన మానవ సంబంధాలు పునరుద్ధరించబడతాయి.

**'సారీ' అనే మాట శక్తివంతం :**

క్షమాపణ తెలుపడం తప్పు చేసినట్లు కాదని, చేసిన తప్పును సవరించుకునే ఓ అద్భుత అవకాశమని తెలుసుకోవాలి. క్షమించిన వారి కన్న క్షమాపణ కోరి వారికే ధైర్యం ఎక్కువగా ఉంటుందని గమనించాలి. క్షమాపణ చెప్పడం ఓ భావోద్వేగ సంఘర్షణ. క్షమాపణ చెప్పని యెడల జీవితాంతం తప్పు చేశామనే మానసిక క్షోభ మనల్ని వెధిస్తుంది, మనుషుల్ని/మనసుల్ని దూరం చేస్తుంది. ఒక్క 'సారీ' అనే మాట సకల విభేదాలను తుడిచేసి మళ్లీ ఆనందాల అనుబంధాలను కలుపుతుంది. ఒకరిని అపార్థం చేసుకోవడం, అవమాన పర్చడం, అసంబద్ధంగా మాట్లాడడం, అగౌరవ పర్చడం, మనం మాటపై నిలవకపోవడం, ఏక పక్ష తీర్పులు ఇవ్వడం లాంటివి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మన వల్ల పొరపాటు జరిగిందని గమనించి, ఆలస్యం చేయకుండా సారీ చెప్పడం వల్ల ఇరు పక్షాల మనసులు తేలిక పడతాయి, మానవ సంబంధాలు పూర్వపు స్థితికి వస్తాయి. క్షమాపణ చెప్పడానికి బదులుగా కుంటి సాకులు చెప్పడం మంచిది కాదు. భావోద్వేగ పరిపక్వత, సహానుభూతి, తప్పు చేసామని లేదా జరిగిందని అంగీకరించడం లాంటివి మనకు ఉండవలసిన ఉత్తమ లక్షణాలు. ఒక్క మాట విస్ఫోటనం కాగలదు, విభేదాల మంటలపై నీళ్లు చల్లగలదు. క్షమాపణ చెప్పడం అనేది ఓ నిజమైన కళ. ఇది కేవలం మాలతో కాదు, మనసుతో, సహృదయంతో చెప్పాడే ఒక అద్భుత ప్రక్రియ. తప్పునచేసినపుడు క్షమాపణ చెప్పడం ఒక వ్యక్తి యొక్క సానుకూలతను, సమర్థతనా తెలియజేస్తుంది. సారీ చెప్పడం ద్వారా సంబంధాలు బలోపేతం కావడం, అపార్థాలు తొలగిపోవడం, లోతైన ఆలోచనలకు అవకాశం దొరకడం, వ్యక్తిత్వం ఇనుమడించడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. సరైన సమయంలో క్షమాపణ తెలుపడం సిగ్గుచేటు కాదు, చిన్నతనం కూడా కాదు. అది మన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం అని భావిస్తూ జీవనయానం కొనసాగిద్దాం, మానవ సంబంధాలను పెంచుకుంటూ పోదాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఫుట్ పాత్'పై బడా వ్యాపారుల ఇష్టారాజ్యం

**గరీబోళ్ల జీవనోపాధిపై పాలకుల జులుం**

**అధికారుల ప్రకటనల్లోనూ వివక్ష**



'అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్ వంటి ప్రధాన చౌక్‌లలో రోడ్డుపై చిరు వ్యాపారాల వల్ల ట్రాఫిక్ కు సంబంధించి అనేక ఫిర్యాదులు అందాయి. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి చిరు వ్యాపారాలను అక్కడి నుంచి తొలగించాం. పాత వారు, ఎవరైనా కొత్త వారు వచ్చి మళ్లీ వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. వారి బండ్లు సీజ్ చేసి తిరిగి ఇవ్వం.' 'షాపుల ఎదుట నాలాలపై ఉన్న ఫుట్ పాత్ నడవడానికి మాత్రమే. వ్యాపారులు తమ వ్యాపారాలకు సంబంధించిన ఎటువంటి వస్తువులు, ఇతర పరికరాలు ఏమీ పెట్టొద్దని విన్నపం. ఏమైనా పెడితే వాటిని కూడా సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. వ్యాపారాలకు సంబంధించి ఎటువంటి వస్తువులు ఫుట్ పాత్ పై పెట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం' శివాజీ చౌక్, నేతాజీ చౌక్ వంటి ప్రాంతాల్లో జీవనోపాధి కోసం చిరు వ్యాపారాలు చేసే వారిని తొలగించిన తర్వాత పోలీసులు మైక్ ద్వారా చేసిన బహిరంగ ప్రకటన ఇది. చిరు వ్యాపారుల పట్ల హెచ్చరించినట్లు మాట్లాడిన పోలీసులు.. అదే బడా వ్యాపారులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు మాట్లాడారు. ఇది చాలు.. ఆర్థిక అంతరాల వల్ల న్యాయం, చర్యల పట్ల ఎలాంటి బేధాలు ఉంటాయో చెప్పడానికి.

**వాళ్లను ముట్టుకునే ధైర్యం లేదా?**

అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, పంజాబ్ చౌక్, నేతాజీ చౌక్.. ఇలా ప్రధాన మార్కెట్ లోని చాలా ప్రాంతాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి మెయిన్ డ్రైనేజీ సిస్టమ్‌ను నిర్మించారు. నడవడానికి వీలుండేలా దాన్ని ఫుట్ పాత్ గా అభివృద్ధి చేశారు. అయితే ఆ నిర్మాణాన్నంతా ఎదురుగా ఉన్న దుకాణాదారులు ఆక్రమించేశారు. కనీసం వాహనాల పార్కింగ్ కు కూడా పనికి రాకుండా వ్యాపార సామాగ్రి అంతా పెట్టేస్తున్నారు. దీంతో నడవడానికి ఫుట్ పాత్ లేక రోడ్లపైనే నడవాల్సి రావడంతోపాటు వాహనాలను సైతం రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతోపాటు ప్రమాదాలు జరిగిన సందర్భాలుసైతం ఉన్నాయి. ట్రాఫిక్ కు ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఇటీవల చిరు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించారు. పార్కింగ్ స్థలం లేక అక్కడక్కడ వాహనాలు పార్క్ చేస్తున్న వారికి పోలీసులు ఫైన్లు వేస్తున్నారు. అయితే వ్యాపార సముదాయాలకు పార్కింగ్ స్థలం విడిచిపెట్టకుండా..ఉన్న ఫుట్ పాత్ ను సైతం ఆక్రమించి తమ వ్యాపారాలకు సంబంధించి వస్తువులు, హోర్డింగులు పెట్టుకుంటున్న బడా వ్యాపారులను మాత్రం పల్లెత్తు మాట అనే ధైర్యం అధికారులకు, రాష్ట్ర పాలకులకు లేకుండాపోయింది. పేదలపై ప్రతాపం చూపే పాలకులు.. పెద్దలతో భయపడుతున్నారని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.

**మద్దతివ్వని ప్రధాన పార్టీలు**

చిరువ్యాపారులకు న్యాయం జరిగేలా పోరాడాల్సిన రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు ఇప్పుడు కనిపించకుండా పోయారు. కలెక్టరేట్ ఎదుట చిరు వ్యాపారులు తెలిపిన నిరసనలో పట్టణస్థాయి నాయకులే కనిపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నాం కాబట్టి ఈ చర్య సర్కారు తీసుకున్నట్లు భావించారేమో.. కాంగ్రెస్ నేతలెవరూ స్పందించడం లేదు. డీసీసీ రేసులో ఉన్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వడం లేదు. ప్రస్తుత పరిస్థితికి కారణం మాజీ మంత్రి జోగురామన్నే అనే ఆరోపణలు వస్తుండడంతో ఆయన కూడా మద్దతుగా మాట్లాడేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. చిరువ్యాపారులను తొలగించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ ముందు నుంచి ఉన్నది కాబట్టి బీజేపీ మద్దతు వారికి లభించే అవకాశమే కనిపించడం లేదు.

**ఆరోపణలు.. ప్రత్యారోపణలు..**

ప్రస్తుత దుస్థితిపై వివిధ పార్టీల నేతలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితికి కారణం మాజీ మంత్రి జోగురామన్న అని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని ఆరోపించారు. ఆయన హయాంలోనే పెద్దపెద్ద డివైడర్లు నిర్మించారని, దాని వల్లే చిరు వ్యాపారులకు స్థలం లేకుండాపోయిందని విమర్శించారు. అయితే దీనికి బీఆర్ఎస్ మైనార్టీ నేత సాజిదొద్దీన్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో డివైడర్లు నిర్మించినప్పుడు జహీర్ రంజానీ కూడా గులాబీ పార్టీలోనే ఉన్నారని, మున్సిపల్ వైస్ చైర్మన్ గా వ్యవహరించారని గుర్తు చేశారు. మరి అప్పుడు ఈ డివైడర్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ పార్టీ తరపున చిరు వ్యాపారులకు కాంగ్రెస్ నాయకులు జహీర్, ఖిజర్ పాషా వంటి నాయకుల నుంచి ప్రస్తుతం మద్దతు లభిస్తున్నది. మరో వైపు ఎంఐఎం పట్టణాధ్యక్షుడు నజీర్ సైతం చిరువ్యాపారులకు మద్దతుగా పోరాడుతున్నారు. ఆయన కూడా ప్రస్తుత పరిస్థితికి మాజీ మంత్రి జోగురామన్ననే బాధ్యుడిగా చెబుతున్నారు. ప్రస్తుతం చిరు వ్యాపారులకు కాంగ్రెస్, ఎంఐఎం వంటి పట్టణస్థాయి నాయకులు మాత్రమే మద్దతు తెలుపుతున్నారు. అయితే త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముం డడంతో చిరు వ్యాపారుల తొలగింపు ప్రభావం ఎలక్షన్స్‌పై ఎఫెక్ట్ చూపే అవకాశముంది. కొందరి గెలుపోటములను ప్రభావితం చేసే చాన్స్ ఉంది.



–ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

# సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం

**నేడు రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి**



రఘుపతి వెంకటరత్నం నాయుడు (అక్టోబరు 1, 1862 – మే 26, 1939) విద్యావేత్తగా, సంఘసంస్కర్తగా, పవిత్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి, శ్వేతాంబరుడై, బ్రహ్మర్షిగా తెలుగు ప్రాంతాలలో పేరుపొందిన వ్యక్తి. స్త్రీల సహవిద్యకు ఆద్యుడు. కులవ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం. బ్రహ్మ సమాజమన్నా, సంఘసంస్కరణోద్యమమన్నా, కందుకూరి వీరేశలింగం పంతులుతో పాటు రఘుపతి వెంకటరత్నం నాయుడు పేరు గుర్తుకు రాక మానదు. రఘుపతి వెంకటరత్నం నాయుడు 1862, అక్టోబరు 1 న జన్మించాడు. తండ్రి అప్పయ్యనాయుడు సుబేదారుగా పనిచేస్తూ ఉత్తర భారతాన ఉండడంతో నాయుడు విద్యాభ్యాసం చాందా (చంద్రపూర్) నగరంలో మొదలయింది. హిందీ, ఉర్దూ, పర్షియన్ భాషలలో ప్రవేశం కలిగింది. తండ్రికి హైదరాబాదు బదిలీ కావడంతో, అక్కడి నిజాం ఉన్నత పాఠశాలలో చదువు కొనసాగించాడు. తరువాత మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో పట్టభద్రుడై, తరువాత ఎం.ఏ, ఎల్.టి కూడా పూర్తిచేసాడు. ఎం.ఏ. కాగానే మద్రాసు పచ్చయప్ప కళాశాలలో ఇంగ్లీషు ఆచార్యునిగా పనిచేసాడు. 1904లో కాకినాడ లోని పిఠాపురం రాజా కళాశాల (పి.ఆర్.కళాశాల) ప్రిన్సిపాలుగా ప్రమాణ స్వీకారం చేసి సుదీర్ఘకాలం అదే పదవిలో కొనసాగాడు. 1911లో కళాశాలలో మొదటి సారిగా స్త్రీలను చేర్చుకుని సహవిద్యకు ఆద్యుడయ్యాడు. 1925లో మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగా నియమితుడయ్యాడు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు బిల్లును రూపొందించి శాసనసభలో ఆమోదింప జేసాడు. 1924లో బ్రిటిష్ ప్రభుత్వంచే నైట్ హుడ్ పురస్కారాన్ని పొందాడు. 1927లో పరిషత్తు మొదటి స్నాతకోత్సవంలో నాయుడును గౌరవ డాక్టరేటుతో సత్కరించింది.. 1889లో భార్య మరణించిన తరువాత మళ్ళీ పెళ్ళిచేసుకోక, జీవితాంతం తెల్లటి దుస్తులే ధరించాడు. ఆయనను శ్వేతాంబర ఋషి అనేవారు. పేద విద్యార్థులను, అనాథలను చేరదీసి విద్యావకాశాల కల్పనకు కృషి చేశాడ. నెలసరి ఆదాయంలో కొద్దిభాగం ఉంచుకుని మిగతాది బీద విద్యార్థులకే వినియోగించేవాడు. విజ్ఞానాభివృద్ధి కొరకు తన గురువైన డా.మిల్లర్ పేరిట మద్రాసు విశ్వ విద్యాలయంలో పదివేల రూపాయలతో ఒకనిధిని కూడా ఏర్పాటు చేసాడు. మహిళా విద్యా వ్యాప్తికై ఆయన ఎంతో కృషిచేసాడు. పి.ఆర్ కళాశాలలో స్త్రీలకు ప్రవేశం కల్పించడమే కాక, వెనుకబడిన వర్గాల, బీద విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసాడు. బ్రహ్మసమాజంలో చేరి, కాకినాడలో ఉపాసనా కేంద్రాన్ని నిర్మించాడు. బ్రహ్మసమాజ సిద్ధాంతాలలో ముఖ్యమైన 'కులవ్యవస్థ నిర్మూలన'కు కృషిచేసాడు. మద్యనిషేధం కొరకు శ్రమించాడు. 1923లో మద్రాసు శాసనమండలి సభ్యుడుగా ఉన్నప్పుడు మద్యనిషేధం బిల్లు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడిచేసాడు. వేశ్యావృత్తి నిర్మూలనకు కృషిచేసాడు. శుభకార్యాలలో భోగం మేళాల సంప్రదాయాన్ని వ్యతిరేకించాడు. పీపుల్స్ ఫ్రెండ్, ఫెలో వర్కర్స్ అనే పత్రికలకు సంపాదకత్వం నిర్వహించాడు. రఘుపతి వెంకటరత్నం నాయుడు వివిధ రంగాల్లో ఆయన కృషికి గుర్తింపుగా శ్వేతాంబర ఋషి, అపర సోక్రటీసు, కులపతి, దివాన్ బహదూర్, కైజర్-ఇ-హింద్, సర్ తదితర పురస్కారాలు, బిరుదులు లభించాయి. 1939 మే 26న రఘుపతి వెంకటరత్నం నాయుడు మరణించాడు. ప్రముఖ సినిమా నిర్మాత, పంపిణీదారు, ప్రదర్శకుడు అయిన రఘుపతి వెంకయ్య నాయుడు ఆయన సోదరుడు.

– రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# శివ పూజకు ఉద్దిష్టమైన దినం సోమావతి అమావాస్య

సోమవారం నాడు అమావాస్య కలిసి వచ్చే దినాన్ని సోమవతి అమావాస్య అంటారు. ఈ అమావాస్యను మౌని అమావాస్య, శని అమావాస్య అని కూడా పిలుస్తారు. రావిచెట్టులో ఎల్లప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువుదీరి ఉంటారు. శివుడికి సోమవారం ప్రీతి, సోమవతి అమావాస్య శివ పూజకు ఉద్దిష్టమైన దినం. సోముడు అంటే చంద్రుడు అన్న అర్థం ఉంది. చంద్రుని ధరిస్తాడు కనుక శివుని సోమేశ్వరుడు అని పిలుస్తారు. ఈ రోజున రావిచెట్టుకు శక్తి కొలది పూజించాలి. అమావాస్య అంటే కారు చీకటి మరుసటి రోజునుండి శుక్లపక్షం ప్రారంభం అంటే మన ప్రయాణం పౌర్ణమి అంటే వెలుగు వైపు ప్రయాణం చేస్తుంది. అందుకే అమావాస్య రోజు దైవభక్తితో సత్కార్యాలు చేస్తూ భగవత్ ఉపాసకులు కావాలని సూచిస్తుంది. దీనికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిల్లో ప్రధానంగా దక్షయజ్ఞం కథ. తన అల్లుడైన శివుని అవమానించేందుకే దక్షుడు ఈ యజ్ఞాన్ని తలపెట్టాడు. అక్కడ తనకి చోటు లేదని శివుడు వారిస్తున్నా వినకుండా శివుని భార్య సతీదేవి ఆ యజ్ఞానికి వెళ్లిం ది. సతీదేవి తన కుమార్తె అన్న ఆలోచన కూడా లేకుండా దక్షుడు ఆమెని కూడా అవమానించాడు. ఆ అవమానాన్ని తట్టుకోలేని సతీదేవి తనని తాను దహించి వేసుకుంది. సతీదేవి మరణం గురించి విన్న శివుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. తన వెంట్రుకతో వీరభద్రుని సృష్టించాడు. ప్రమథగణాలతో పాటుగా ఆ వీరభద్రుడు దక్షుని మీదకు దాడిచేశాడు. అక్కడ యజ్ఞానికి వచ్చిన వారందరినీ చావచితక బాదాడు. శివగణాల చేతిలో చావుదెబ్బలు తిన్నవారిలో చంద్రుడు కూడా ఉన్నాడు. చంద్రుడు సాక్షాత్తు శివునికి తోడల్లుడు. అయినా శివుని అవమానించే కార్యక్రమంలో పాల్గొన్నందుకు తగినశాస్తిని అనుభవించాడు. నిలువెల్లా గాయాలతో నిండిన చంద్రుడు వాటి బాధలకు తాళలేకపోయాడు. తనకు ఉపశమనం కలిగించమంటూ వెళ్లి ఆ పరమేశ్వరుని వేడుకున్నాడు. చంద్రుని బాధను చూసిన భోళాశంకరుని మనసు కరిగిపోయింది. రాబోయే సోమవారంనాడు అమావాస్య తిథి కూడా ఉన్నదనీ ఆ రోజున కనుక తనకు అభిషేకం చేస్తే చంద్రుని ఆరోగ్యవంతుడవుతాడని అభయమిచ్చాడు. శివుని సూచన మేరకు చంద్రుడు సోమవారం, అమావాస్య కలిసిన రోజున శివునికి అభిషేకం చేసి తన బాధల నుంచి విముక్తుడయ్యాడు. అప్పటి నుంచి సోమవారం నాడు వచ్చే అమావాస్యను 'సోమవతి అమావాస్య' పేరుతో పిలవడం జరుగుతోంది.

**సోమవతి అమావాస్య**

సోమవారం మరియు అమావాస్య కల్సివచ్చిన రోజున ఆడవారు సౌభాగ్యం కోసం ఈ వ్రతం చేస్తారు. సర్పదోషం ఉన్నవారు, జాతకంలో ఉన్న గ్రహ దోషాలు తొలగి పోవడానికి, అమావాస్య రోజున పెళ్ళి అయిన వారు, పెళ్ళికోసం ఎదిరి చూసేవారు రావిచెట్టుకు పూజా విధానాలతో భక్తి శ్రద్ధలతో 108 సార్లు ప్రదక్షిణలు చేస్తూ పూజించాలి. ఈ రోజున పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తే వారు సంతృప్తి చెంది మేలు చేస్తారని పెద్దలు చెబుతారు. సోమావతి అమావాస్య రోజున శారీరక శక్తి కలిగినవారు ఉపవాసం చేసి శక్తి కొలది పేదలకు, ఆకలితో ఉన్న ఏ జీవరాశులకైన ఆహార పానీయాలు అందిస్తే జాతకంలో ఉండే గ్రహ దోషాలు శాంతిస్తాయని ప్రతీతి. పూజలు ఆర్థిక శక్తి స్థోమత, సామర్థ్యాలను బట్టి చేయాలి తప్ప, అప్పులు చేసి పూజ చేస్తే ఫలితం ఉండదు. ఎదైన ధర్మబద్ధమైన కష్టార్జితంతో చేసే దానికే శుభఫలితాలు ఉంటాయి. ఒక అమావాస్యతో కూడిన సోమవారం నాడు నోమును ప్రారంభించాలి. అశ్వత్థ(రావి) వృక్షానికి నమస్కరించి దిగువ శ్లోకాన్ని చదువుతూ ప్రదక్షిణం చెయ్యాలి.

**మూలతో బ్రహ్మరూపాయ...**
**మధ్యతో విష్ణురూపిణే...**
**అగ్రతశ్శివరూపాయ... వృక్షరాజాయతే నమ:**

అలా ఒక్కొక్క ప్రదక్షిణానికి ఒక్కొక్క పర్యాయం చొప్పున 108 సార్లు శ్లోకం చదువుతూ, నూట ఎనిమిది ప్రదక్షిణలు చెయ్యాలి. చివర్లో ఒక పండో ఫలమో చెట్టు మొదలులో ఉంచి నమస్కరించాలి. అలా 108 అమావాస్య సోమవారాలయ్యాక ఉద్యాపన చేసుకోవాలి. అలా 108 వ అమావాస్యా సోమవారం నాడు రావిచెట్టుకు ప్రదక్షిణలు చేసిన తర్వాత, వృక్షమూలంలో భియ్యంతో మండపం ఏర్పరిచి శ్రీ లక్ష్మీ నారాయణుల విగ్రహాలను ఆ మండపంలో ఉంచి ఆరాధించాలి. ముత్తయిదువలకు ఫలాలను వాయన దానమివ్వాలి.

# తెలుగు కవిత్వంలో నిశ్శబ్ద స్వరం.. ఇస్మాయిల్ కవిత్వం

తెలుగు సాహిత్యంలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించిన కవి ఇస్మాయిల్. ఆయనది ఒక అద్భుతమైన వ్యక్తిత్వం. మహ్మద్ ఇస్మాయిల్ పూర్తి పేరుతో 1928 మే 26న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించిన ఆయన, 2003 నవంబర్ 25న అనంతమైన నిశ్శబ్దంలోకి లీనమయ్యారు. కాకినాడ పి.ఆర్. కళాశాలలో తత్వశాస్త్రం లెక్చరర్‌గా, ఆ తర్వాత ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించి 1988లో పదవీ విరమణ చేశారు. ప్రభుత్వ అధికార భాషా సంఘంలో సభ్యునిగా కూడా కొంతకాలం పనిచేశారు. ఇస్మాయిల్ వందలాది కవితా సంపుటాలను రాయలేదు గాని, తన రచనలతో తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసారు. ఆయన కవిత్వం పదాల కోసం పదాలు పెట్టడం కాదుబీ జీవితం, ప్రకృతి, మానవత్వం పట్ల లోతైన తాత్విక చింతన, సానుకూల దృక్పథం ప్రతిబింబించే విధంగా ఉంటుంది. సాధారణ విషయాలను, చిన్న చిన్న దృశ్యాలను, దైనందిన జీవితంలోని అనుభవాలను అద్భుతమైన పద చిత్రాలుగా మలిచే శక్తి ఇస్మాయిల్ కు మాత్రమే చెల్లింది. ఆయన కవిత్వంలో ప్రత్యేకత ఏమిటంటే, అది నిశ్శబ్దంలోనూ విన్న వేదన, ఆనందం, కరుణ, సౌందర్యం. కవిత్వంలో వాదాలు, సుదీర్ఘ వాక్యాలు, క్లిష్టమైన పదజాలం ఉండవు. కేవలం ఒక చిన్న అనుభూతిని సున్నితమైన పద చిత్రాలుగా రేఖీకరించడం ద్వారా పాఠకుని మనసుకు అందిస్తారు. ఆయన కవితలు చదివిన పాఠకుడు ఒక్కసారిగా ఆ దృశ్యాన్ని తన కళ్లతో చూసినట్లు అనుభూతి చెందుతాడు. ఇస్మాయిల్ జపాన్ హైకూ కవిత్వాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన వారిలో ప్రధానులు. ఈ పరిచయం ఆయన కవితల్లో చిన్నచిన్న చిత్రాలను సృష్టించ గలిగే సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది. ఇస్మాయిల్ కవిత్వం ఒక విప్లవం. కానీ అది శబ్దాల విప్లవం కాదు. లోపల నిశ్శబ్దంగా కొనసాగే ఒక అనుభూతి విప్లవం. ఆయన కవితల్లో పదాలు కంటే వాటి వెనుక ఉన్న భావం, చింతన, ప్రకృతి, జీవితం పట్ల తాత్విక దృక్పథం ముఖ్యమైనవి. ఆయన "చెట్టు నా ఆదర్శం" అంటూ ప్రకృతి పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేశారు. "పిల్లలంత ఆనందంగా ఎందుకుంటారంటే వాళ్లు నిజమైన కవులు కాబట్టి. మనందరం పుట్టడం కవులుగానే పుడతాం" అన్న ఆయన మాటలు కవిత్వం పట్ల ఆయన వైఖరిని అద్భుతంగా వ్యక్తం చేస్తాయి.

**ఇస్మాయిల్ ముఖ్య రచనలు..:**

మృత్యువృక్షం, చెట్టు నా ఆదర్శం, రాత్రి వచ్చిన రహస్య వాన, కప్పల నిశ్శబ్దం, చిలుకలు వాలిన చెట్టు, పల్లెలో మా పాత ఇల్లు. ఆయన విమర్శా వ్యాసాలు కవిత్వంలో నిశ్శబ్దం, కరుణ ముఖ్యం ప్రత్యేక గుర్తింపును పొందాయి. మృత్యు వృక్షంకు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, కవిత్వంలో నిశ్శబ్దంకు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు లభించాయి. కళాసాగర్ వారు ఆయనకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఆయన పేరు మీద "ఇస్మాయిల్ అవార్డు" ప్రదానం చేస్తూ తెలుగు కవిత్వంలోని అతిపెద్ద రత్నానికి గౌరవం చేకూరుస్తున్నారు. ఇస్మాయిల్ పదవులు, సన్మానాలకు దూరంగా ఉండేవారు. సాహిత్యాన్ని సామాజిక చైతన్యానికి పునాది చేయాలన్న ఆలోచనతో, ప్రకృతి, మానవ సంబంధాలను లోతుగా దర్శించిన తాత్విక కవి. ఆయన కవిత్వం కేవలం పదాల కూర్పు కాదు, అది జీవితాన్ని, మనుషుల అనుభూతులను, ప్రకృతిని ఒక కొత్త కోణంలో చూపించే అంతరాత్మ ఆవిష్కరణ. ఆయన నిశ్శబ్ద స్వరం తెలుగు సాహిత్యంలో ఒక ఎప్పటికి నిలిచిపోయే ప్రభావాన్ని సృష్టించింది.

– రామకిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్ : 9440595494


# భవిష్యత్తు అంతరిక్ష యాత్రలకు దీపస్తంభం

**అపోలో 10 ప్రయోగం**

**మే 26 అపోలో 10లో చంద్రునిపైకి వెళ్లి, భూమిని తిరిగి చేరిన రోజు**

**1969 మే 26 కేవలం ఒక తేదీ కాదు, అది మానవ చరిత్రలో ఒక సువర్ణ క్షణం. మానవ చరిత్రకు కొత్త ఊపిరి పోసిన అపోలో 10 వ్యోమనౌక, ఆకాశాన్ని దాటి చంద్రుని సన్నివేశానికి చేరి, భూమిని తిరిగి చేరిన గొప్ప సన్నివేశం. అది కేవలం ఒక అంతరిక్ష యాత్ర కాదు - అది ఒక కల, ఒక ఆశ, ఒక సాహసగాథ. మే 18న అమెరికా ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి ఆకాశాన్ని చీల్చుకుంటూ సాటర్న్ V రాకెట్ ప్రయాణం మొదలు పెట్టింది. ఆ రాకెట్‌లోని కమాండ్ మాడ్యూల్‌కి "చార్లి బ్రౌన్" అని, లూనార్ మాడ్యూల్‌కి "స్నూపీ" అని పేర్లు పెట్టారు. ఇవి చిలిపి శబ్దాల వెనుక ఒక అపారమైన సాంకేతిక విజ్ఞానం దాగుంది. థామస్ స్టాఫర్డ్, జాన్ యంగ్, యూజీన్ సెర్నన్ అనే ముగ్గురు వ్యోమగాములు ఆకాశంలో కొత్త చరిత్ర రాసేందుకు బయలుదేరారు.**

చంద్రుని చుట్టూ వలయమై తిరిగే కక్ష్యలోకి చేరాక, స్నూపీ కమాండ్ మాడ్యూల్ నుండి విడిపోయి చంద్రుని ఉపరితలానికి కేవలం 15.6 కిలోమీటర్ల దూరంలోకి దిగి వచ్చింది. ఆ దృశ్యం - తెల్లటి ధూళితో ముదురిన చంద్ర ఉపరితలం కింద వింతల సౌందర్యం, ఆపై నీలాకాశపు కిరణాల మధ్య తిరుగుతున్న స్నూపీ - అది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ కాదు, అది మానవ స్వప్నాలకు దారిచెప్పిన క్షణం. స్నూపీ ద్వారా చంద్రుని భూభాగాలను పరిశీలించడం, భవిష్యత్తులో మనిషి అడుగును నిలిపే స్థలాన్ని అంచనా వేయడం మాత్రమే కాక, అంతరిక్షంలో మనిషి ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. జాన్ యంగ్ చార్లి బ్రౌన్‌లో ఉండి ఈ ప్రయాణాన్ని పర్యవేక్షిస్తూ సాంకేతిక క్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాడు. ఆత్మనిర్వహణలో, సాంకేతిక నియంత్రణలో ఈ మిషన్ ఒక అద్భుత ఘట్టం. అపోలో 10 తన యాత్రను విజయ వంతంగా ముగించుకొని మే 26, 1969న భూమి మీద పసిఫిక్ మహా సముద్రంలో సురక్షితంగా ల్యాండింగ్ చేసింది. వ్యోమగాములు భూమికి తిరిగి వచ్చారు. ఆకాశాన్ని తాకి మళ్లీ మన ధరణిపై అడుగు పెట్టారు. అపోలో 10 ద్వారా చంద్రుని తలుపులు తెరచ బడ్డాయిబీ ఆ తరువాతి అపోలో 11 మిషన్‌లో నీల ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్ చంద్రునిపై అడుగు పెట్టడానికి దారి వేసింది. ఇది కేవలం సాంకేతిక ప్రయోగం మాత్రమే కాదు – అది మానవ కర్తవ్యానికి, ఊహలకు, సాహసానికి నిలిచిన జ్ఞాపకం. అపోలో 10 మిషన్ అంతరిక్ష చరిత్రలో ఒక గొప్ప కవిత, ఒక స్ఫూర్తిదాయక గాథ. అది మనిషి ఆత్మ విశ్వాసానికి ప్రతిబింబం. 1969 మే 26 కేవలం ఒక తేదీ కాదు, అది మానవ చరిత్రలో ఒక సువర్ణ క్షణం. ఆకాశాన్ని దాటి చంద్రుని చేరువలో ఒక అడుగు వేసిన ఈ మిషన్, భవిష్యత్తు అంతరిక్ష యాత్రలకు దీపస్తంభంలా నిలిచింది.



# విజయసాయి అమ్ముడుపోయాడు..

- సంచలన వీడియో విడుదల చేసిన వైసీపీ
- టీడీపీ నేత జనార్ధన్‌తో రహస్యంగా సమావేశమైనట్లు ఆరోపణలు
- ఇది నమ్మక ద్రోహం కాదా.. అంటూ ప్రశ్నలు



**అమరావతి, (నినాదం న్యూస్):** విజయసాయిరెడ్డి.. చంద్రబాబుకు అమ్ముడుపోయాడంటూ అనడానికి ఆధారాలు ఇవిగో.. అంటూ ఓ సంచలన వీడియోను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. విజయసాయిరెడ్డి అమ్ముడు పోయాడ నడానికి ఇదే పక్కా ఆధారాలు అంటూ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొంది. మద్యం కుంభకోణంపై సీఐడీ విచారణకు కొన్ని గంటల ముందు రహస్య సమావేశం జరిగిందంటూ, తాడేపల్లి పార్క్ విల్లాలో విల్లా నెం 27కు సాయంత్రం 5:49కు విజయసాయిరెడ్డి, 13 నిమిషాల తర్వాత అదే విల్లాకు చంద్రబాబు నమ్మిన బంటు టీడీ జనార్ధన్ వచ్చారని తెలిపింది. అక్కడే 45 నిమిషాల పాటు రహస్య మంతనాలు సాగించినట్లు ఆ పార్టీ తెలిపింది. సీఐడీ విచారణ ముగిసిన వెంటనే మీడియా ముందు విజయసాయిపై వైయస్ జగన్‌పై విమర్శలు చేశారని పేర్కొంది. వైయస్ జగన్ నమ్మి, దగ్గర పెట్టుకుని, పార్టీలో క్రియాశీలక పదవులతో పాటు రాజ్యసభకు పంపించి గౌరవిస్తే ఇంకా మూడేళ్లు పదవీ కాలం ఉన్నా చంద్రబాబుకు మేలు చేసేందుకు విజయసాయిరెడ్డి రాజీనామా చేశారని మరోసారి ఆరోపణలు చేసింది. ఇది నమ్మక ద్రోహం కాదా అని పేర్కొంది. ఇప్పుడు ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చీకటి మాటున దాగున్న నిజం.. రెండు గంటలకు బ్రేకింగ్ అంటూ ఆ పార్టీ ట్విట్టర్ అకౌంట్లో కొద్ది సేపటి కిందట ఓ పోస్టు చేశారు. ఆ తర్వాత పరిశోధనాత్మక కథనం అంటూ ఈ వీడియో ను విడుదల చేశారు. రెండు రోజుల కిందట మాజీ సీఎం జగన్.. విజయసాయిపై చేసిన ఆరోపణల వీడియోను కూడా దీనికి జత చేశారు. అందులో విజయసాయి చంద్రబాబుకు అమ్ముడుపోయాంటూ జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. టీడీపీ కీలక నేతలో భేటీ అవడం ఇందుకు నిదర్శనం అంటూ వైసీపీ ఇప్పుడు వీడియోను విడుదల చేసింది. ఏపీలో లిక్కర్ స్కాం.. వైసీపీ పనిచేసిన కీలక నేతల మధ్య నిప్పు రాజేస్తోంది. ఈ కేసుకు సంబంధించి విజయసాయిరెడ్డిని సాక్షిగా విచారణకు పిలిపించారు. ఆ తర్వాత ఆయన జగన్‌పై పలు ఆరోపణలు చేస్తూ వచ్చారు. రెండు రోజుల కిందట జగన్ చేసిన వ్యాఖ్యలకు విజయసాయి రిప్లై ఇవ్వలేదు. పైగా సోషల్ మీడియాలో ఇచ్చిన ప్రకటన కూడా తనది కాదంటూ ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో వైసీపీ ఓ వీడియో విడుదల చేయడం సంచలనం రేకెత్తింది. ఇప్పటికైనా జగన్ చేసిన ఆరోపణలకు ఆయన స్పందిస్తారో లేదో చూడాలి.

## ‘ఉగ్రవాదాన్ని సహించేది లేదు’..

- పురందేశ్వరి సంచలన వ్యాఖ్యలు



**అమరావతి, (నినాదం న్యూస్):** ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో భారత్ సహించబోదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్ పై విషం చిమ్ముతున్న పాకిస్తాన్ దుర్నీతిని అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిల బృందాలలో కేంద్రం కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎంపీ పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం ఆదివారం పారిస్‌కి బయలుదేరి వెళ్ళింది. ఉదయం 11 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరిన ఈ బృందం దుబాయ్ మీదుగా రాత్రికి పారిస్ కి చేరుకోనుంది. ఫ్రాన్స్, యుకె, ఈయూ,ఇటలీ ,డెన్మార్క్, జర్మనీ, దేశాలలో పర్యటించి జూన్ 8వ తేదీన భారత్ కి రానున్న ఈ బృందానికి బీజేపీ సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారు. పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి ఈ బృందం వివరిస్తుంది. ఈ బృందంలో పురందేశ్వరితో పాటు బీజేపీ ఎంపీ సామిక్ భట్టాచార్య, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ఎంపీ డా. అమర్ సింగ్, నామినేటెడ్ ఎంపీ గులాం అలీ ఖటాన, ఎంజే అక్బర్, పంకజ్ శరన్ ఉన్నారు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..



**తిరుమల, (నినాదం న్యూస్):** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారిని ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , గాయని స్మిత, టీమ్ ఇండియా ఫీల్డింగ్ మాజీ కోచ్ దిలీప్‌తో పాటు పలువురు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడ్డారు. నిన్న స్వామివారిని 90,211 మంది భక్తులు దర్శించుకోగా 43,346 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.11 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

## త్వరలో జైలుకు జగన్, అవినాష్‌రెడ్డి


- టీడీపీ నేత సంచలన జోస్యం



**కడప, (నినాదం న్యూస్):** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి జైలుకు వెళ్తారని టీడీపీ నేత బీటెక్ రవి అన్నారు. కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు ఏర్పాట్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ వచ్చే మహానాడు నాటికి వైసీపీ నేతలు జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. అటు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ హయాంలో అవినీతి, ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలు జరిగాయని, తప్పు చేసిన ఎవరిని వదిలిపెట్టేది లేదన్నారు. పిన్నెల్లి హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. మాచర్ల టీడీపీ నేతల హత్య హంతకులను వదిలిపెట్టబోమని పల్లా శ్రీనివాసరావుహెచ్చరించారు.

## మన్‌కీ బాత్‌లో.. యోగాంధ్ర..

- కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు



**అమరావతి, (నినాదం న్యూస్):** ఆదివారం జరిగిన మన్‌కీ బాత్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా ఏపీలో జరగనున్న యోగా డే గురించి ప్రస్తావించారు. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం మహాసంభరానికి ఎదురు చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మనం కలిసికలసి ఈ ఉత్సవాన్ని జరుపుకుందాం అని పిలుపునిచ్చారు. నాకు ఈసారి విశాఖపట్నంలో యోగా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభిస్తోందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇప్పుడు నెల కన్నా తక్కువ సమయం ఉందని, మీరు ఇప్పటికీ యోగా చెయ్యకుండా ఉండి ఉంటే, ఇప్పటికైనా మొదలు పెట్టాలని ఆయన సూచించారు. 2015,జూన్ 21 వ తేదీన యోగా దినోత్సవం మొదలైనప్పటి నుంచీ యోగా కి ఆకర్షణ పెరిగిందన్నారు. ఈసారి కూడా యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలలో ఉత్సాహం, ఉల్లాసము కనిపిస్తున్నాయని అన్నారు. ప్రధాని మన్‌కీబాత్‌లో యోగా అంశాన్ని ప్రస్తావించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్‌ఖాతాలో స్పందించారు. యోంగాధ్రను ప్రస్తావించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ సంక ల్పం కోసం ఐక్యంగా ముందుకు సాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. జూన్ 21 వరకు నెల రోజుల పాటు, రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా 100 పర్యాటక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా అనేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. యోగాను మన దైనందిన జీవనశైలిలో భాగంగా మార్చే దిశగా ముందడుగు వేస్తున్నామని సీఎం తెలిపారు.

# నేటినుండి వర్షాలే వర్షాలు..



**అమరావతి, (నినాదం న్యూస్):** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనావేసింది.. దీంతోపాటు ద్రోణి అలాగే.. రుతు పవనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు రోజులు ఆంధ్రప్రదేశ్ లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటన ప్రకారం.. నైరుతి రుతుపవనాలు ఈరోజు, మే 25, 2025న పశ్చిమ మధ్య – తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలు, మొత్తం గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, మిజోరాంలోని మరికొన్ని ప్రాంతాలు, మణిపూర్ – నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. రాబోయే 3 రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, ముంబైతో సహా మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాలు, బెంగళూరుతో సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ మధ్య – ఉత్తర బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలలోని మరికొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఒక ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం నుండి ఉత్తర ఒడిశా వరకు, మధ్య మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా, సగటు సముద్ర మట్టానికి 1.5 మరియు 4.6 కి.మీ మధ్య దక్షిణ దిశగా ఎత్తులో విస్తరించి ఉంది. మే 27వ తేదీ నాటికి పశ్చిమ మధ్య –దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉంది. ఆంధ్ర ప్రదేశ్ – యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి.

**వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు :**

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాం ..**

ఆదివారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. సోమవారం, మంగళవారం భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

**దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ :–**

ఆదివారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు –బలమైన ఈదురు గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 50 –60 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

**రాయలసీమ:–**

ఆదివారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 50 –60 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది.

# ఇకనుంచి శ్రీవారి సేవలు విశ్వవ్యాప్తం..





- సీఎం చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ కీలక నిర్ణయం..

**తిరుమల, (నినాదం న్యూస్):** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సేవను విశ్వవ్యాప్తం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టింది. టిటిడిలో శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసేందుకు టిటిడి ఈవో జె శ్యామల రావు అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్న సమావేశంలో 14 దేశాలకు చెందిన వివిధ రంగాల ఎన్ఆర్ఐలు వర్చువల్ గా హాజరయ్యారు.. ఈ సందర్భంగా కీలక చర్చ జరిగింది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి సేవ చేసేందుకు భక్తులు పలు రాష్ట్రాల నుంచి స్వచ్ఛందంగా వస్తున్నారన్న ఈఓ తెలిపారు. దేశంలోని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు రాష్ట్రాల నుంచి శ్రీవారి సేవకులు తిరుమలకు వచ్చి సేవలు అందిస్తున్నారని వివరించారు. ఇప్పుడు ఈ సేవల్లో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు అవకాశం ఇవ్వాలని టీటీడీ నిర్ణయించిందని.. ఈవో తెలిపారు. వివిధ రంగాలలో నిపుణులైన ఎన్ఆర్ఐ లు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొంది. టిటిడిలోని వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారి సేవకులు అందిస్తున్నారని, వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నా ఈఓ.. ఇప్పటికే అమెరికా తదితర దేశాలలో శ్రీనివాస కల్యాణాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సహకరిస్తున్నారని తెలిపారు.తాజాగా శ్రీవారి సేవలో తీసుకొస్తున్న సంస్కరణలలో భాగంగా టిటిడి ఈ నిర్ణయాన్ని తీసుకుంది. వైద్యం, ఐటీ, ఇంజనీరింగ్, ప్లానింగ్, వాటర్ మేనేజ్మెంట్, ఫుడ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలలో సేవలు అందించేందుకు ఎన్.ఆర్.ఐలు ముందుకు వస్తున్నారన్నారని టీటీడీ పేర్కొంది. ఎన్.ఆర్.ఐల నైపుణ్యం ఆధారంగా వారి సేవలను టిటిడిలో అమలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించింది. వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాల వైద్యులతో పాటు వివిధ రంగాల నిపుణులు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని ఈవో శ్యామల రావు తెలిపారు. ఇక NRI లు కూడా శ్రీవారి సేవకుల సేవలను విశ్వవ్యాప్తం చేసేందుకు టిటిడి ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇలాంటి అవకాశం స్వామి వారు కల్పించిన మహద్భాగ్యమని హర్షం వ్యక్తం చేశారు ఎన్ఆర్ఐ ప్రతినిధులు. వర్చువల్ గా జరిగిన ఈ సమావేశంలో జర్మనీ నుంచి సూర్యప్రకాశ్, డా. శివశంకర్, ఐర్లాండ్ నుంచి సంతోష్ పల్లె, రమేశ్ గుమ్మడవల్లి, యూకె నుంచి లోకనాథం, విజయ్ కుమార్, అరుణ్ ముమ్మలనేని, శివరామ్ రెడ్డి, విజయ్ కుమార్, డా. అనిల్ కుమార్, డా. అనిల్ కుమార్, రీతు, నెదర్లాండ్ నుంచి శివరామ్, ఫ్రాన్స్ నుంచి కన్నెవిరనె, పోలెండ్ ఐర్లాండ్ నుండి సంతోష్, చంద్ర అక్కల, స్వీడన్ నుంచి రమణకుమార్ రంగా, స్విట్జర్లాండ్ నుంచి అమర్ కవి, అమెరికా నుంచి రఘువీర్ బండార్, హర్షిత, USA నుంచి అమరనాథ్, డెన్మార్క్ నుంచి రామ్ దాస్, మారిషష్ శ్రీలంక నుండి విక్కీ తురాయ్యా, దుబాయ్ నుంచి విక్రమ్ యూకే నుండి డాక్టర్ స్కాటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# తిరుమలలో నమాజ్ కలకలం..

- టీటీడీ ఈవో కీలక విషయాలు వెల్లడి



**తిరుమల, (నినాదం న్యూస్):** ఇటీవల తిరుమలలో ఓ వ్యక్తి నమాజ్ చేయడం తీవ్ర కలకలం రేపింది. తిరుమల కళ్యాణ్ వేదిక వద్ద మధ్యాహ్నం ఓ వ్యక్తి నమాజ్ చేసి.. అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే టీటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో టీటీడీ సిబ్బంది సీసీటీవీ ఫుటేజ్ చూడటంతో దృశ్యాలు బయటపడ్డాయి. అయితే.. తిరుమలలో అన్యమత ప్రచారం చేయకూడదనే నిబంధనలు ఉన్న అతిక్రమించడం పై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన పై తాజాగా టీటీడీ ఈవో స్థానిక అన్నమయ్య భవన్‌లో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుమలలోని కళ్యాణ వేదికలో ఓ ముస్లిం వ్యక్తి నమాజు చేసిన ఘటనకు సంబంధించిన పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడైనట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. కొందరి ప్రోద్బలంతోనే సదరు వ్యక్తి కళ్యాణ వేదికలో నమాజు చేసినట్లు తేలిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సదరు నిందితుడిపై దేవాదాయ శాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## మహానాడుకు.. ముస్తాబు

- చివరి దశకు చేరుకున్న మహానాడు ఏర్పాట్లు
- 13 కమిటీల ఆధ్వర్యంలో శరవేగంగా పనులు
- 29న ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ



**అమరావతి, (నినాదం న్యూస్):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు పనులు చివరి దశకు చేరుకున్నాయి. వైఎస్ఆర్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో 27, 28, 29న ఈ పసుపు పండుగ నిర్మించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. వందలాదమంది కార్మికులు 145 ఎకరాల సువిశాల ప్రాగంణంలో రేయిపగళ్లు శ్రమించి ఏర్పాట్లు చేస్తున్నారు. మహా నాడు ఏర్పాట్లకు సంబంధించిన డ్రోన్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న ప్రతినిధుల సభకు 23 వేల మందిని ఆహ్వానించారు. మొదటి రెండ్రోజులు రాయలసీమ అభివృద్ధి, రాష్ట్ర సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించనున్నారు. 29వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు ఐదు లక్షలమంది హాజరు అవుతారని అంచనా వేస్తున్నారు. రేపు సాయంత్రానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు,జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కడపకు చేరుకోనున్నారు. కడప విమానాశ్రయం నుంచి మహానాడు ప్రాంగణానికి చేరుకునే మార్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు కటౌట్లు భారీగా ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులకు ఘనంగా ఆతిథ్యం ఇవ్వడానికి వివిధ వంటకాల తయారీకి సన్నాహాలు జరుగుతున్నాయి.

**అన్ని జిల్లాల్లో మినీ మహానాడు**

ఇప్పటికే ఏపీలోని అన్ని జిల్లాలలో మినీ మహానాడులు నిర్వహించి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొని మహానాడు విజయవంతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విదేశాల్లో సైతం మినీ మహానాడు నిర్వహిచడం విశేషం. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో టీడీపీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు.

## రాజమండ్రి టీడీపీలో పెను సంచలనం..

- ఒక్కసారిగా బద్దలైన అంతర్యుద్ధం



**రాజమండ్రి, (నినాదం న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి టీడీపీలో ఓ సంచలన ఘటన జరిగింది. చాలా రోజులుగా జరుగుతున్న అంతర్యుద్ధం ఈరోజు బహిరంగంగా బయటపడింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మధ్య ఉన్న విభేదాలు బహిర్గతం అయ్యాయి. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేసిన వ్యాఖ్యలతో బుచ్చయ్య చౌదరి ఫైర్ అయ్యారు.. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు తన ఘనతేనని ఆదిరెడ్డి చెప్పుకోవడంతో ఆయన మండిపడ్డారు. తెలుగు విశ్వవిద్యాలయంకు భూముల కేటాయింపులో తాను కూడా భాగస్వామిని అని గుర్తు చేశారు. 1985లోనే నందమూరి తారక రామారావు స్వయంగా ఆ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారని చెప్పారు. అయితే యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన ప్రణాళికలు సైతం ఎన్టీఆరే రచించారని, కానీ భూముల కేటాయింపులో తానూ కీలక పాత్ర పోషించానని చెప్పారు. అంతేకాదు రాష్ట్ర విభజన తర్వాత 2014–2019 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చాలా సార్లు చర్చించి తెలుగు విశ్వవిద్యాలయం రాష్ట్రానికి రావడానికి తాను చాలా కృషి చేశానని చెప్పారు. తన చరిత్ర తెలియకుండానే కొందరు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే.. ఎవరో కన్న బిడ్డకు తండ్రిని తానే చెప్పుకున్న సామెత గుర్తొస్తోందని విమర్శించారు. రాజమండ్రి అభివృద్ధిలోనూ తన పాత్ర చాలా ఎక్కువగా ఉందని, ఎవరూ ఖండించలేరన్నారు. గత ఏడాది కాలంలో రాజమండ్రిలో ఏం అభివృద్ధి జరిగిందని, ఫ్లెక్సీలు కట్టుకుని, డబ్బాలు కొట్టుకుంటున్నారని బుచ్చయ్య చౌదరి ఎద్దేవా చేశారు.

## పవన్‌కళ్యాణ్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన రాజేంద్రప్రసాద్..

- నా అనుమానం ఇదేనంటూ..

అసలు విషయం బయటపెట్టిన నటుడు

**విశాఖపట్నం, (నినాదం న్యూస్):** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినిమా ఇండస్ట్రీపై అలకబూనాడు. ఏడాది అయిపోయినా సరే మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబు నాయుడును కలవలేదని నోట్ రిలీజ్ చేశాడు. తామేమో సినిమా పరిశ్రమను అభివృద్ధి చేయాలని చూస్తుంటే.. కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. టికెట్ రేట్ల గురించి మాత్రమే కలుస్తరని రాసుకొచ్చాడు. అయితే ఈ విషయంలో చాలా మంది చాలా రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు పవన్‌కు సపోర్ట్ చేస్తుంటే ఇంకొందరు మాత్రం ఆయన అధికారంలోకి రాకముందు ఇచ్చిన స్పీచ్‌ను వైరల్ చేస్తున్నారు. అసలు సీఎం ఎవ్వరు? ఎందుకు కలవాలి? అని ప్రశ్నించిన వీడియోను చూపిస్తూ దీని గురించి ఏమంటారని అడుగుతున్నారు. ఇక ఈ విషయంపై సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ‘సినిమా ఇండస్ట్రీ అంటే కళాకారులు అని.. నా అనుమానం ఏంటంటే అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సీఎంను ఎందుకు కలవాలి? అసలు ఆ అవసరం ఏంటి?’ అని ప్రశ్నించారు. అది అలా అడగు.. స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చావని కొందరు అంటుంటే... ఇది ఓల్డ్ వీడియో అని ఇంకొందరు కామెంట్ చేస్తున్నారు. గతంలో పవన్ స్టేట్మెంట్స్.. ఇప్పటి స్టాండ్ గురించి కంపెయిర్ చేస్తున్నారు.

# మళ్లీ ట్రాఫిక్ జామ్

- ప్రధాన రహదారిపై నిలుపుతున్న ఇసుక లారీలు
- పోలీస్ ఆదేశాలను తుంగలో తొక్కిన ఇసుక లారీ యజమానులు





**మణుగూరు, మే 25 (నినాదం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం నుంచి వరంగల్ వెళ్ళు ప్రధాన రహదారిపై లారీలు నిలిపివేతో, నాలుగు గంటల ట్రాఫిక్ జామ్ అని వార్తతో స్పందించిన పోలీసులు లారీ ఓనర్లతో బొగ్గు టిప్పర్లు ఓనర్లతో సమావేశం నిర్వహించి ఎన్ని హెచ్చరికలు చేసినా కుక్క తోకవంకరగానే ఉండిపోయింది. ఆదివారం మణుగూరు నుంచి వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిపై విజయనగరం వద్ద సుమారు ఒక 200 లారీలు రోడ్డుపై నిలిపివేయడంతో మరల నాలుగు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయింది. ఇసుక కోరి నుంచి తరలించే ఇసుక లారీలు డ్రైవర్లుఇష్టానుసారంగా వ్యవహరించడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకి పెద్ద సమస్యగా పరిమిస్తుంది. పోలీసులు సైతం ఈ లారీలను నివారించేందుకు తలలు పట్టుకుంటున్నారు. ఇసుక కోరి గుత్తేదారులంతారాజకీయ పార్టీలలో ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, పోలీసు నిబంధనలను లెక్కచేయడం లేదని వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తుంది. నిన్నటి రోజు మణుగూరు పోలీస్ స్టేషన్లో డిఎస్పి రవీంద్రారెడ్డిసమావేశంలో ఇసుక లారీలు రోడ్డు మీద నిలుపువేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఇసుకని గోదావరి నుంచి తరలించే రహదారిలో దుమ్మి ధూళి లేకుండా ఎప్పటికప్పుడు నీళ్లను స్ప్రే చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సంబంధిత శాఖ టీఎంఎండిసి అధికారులు వాలంటరీని నియమించుకోవాలని పోలీసులు హెచ్చరించిన పోలీసుల ఆదేశాలను పెడచెవిన పెట్టేసారు. తెల్లవారి అనగా ఆదివారం రోజు కూడా భారీ ఎత్తులో ట్రాఫిక్ జామ్ అవ్వడంతో మణుగూరు నుంచి ఎటునాగారం మంగపేట వరంగల్ వెళ్లి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎవరిని అనుకున్నా తమ పని తామే అని వ్యవహరిస్తున్న ఇసుక కోరి యజమానులు మొండి వైఖరి వహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు చూపించిన ఒక్క నిబంధనను కూడా పాటించకుండా ఇసుకను యధాతధంగా హైదరాబాద్ వరంగల్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. గోదావరి నదిలోకి యంత్రాలు వెళ్లకూడదని నిబంధనలు ఉన్న పెద్దపెద్ద యంత్రాలతో నది మధ్యలో నుంచి డైరెక్ట్ గా లారీలకు యంత్రాల ద్వారా ఇసుకను లోడ్ చేస్తూ బహిరంగనే తరలిస్తున్నారు. వీళ్ళకి ప్రభుత్వ నిబంధనలు గాని పోలీసులు హెచ్చరికలు గాని ఇసుక కోరి యజమానులు లెక్కచేయడం లేదని వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తుంది. ఇసుక లారీలు తిరిగే రహదారులన్ని ధ్వంసం అయిపోతున్నాయి, కోట్ల రూపాయల ఇసుకను అక్రమంగా సుదీర్ఘ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు నష్టపోతున్న రాజకీయ నాయకులు మాత్రం కలకలలాడిపోతున్నారు. మరొకపక్క ఇసుక కోరీలు యజమానులు విజృంభిస్తున్నారు దీంతో ప్రభుత్వము నష్టపోగా స్థానికంగా ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇదే కాక ప్రధాన రహదారులు లింక్ రోడ్లు అన్నిధ్వంసం అయిపోతున్నాయి. రాబో వర్షాకాలంలో ఈ రోడ్లపై వాహనాలు తిరిగే పరిస్థితి కూడా కనబడటం లేదు ఎక్కడ చూసినా రోడ్లు ధ్వంసం అయిపోతున్నాయి. కానీ జిల్లా యంత్రాంగం వీళ్ళని నిరోధించడంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లు ప్రజల ఆరోపిస్తున్నారు. పోలీసుల ఆదేశాలను సైతం లెక్కచేయటం లేదంటే ఇసుక కోరీల యజమానులు వెనక రాజకీయ బడా నేతలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు రాజకీయ నాయకులు ఇసుక కోరి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుని స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## నేటినుండి రోహిణి కార్తె ప్రారంభం



**వైరా, మే 25 (నినాదం న్యూస్):** రోహిణి కార్తె వచ్చింది అంటే వామ్మో రోహిణి కార్తెలో ఎండలకు రోళ్ళు పగిలే ఎండలు ఉంటాయి అనే నానుడి మనలో మెదలాడుతూ ఉంటుంది. నిజమే మరి ఈ నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తొలి రోజులలో కొద్ది కొద్దికగా ఉగాది నుండి తాపం పెరుగుతుంది.దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని మనకు చూపిస్తాడు.మామూలుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. మరి ఈ సంవత్సరం రోహిణి కార్తె ఏలా ఉంటుందో గమనిద్దాం...ఈ సంవత్సరం రోహిణి కార్తే మే 25 న ప్రారంభమై జూన్ 8 వరకు రోహిణి కార్తె ఉంటుంది. రోహిణి కార్తె ఫలితంగా ఈ పక్షం రోజులు అధిక వేడి గాలులు , ఎండ తీవ్రతలు , అగ్ని ప్రమాదాలు , ఉక్కపోతలు ఉంటాయి. ఎండ తీవ్రతకు శరీరం అలసిపోతుంది. కావునా ఆరోగ్య రీత్య తగు శ్రద్దలు తీసుకోవాలి. ఎక్కువ మట్టికుండ నీళ్ళు త్రాగడం ,మజ్జిగా , పండ్ల రసాలు , కొబ్బరినీళ్ళు , నిమ్మరసం , రాగి జావ , ఫలుదా లాంటివిఎక్కువగా త్రాగడం వలన ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది కొంత ఉపశమనం లభిస్తుంది.-మసాలాకు సంబంధించిన ఆహార పదార్థాలు , వేపుళ్ళు , పచ్చళ్ళు , ఎక్కువ ఆయిల్ ఫుడ్ కలిగిన ఆహార పదార్థాలు తినకూడదు. నీళ్ళ సౌకర్యం ఉన్నవారు తప్పకుండా రెండు పూటల స్నానం చేయండి. అన్నిరకాల వయస్సు వారు ఎక్కువ కాటన్ దుస్తులు వాడండి , తెల్లని రంగు కల్గినవి, తేలిక రంగులు గల కాటన్ బట్టలు ధరిస్తే ఉష్ణ తాపం నుండి ఉపశమనం లభిస్తుంది. శారీరక తాపం తగ్గుతుంది. చిన్నపిల్లలకు మీరు ఉండే ఇంటి ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి తడి గుడ్డతో తుడిచి బట్టలు మార్చండి. ఎవరైనా సరే ముదురు రంగు దుస్తులు వేయకపోవడం ఉత్తమం. ముఖ్యంగా సాటి జీవులైన పశు , పక్ష్యాదులకు త్రాగడానికి మీరు నివసించే చోట వాటికి నీళ్ళను ఏర్పాటు చేయండి. బాటసారులు ఎవరైనా సరే వాళ్ళు అడగక పోయిన వాళ్ళ దాహాన్ని తీర్చేందుకు వారికి త్రాగడానికి చల్లటి నీళ్ళను అందివ్వండి. మీకున్న గ్రహభాదలు నివారణకు మార్గమై కొంత ఉపశమనం లభిస్తుంది. వర్షాకాలం, శీతాకాలం ఎలాగైనా గడిపేయొచ్చు కానీ ఎండాకాలంలో వేడిని, ఉక్కబోతను తట్టుకోవడం చాలా కష్టం. గత కొన్నేళ్లుగా వేసవి దెబ్బ మామూలుగా ఉండటం లేదు. ఉపరితల ఆవర్తనాల పుణ్యమా ...! అని ఈ ఏడాది మాత్రం వేసవి నుంచి జాగ్రత్తగా గట్టెక్కేశాం. మేలో ఎండలు ఉంటాయి కానీ ఈ నెలలో సగభాగం వర్షాలతో గడిచిపోయింది. అందరికీ వరుణుడు రిలీఫ్ ఇచ్చినా రైతన్నలకు మాత్రం గోస మిగిల్చాడు. అదే బాధాకరం

## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు





- చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామేన భీమ్ భరత్

**చేవెళ్ల మే 25 (నినాదం న్యూస్):** ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ అన్నారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లీ మండలం మహారాజపేట్, ఇరుకుంట తండా, అంతప్ప గూడెం గ్రామాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని లబ్ధి దారులకు చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామేన భీమ్ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేద వాడికి సొంతింటి కల సహకారం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు దశల వారీగా ఈ సాయాన్ని విడుదల చేస్తాం వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించింది. కాగా మొదటి విడతలో సొంత జాగా ఉన్నవారికే ఇండ్లను కేటాయిస్తోంది ప్రభుత్వం. వచ్చే విడత నుంచి ఇంటి స్థలం లేని వారికి ప్లాట్ మంజూరు చేసి రూ. 5 లక్షలతో ఇల్లు నిర్మించనుంది అని తెలియజేశారు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి అదనంగా రూ. లక్ష సాయం అందించనున్నట్లు తెలిపారు. అంటే బీసీ, మైనార్టీ వర్గాలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు సాయంగా అందిస్తుంటే, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రూ. 6 లక్షలు సాయం అందించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లోనూ ఈ వాగ్దానం చేసింది. ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ ద్వారా ఇల్లు కట్టుకునేందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు, ఇతరులకు రూ. 5 లక్షలు సాయంగా అందిస్తామన్నారు ఇప్పుడు అందుకు అనుగుణంగానే హామీని అమలు చేస్తోంది అని కొనియాడారు.ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను మహిళల పేరు మీదే అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మహిళలు సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగున్నట్లే అని పేర్కొంది. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మహిళ పేరు మీద మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి ,చేవెళ్ళ నియోజక వర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా ప్రెసిడెంట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులు , మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఎన్ ఎస్ యు ఐ ఇతర అనుబంధ అధ్యక్షులు, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు డైరెక్టర్లు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు జడ్పిటిసిలు మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యాదవుల సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలి

- ఇల్లందు అఖిల భారత యాదవ మహాసభ అడహాక్ కమిటీ సమావేశంలో మేకల



**ఖమ్మం, మే 25(నినాదం):** యాదవుల కుటుంబ సభ్యుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిస్థితి విధంగా మండల యాదవ్ సంఘ సభ్యులు కృషి చేయాలని సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లి బాబు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో జిల్లా గౌరవాధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య సమక్షంలో మున్సిపల్ పరిధిలోని యాదవులు ఆదివారం నాడు సమావేశమై అఖిల భారత యాదవ మహాసభ తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ సలహాదారులుగా ప్రభు నాథ్ యాదవ్, కన్వీనర్ గా మారి రామ లింగం యాదవ్,ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలోఅఖిల భారత యాదవ మహాసభ చేపట్టబోయే కార్యక్రమాల గురించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పడిన తాత్కాలిక కమిటిని అభినందించిన సమావేశంలో మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ 100 సంవత్సరాలు నిండిన అఖిల భారత యాదవ మహాసభ ఈనాడు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తుందని, ఆ జెండా అండతో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు మన యాదవులు ఐక్యంగా పనిచేస్తున్నారని, వ్యక్తిగత సమస్యలతో ఏర్పడిన కొన్ని సంఘాలు అన్ని నదులు సముద్రంలో కలిసినట్లు ఏనాటికైనా ఈ సంఘాలు మళ్లీ అఖిల భారత యాదవ మహాసభ జండా క్రిందకు రావాల్సిందేనని, మన యాదవుల సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిని సాధించుకోవాలంటే ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ, వర్గ విభేదాలు ఉన్నప్పటికీ మనమంతా ఐక్యంగా ఉంటేనే, మన వారిని చైతన్యం చేస్తేనే తప్ప మనం సాధించుకోలేమని వివరించారు. బీసీ ఎస్సీ ఎస్టీలు అధికంగా ఉన్నప్పటికీ అగ్రకులాల వాళ్ళు ఐక్యంగా ఉండబట్టే వాళ్లు రాజ్యాధికారాన్ని సాధించుకుం టున్నారని తెలిపారు. మనలో మనకు చిచ్చుపెట్టి ఇతర కులాల వారి సహాయంతో మన అభివృద్ధిని మనమే నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. రాబోయే ఇల్లందు మున్సిపల్ ఎన్నికలలో 24 వార్డులలో మన యాదవుల సత్తా ఏమిటో చూపించి మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో యాదవులమంతా చైతన్యం కావాల్సిన అవసరం ఉందని చిలకల వెంకట నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు చేతుల నాగేశ్వరరావు, పుట్ట ఉపేందర్,మోరి మేకల కోటయ్య , బండారి ప్రభాకర్, దుంపటిరవి, వంగపండ్ల నాగరాజు, కావేటి రమేష్, కోడి రాజేందర్, మేకల నాగేశ్వరరావు కొడారి రాజేందర్, ఎల్లబోయిన ప్రేమ్ కుమార్ పగడాల పవన్, దగ్గుల లింగయ్య కాసాని రాజేష్, కోడి లక్ష్మయ్య, చందా సైదులు రాసాల లింగయ్య, పోటు వెంకన్న, బొల్లినేని నాగరాజు, జోన బోయిన సాంబయ్య మండల వీరన్న కోడి లక్ష్మీనారాయణ, సంఘ బిక్షపతి, ఈర్ల శ్రీకాంత్, మందా వెంకన్న, చందా ఐలయ్య వాకదాని వలరాజు, జట్టు కిషోర్ కుమార్, శీలం నగేష్, వినోద్, తదితర యాదవ బంధుమిత్రులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ మహమ్మద్ మునీర్ అకాల మృతి బాధాకరం

- రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర



**ఖమ్మం,మే 25(నినాదం):** ప్రముఖ జర్నలిస్ట్ మహ్మద్ మునీర్ అకాల మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం ప్రకటించారు.మునీర్ సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కుల పరిష్కారానికి, పేద ప్రజల పక్షాన ఎన్నో వార్తలు, కథనాలు రాశారని,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మహోద్యమంలో చురుకైన పాత్ర పోషించారని ఎంపీ రవిచంద్ర తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.ఆయన అకాల మృతి తెలంగాణ సమాజానికి,పత్రికా రంగానికి తీరని లోటని ఎంపీ రవిచంద్ర చెప్పారు.మునీర్ కుటుంబసభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఓల్డ్ పోలీస్ లైన్ ఫ్రెండ్స్ ఆత్మీయ సమ్మేళనం సన్మానం



**ఖమ్మం మే25(నినాదం):** ఓల్డ్ పోలీస్ లైన్ ఖమ్మం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఆత్మీయ సమ్మేళనం సన్మాన కార్యక్రమం శ్రీనివాసనగర్ బృందావన్ గార్డెన్ ఫంక్షన్ హాలు నందు నిర్వహించడం జరిగింది. ముందుగా పెద్దలు మన నుంచి భౌతికంగా దూరం ఇన వారి ఆత్మ శాంతికి మౌనం పాటించి తరువాత రిటైర్ ఐన వారికి సన్మానం జరపడం అయింది. అదే విధంగా ప్రమోషన్ వచ్చిన వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం జరుపుటకు కృషి చేసిన ఫ్రెండ్స్ అందరికీ ధన్యవాదములు. ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఓల్డ్ పోలీస్ లైన్ ఫ్రెండ్స్ 200 కోటర్స్ లో ఉన్న వాళ్ళ తల్లిదండ్రుల పిల్లలతో గ్రూప్ క్రియేట్ చేయడం ఈరోజు ఆత్మీయ మిత్రుల సమ్మేళనం మరియు సన్మానం సీఐలు మరియు ఎస్సైలకు సన్మానం నిర్వహించడం జరిగింది. అందులో పాత పోలీసుల మిత్రుల అందరూ కలిసి ఆనందంగా వారి వారి తీపి జ్ఞాపకాలను పంచుకోవడం జరిగింది. ఈ గ్రూపు అందరిని కలపటానికి ముఖ్యులు బోలె పాషా కాజా అలీ, నల్ల శ్రీనివాస్, సుజావుద్దీన్ గౌరవ అధ్యక్షులు రవికుమార్ రిటైర్డ్ అడిషనల్ డిసిపి మరియు ఉమా శంకర్ వీరి సారధ్యంలో ఈరోజు గెట్ సుమారు 300 మందితో టుగెదర్ ప్రోగ్రాం జరిగింది. ఈ గెట్ టుగెదర్ విచ్చేసిన గ్రూప్ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసినారు.


## జీవాల రైతులకు న్యాయం చేయండి

- సీపీఐ నేత బాగం



**ఖమ్మం, మే 25(నినాదం):** ఆరెకోడు తండాలో విషహారం తిని పదుల సంఖ్యలో జీవాలు మృతిచెందాయని, ఆ రైతులకు న్యాయం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాలో విషహారం తిని వందల సంఖ్యలో జీవాలు అనారోగ్యానికి గురి కాగా అందులో 70 జీవాలు మృతిచెందాయి. రైతులు విషహారం తిని అనారోగ్యానికి గురైన జీవాలను ఖమ్మం రాపర్తి నగర్ లోని పశువుల ఆసుపత్రికి తరలించారు. కడుపు ఉబ్బి వెంటనే ప్రాణాలను కోల్పోయి. ఆసుపత్రికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం బాధ్యులు యడ్లపల్లి శంకరయ్య తదితరులు చేరుకుని రైతులను ఓదార్చారు. వైద్యులతో మాట్లాడారు. జీవాల మృతికి పోస్టుమార్టం చేస్తే తప్ప కారణం చెప్పలేమన్నారు. ఆరెకోడు తండాలో 20 కుటుంబాలకు చెందిన రైతులు సుమారు 300 జీవాలను కలిపి మేతకు తోలుకుని వెళ్లారు. జీవాలు ఏమి తిన్నాయో కానీ కడుపుఉబ్బి 70 వరకు చనిపోగా మిగిలినవి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జీవాల రైతులందరూ -నిరుపేదలని జీవాలపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రభుత్వం తక్షణం పరిహారం అందించి తిరిగి జీవాలు కొనుగోలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని హేమంతరావు కోరారు. బాధిత రైతులను సిపిఐ నాయకులు ఓదార్చారు.


## ఖమ్మంలో ఒయాసిస్ జననీ యాత్రను ప్రారంభించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ



**ఖమ్మం,మే 25(నినాదం):** ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా వారు తెలిపారు. భారతదేశంలో విశ్వసనీయ ఫర్టిలిటి కేర్ చెయిన్ గా పేరు పొందిన ఒయాసిస్ ఫెర్టిలిటీ మే నెలను మదర్స్ మంత్ గా వేడుక చేసుకుంటోంది.అందులో భాగంగా మదర్స్ డేని పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా 30 రోజుల పాటు 30 పట్టణాల్లో 'ఒయాసిస్ జనని యాత్ర' పేరిట ఉచిత మొబైల్ ఫర్టిలిటి క్యాంప్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని ఖమ్మంలో ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క సైంటిఫిక్ హెడ్ మరియు క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య.ఎం మరియు ఒయాసిస్ ఫెర్టిలిటీ యొక్క రీజినల్ మెడికల్ హెడ్ మరియు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జలగం కావ్యరావు మరియు ఇతర ప్రముఖులు ప్రారంభించారు. డాక్టర్ జలగం కావ్య రావు మాట్లాడుతూ,సంతానలేమి అనేది ఇకపై ఒక వైద్యపరమైన అంశం మాత్రమే కాదు.పెరిగిపోతున్న జీవనశైలి సంబంధిత ఆందోళన కూడా,పీ.సీ.ఓ.డీ.,తల్లిదండ్రులు కావడంలో జాప్యం,ఒత్తిళ్లు వంటి వాటితో ముడిపడి ఉన్న కేసులు పెరిగిపోతున్నసందర్భంలో సత్వరడయాగ్నసిస్ ఎంతో ముఖ్యం.ఒయాసిస్ జనని యాత్ర ద్వారా మేం నిపుణుల సంరక్షణను, అధునాతన సంతాన సాఫల్య పరిష్కారాలను ప్రతీ గుమ్మం వద్దకు తీసుకెళ్లగలుగుతున్నాం,మరీ ముఖ్యంగా ఈ తరహా సదుపాయాలు అంతగా అందుబాటులో లేని ప్రాంతాల్లో. తద్వారా సకాలం లో వారికి అండగా నిలుస్తూ,తల్లిదండ్రులం కావాలనే కోరిక ఫలించేలా చేస్తున్నాం.అవగాహనను అందుబాటుతో మిళితం చేయడం ద్వారా,ఆయా వ్యక్తులు తమ పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకోగలిగేలా సాధికారికతను అందిస్తున్నాం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.వి.పి బొడ్డు రాజేష్,ఒయాసిస్ ఫెర్టిలిటీ బృందం పాల్గొన్నారు.

## డివిజన్‌లోని ప్రతి కాలనీ అభివృద్ధి చేస్తా

- కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్



**అల్వాల్, మే 25 (నినాదం న్యూస్) :** డివిజన్ లోని ప్రతి కాలనీ అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అన్నారు. ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కాలనీలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ కాలని వాసులతో పర్యటించడం జరిగింది. కాలనీ లో రోడ్డు సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ కోరారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కాలనీ వాసులు ప్రెసిడెంట్ నర్సింగరావు బాబు రావు, రంగయ్య, మాధవన్, పండారి, రాము, లక్ష్మి, మనోహర్, రత్నం, భాను, హాఫిజ్, నరేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా సాగుతున్న పద్మశాలి సంఘం ఎన్నికలు

- రెండు ప్యానళ్ల అభ్యర్థుల పోటాపోటీ ప్రచారాలు



**నిజామాబాద్ ప్రతినిధి, మే 25 (నినాదం న్యూస్) :** నిజామాబాద్ నగర పద్మ శాలి సంఘం ఎన్నికలు ఉత్కంఠ భరతంగా సాగుతున్నాయి. నగరంలోని సూర్య నగర్ పద్మశాలి ఎన్నికలు పాఠశాలలో జరుగుతున్నాయి. 9 గంటల నుంచి ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం వరకు కొనసాగనుంది. రెండు ప్యానళ్ళ మధ్య పోటీ ఉత్కకంఠ భరింతంగా సాగుతుంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ గత నెల రోజులుగా ప్రచార పర్వాన్ని ఊపందించారు. నిజామాబాద్ నగరంలో 65 తర్పలకు గాను 5230 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల కేంద్రం వద్ద అభ్యర్థుల తరపున ప్రచారం జోరందుకుంది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో వారి భవితవ్యం తేలనుంది.

## నేటినుంచి జన సేవాదళ్ శిక్షణ శిబిరం ప్రారంభం

- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ రాక



**చేవెళ్ల, మే 25 (నినాదం న్యూస్):** సిపిఐ రాష్ట్రస్థాయి జన సేవాదళ్ శిక్షణ శిబిరం కార్యక్రమం నేటి నుంచి చేవెళ్ల పట్టణంలో ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ హాజరవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు గారు ప్రారంభించిన జన సేవాదళ్ కార్యకర్తలు సమాజంలో భారీ విపత్తులు జరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఉన్నప్పుడు వారికి అండగా కమ్యూనిస్టు కార్యకర్తలు అయిన జనసేవ దళ్ కార్యకర్తలు వారికి అండగా నిలబడి అనేక సేవా కార్యక్రమాలు చేస్తారని ఆయన తెలిపారుక్రమశిక్షణ కలిగిన జన సేవాదళ్ కార్యకర్తలు మతోన్మాదముకలు ప్రజల మధ్య చీలికలు తెచ్చి విచ్చిందానికి పాల్పడినప్పుడు మతోన్మాదులకు వ్యతిరేకంగా జనసేవ కార్యకర్తలు నిలబడతారని ఆయన తెలిపారు. ప్రభుత్వాల ధమనకాండలో గాయపడిన ఉద్యమకారులకు ఉద్యమాలలో నిరంతరం పాల్గొనే నాయకులకు జనసేన కార్యకర్తలు భద్రత వలయంగా నిలబడి సేవచేసే నిబద్ధత కలిగిన కార్యకర్తలే జన సేవాదళ్ కార్యకర్తలని ఆయన హితోపలికారు చేవెళ్ల పట్టణంలో ఆరు రోజుల పాటు జరిగే జనసేన శిక్షణ క్యాంపు కు సిపిఐ రాష్ట్ర అగ్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు కే రామస్వామి పాల్గొన్నారు.

## మునీర్ మరణం సింగరేణికీ తీరనిలోటు



**నిజామాబాద్ ప్రతినిధి, మే 25 (నినాదం న్యూస్):** మునీర్ ఆకస్మిక మరణం సింగరేణి కార్మిక వర్గానికి తీరనిలోటని ఇంటరనేషనల్ దళిత జర్నలిస్ట్ నెటవర్క్ (ఐడి జెఎన్ ) ఛైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మంద జనార్ధన్, కో కన్వీనర్ ఎడ్ల సంజీవ్‌లు అన్నారు. అనారోగ్యంతో శనివారం రాత్రి మునీర్ ఆకస్మిక మరణం చెందారు. మునీర్ మరణించాడంటే నమ్మలేక పోతున్నామన్నారు. తండ్రి కార్మికునిగా పని చేయడంతో మొదట అటువైపు అడుగులు వేశారు. ఆలా కార్మికుని కొడుకుగా, కార్మికుడిగా పని చేస్తూనే కార్మిక సమస్యలపై విప్లవ కార్యకర్తగా పని చేశారు. మరోవైపు ప్రజా సమస్యలను వెలికి తీస్తూ, కార్మిక సమస్యపై స్పందిస్తూ జర్నలిస్టుగా కొనసాగారు. తెలంగాణ ఉద్యమకారుడిగా అన్ని భాధ్యతలను ప్రేమతో, సమర్థవంతంగా నిర్వహించిన గొప్ప నాయకుడు అన్నారు. సింగరేణి జెఎసి కన్వీనర్ గా సైతం పని చేశారన్నారు. అటువంటి నాయకుడు, మా మిత్రుణ్ణి కోల్పోవడం భవిష్యత్ సమాజానికి ఎనలేని నష్టమని, ముఖ్యనంగా సింగరేణి కార్మిక వర్గానికి తీరనిలోటు అన్నారు. హైదరాబాద్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మరణించిన మునీర్ కు ఐడిజెఎన్ రాష్ట్ర కమిటీ తరుపున మునీర్ కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

# రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




**భూపాలపల్లి మే 25 (నినాదం న్యూస్):** రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీలోని 20, 21, 22 వార్డులు హనుమాన్ నగర్, శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీలల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేశారు. అనంతరం అక్కడున్న నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అణగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. అదేవిధంగా హనుమాన్ నగర్, శాంతినగర్, లక్ష్మీపూర్ కాలనీలల్లో యాత్ర మధ్యలో పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న మున్సిపల్ ఏఈ మానస కు సూచించారు. ఈ కార్యక్రమంలో బట్టు కరుణాకర్, ముంజల రవీందర్, చల్ల రేణుక, నగునూరి రజినీకాంత్, కురిమిళ్ళ శ్రీనివాస్, నోముల నారాయణ, షేక్ ఇజాజ్,పాష పలువురు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి



**కోదాడ,మే 25(నినాదం న్యూస్) :** కోదాడ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని,భారీ నీటిపారుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,కోదాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి అన్నారు.ఆదివారం కోదాడ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై కోదాడ చైర్ పర్సన్,పాలకవర్గ సభ్యులతో హైదరాబాదులో భారీ నీటిపారుదల శాఖ మంత్రి నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన మంజూరు చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.మరొక చోట అనువైన ప్రాంతంలో ప్రత్యేకంగా పశువుల సంత ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామని మంత్రులు తెలిపారు.మార్కెట్ అభివృద్ధి తో పాటు రైతులకు పొలాలకు వెళ్లే దారులుకు మట్టి రోడ్లు మంజూరు చేయాలని పొలాలకు రైతులు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.మండలానికి ఒక గోదాము ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మంత్రులను ఎమ్మెల్యేను చైర్ పర్సన్ పాలకవర్గ సభ్యులు కోరారు.రైతుల సమస్యల పరిష్కారాన్ని మంత్రులు ఎమ్మెల్యే కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమా ల్లో చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్,వేస్ చైర్మన్ బషీర్,జిల్లా మార్కెటింగ్ అధికారి శర్మ,సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ రాహుల్,సభ్యులు సిహెచ్ సూర్యం,వెంకట్ రెడ్డి, వీరబాబు,మణెమ్మ,వెంకటేశ్వర్లు,శ్రీను,వేణు,శ్రీనువాసు తదితరులు ఉన్నారు.

## అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 1వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ది



**నర్సంపేట, మే25 (నినాదం):** బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవ సభను జూన్ 1న అమెరికా డల్లాస్ రాష్ట్రంలో నిర్వహించినున్నా సందర్భంగా నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి సభకు హాజరుకానున్నారు.ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే విధంగా వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతంలో కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీమంత్రి హరీష్ రావు మన్ననలతో అమెరికా డల్లాస్ నగరం లో నిర్వహించినున్న పార్టీ రజతోత్సవ సభ వేడుకలలో పాల్గొననున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి ఉద్యమకారుడిగా, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా,నాయకునిగా, కెసిఆర్ సైనికుడిగా 25 సంవత్సరాలు పార్టీలో పని చేయడం,తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వామిగా, ఉండడం గర్వంగా ఉందన్నారు.అమెరికాలో జరిగే రజతోత్సవ సభలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందని సుదర్శన్ రెడ్డి తెలిపారు.

## ప్రజా సమస్యలు తెలిసిన నాయకుడికే అవకాశం ఇవ్వాలే

- మంత్రికి తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి వినతి



**ములుగు ప్రతినిధి, (నినాదం):** ప్రజా సమస్యలపై అవగాహన కల్గి సమస్యను పరిష్కరించే నాయకుడికే జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించాలని తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కోరే రవి యాదవ్ మంత్రికి విన్నవించారు. ములుగు జిల్లాలో గతంలో ప్రజా సమస్యలు పట్టించుకొని నాయకుడిని నియమించడం వలన ఒకే సామాజిక వర్గానికి చెందిన భూస్వామ్య పెట్టుబడిదారుల ఆధిపత్యం పెరిగిందన్నారు. అధ్యక్షులు ప్రజలకు అందుబాటులో లేకపోవడం ప్రజా సమస్యలు పట్టించుకొకపోవడంతో సకల జనుల ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన వివరించారు. ఎన్నో ఆశలతో నాయకులను పార్టీని గెలిపించి నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని, జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి చెందినవారి ఆధిపత్యం పెరుగడంతో చాలా కులాలు అనేక బాధలను ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో మంత్రి స్పందించి సకల జనులకు ఆమోద యోగ్యుడైన దళిత బహుజన ఉద్యమంలో చురుగ్గా పని చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వ్యక్తికి జిల్లా అధ్యక్షులుగా నియమించాలని ఆయన కోరారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు : వ్యక్తికి తీవ్ర గాయాలు



**హుజూర్ నగర్(గరిడేపల్లి)మే 24(నినాదం న్యూస్) :** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రమైన గుండాలమ్మ గుడి సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది.ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి గ్రామానికి చెందిన ప్రధాని వెంకన్న తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ యూటర్న్ తీసుకుంటుండగా హుజూర్ నగర్ నుంచి నేరేడుచర్ల వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టగా రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. అంబులెన్స్ లో హుజూర్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వెంకన్న కుమార్తె పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దైవభక్తితో మానసిక ప్రశాంతత



**చింతపల్లి, మే 25 (నినాదం న్యూస్):** దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మండలంలోని తక్కెళ్ళపల్లి గ్రామంలో శ్రీగణపతి, మడేలయ్యా,శీతలమ్మ, ఈదమ్మ తల్లి,శివ, నంది,ఈదమ్మ, కీర్తి ధ్వజ పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలమర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పొగాకు శ్రీశైలం, పందుల జగదీశ్ గౌడ్,తదితరులు ఉన్నారు.

## అర్హులైన రైతులకు రైతు భరోసా అందించాలి

- విజయసారథి సీపీఐ జిల్లా కార్యదర్శి



**డోర్నకల్/మరిపెడ మే 25(నినాదం న్యూస్) :** రైతు భరోసా పథకం ఎన్ని ఎకరాల రైతులకు ఇస్తారో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉన్నదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి డిమాండ్ చేశారు.సిపిఐ మరిపెడ మండల ఐదవ మహాసభ ఒంటికొమ్ము లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అరుణ పతాకాన్ని ఎగరవేయగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ సారధి మాట్లాడుతూ రబి సీజన్ అయిపోయి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న ఇప్పటికీ నాలుగు ఎకరాల లోపు రైతాంగానికి రైతు భరోసా అందించారని మిగతా రైతుల పరిస్థితి ఏంటో,ఎన్ని ఎకరాల వరకు ఇస్తారో స్పష్టమైన విధానాన్ని ప్రకటించటకపోవడంతో రైతుల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడ్డదని అన్నారు. కొత్త రేషన్ కార్డ్స్ జారీ ప్రక్రియ, అర్హత గల వృద్ధులు ,వితంతువులు, వికలాంగులకు కొత్తగా పెన్షన్ లు అందించాలని,ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న గందరగోళాన్ని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.మండల కార్యదర్శిగా మారగాని బాలకృష్ణను, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రషీద్ ను మరో ఏడుగురితో నూతన మండల సమితిని మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కరణం రాజన్న,మల్లెపాక యాకన్న,పగిళ్ళఅంజయ్య అక్కినపల్లి రాములు,పాక వెంకన్న,తిప్పర్తి సైదులు,పానుబోతు వెంకన్న, మధు,లింగయ్య,రేగ నరసయ్య, గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## అపూర్వ 'సమ్మేళనం'



**ఎల్కతుర్తి మే25(నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల జడ్పీహెచ్ఎస్ లో 2003-2004 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 22 సంవత్సరాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకుంటూ సందడి చేశారు. వారు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకొని సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందులో అప్పటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సత్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు మిర్యాల శ్వేత, స్రవంతి, శ్రీలత, తిరుమల తదితరులు ఉన్నారు.

## ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పంచాయతీ కార్యాలయం భవనం

- పంచాయతీ కార్యాలయం భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ జోగు సరోజినీ పిచ్చిరెడ్డి





**హుజూర్ నగర్ ( గరిడేపల్లి ) మే 24 ( నినాదం న్యూస్) :** అన్ని హంగులతో అధునాతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం నిర్మాణం జరగటం చాలా ఆనందంగా ఉందని, పొనుగోడు తాజా మాజీ సర్పంచ్ జోగు సరోజినీ పిచ్చిరెడ్డి అన్నారు. శనివారం పొనుగోడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాల భవనాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో నేను సర్పంచ్ గా ఉన్న సమయంలో ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధుల నుండి భవనానికి ఇరవై లక్షల రూపాయలు నిదులు కేటాయించారని, అట్టి నిధులతో నిర్మించిన పంచాయతీ భవన నిర్మాణం చేయడం జరి గిందని, కార్యాలయ నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడ కుండా, పూర్తి నాణ్యతతో నిర్మాణం జరిపినట్లు ఆమె తెలియజే శారు. అన్ని హంగులు, వసతులతో నిర్మాణం పూర్తి చేసినట్లు అందుకు సహ కరించిన గ్రామ యువతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అతి త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ నందిపాటి సైదులు, ఆనంతు చంద్ర య్య, చందా సైదిరెడ్డి, ఏసీరెడ్డి నాగిరెడ్డి, అల్లుబెల్లి సైదిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల స్థల దాత వర్ధంతి వేడుకలు



**మంగపేట, మే 25 (నినాదం న్యూస్) :** మంగపేట మండలం కమలాపురం లోని ప్రభుత్వ పాఠశాలకు స్థలం బిల్డింగ్ దాత కమలాపురం గ్రామావాస్తవ్యుడు చింత నర్సయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఇప్పలపెల్లి రమేష్ మాట్లాడుతూ అయన వర్ధంతి రోజు పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరుపుకుంటున్న శుభ సందర్భంగా ఈ స్కూలు ఎంతో మందిని ఎన్నో విధాలుగా వారి ఉన్నతికి ఎదగడానికి ఉపయోగపడ్డది అని అన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అట స్థలం చదునుకోసం పూర్వ విద్యార్థులు పూ అందరు కలిసి సహకరించాలని కోరారు. దీనికి పూర్వ విద్యార్థులు సానుకూలంగా స్పందిస్తూ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెచ్ ఎం గడ్డి శ్రీనివాస్, సోషల్ వర్కర్ ఇప్పలపల్లి రమేష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామగోవిందం, లక్ష్మి నర్సయ్య,, చింతా నరసయ్య వారసులు, సంపూర్ణ,సాంబ శివారావు, పోలసాని శ్రీనివాస్ రెడ్డి, బూర లక్ష్మి నారాయణ, కుమారస్వామి, ఖుర్బన్ అలీ, చింత సాంబయ్య పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తులకు పులిహోర పంపిణీ చేసిన లాకావత్ సవేందర్



**మల్హర్ మే 25 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం కేంద్ర కొయ్యూరు చౌరస్తా ఆవరణంలో బస్సులో వెళ్లే ప్రయాణికులకు ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు దుద్దిల్ల శ్రీను బాబు గార్ల ఆదేశాల మేరకు 500 పులిహోర ప్యాకెట్లు మరియు 500 మాస్క్ పంపిణీ చేసిన జిల్లా ఎస్టి సెల్స్ ప్రధా నకార్యదర్శి లాకావత్ సవేందర్, శ్రీ కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తులకు ఈరోజు బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు పులిహోర ప్యాకెట్లను మాస్క్ ను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి మరియు బోయిని రాజయ్య, మాజీ కోవాప్షన్ కలింవోద్దీన్, లాకావత్ తిరుపతి,భూతు అధ్యక్షులు. మహేందర్, పావిరాలలక్ష్మణ్ ,నిరటి విష్ణువర్ధన్, శ్రీనివాసరెడ్డి, పంతకాని శేషి , బాపురెడ్డి, యనగంటి రవీందర్ రావు,యల్.రాహుల్, తిరుమల్,అజయ్, రాజు యల్.రాజు, కొయ్యూరు యూత్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను వదిలేసే అంత హీనుడిని కాదు

- నాపై ఆరోపణలు అవాస్తవం.. డాక్టర్ దశరథ ఖండన



**కోదాడ,మే 25(నినాదం న్యూస్) :** ఉన్నత స్థానంలో ఉన్న తన పరువు ప్రతిష్టలను భంగం కలిగించేందుకు కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నారని కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ దశరథ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పెరిక హాస్టల్ ఆవరణలో ఆత్మకూర్ ఎస్ మండలం దుబ్బ తండ నుండి కనికరం లేని దశరథ కరుణించు అనే శీర్షికతో ఆదివారం ఓ పత్రికలో ప్రచురితమైన వార్తను ఖండిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి తావుర్య సవతి తల్లి బుజ్జమ్మ లను తాను అన్ని రకాలుగా చూసుకుంటున్నానని అన్నారు. తన బావ లకావత్ సైదా ఉన్నత స్థానంలో ఉన్న తనపై ఈర్షద్వేషాలతో తల్లిదండ్రులతో ఈ ఆరోపణలు చేయించాడు అన్నారు. నేను దుబ్బ తండాలో ఎవరి భూములు అమ్ముకోలేదని తన కష్టార్జితంతో సంపాదించిన భూమిని మాత్రమే అమ్ముకున్నానని అన్నారు. కుటుంబ సభ్యుల అభివృద్ధికి ఎంతో తోడ్పడును అందించానన్నారు. అందరూ తల్లిదండ్రుల మాదిరిగానే తన పిల్లలను చదివించడం మూలంగానే డాక్టర్లు అయ్యారని ఎవరికి అన్యాయం చేసి తాను ఉన్నత స్థాయికి ఎదగలేదన్నారు. ప్రస్తుతం తన తండ్రితో ఆరోపణలు చేయించిన తన పిన్ని బుజ్జమ్మ సొంత తల్లి కాదని అయినా నేను ఏనాడు సవతి తల్లి ఉద్దేశంతో చూడలేదని కన్న తల్లిగానే భావించానని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్యంలోనే తల్లిని కోల్పోయిన నేను గిరిజన సంక్షేమ హాస్టల్లో చదువుకొని అనేక కష్టాలు పడి డాక్టర్ కోర్సు పూర్తి చేసి నేడు ఈ ఉన్నత స్థాయికి ఎదిగానని అయినప్పటికీ తల్లిదండ్రులు అంటే గౌరవమే అని ఇప్పటికైనా తన తల్లిదండ్రులు వస్తే వారి సంరక్షణ బాధ్యతగా భావించి చూసుకుంటానన్నారు. సమాజంలో నన్ను ద్రోహిగా చిత్రీకరించే విధంగా ఆరోపణలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా అన్నారు. వాస్తవాలపై దుబ్బ తండాలో సైతం విచారణకు సిద్ధమేనని వెల్లడించారు.

# వైద్యుల నిర్లక్ష్యం.. బాలింత మృతి

- మగ బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిన తల్లి
- తల్లి స్పర్శ కోసం తల్లడిల్లిన పసికందు



**కోదాడ, మే 25(నినాదం న్యూస్):** వైద్యుల నిర్లక్ష్యపు వైద్యం కారణంగా బాలింత మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని తిరుమల హాస్పిటల్ లో శనివారం రాత్రి చోటుచేసుకుంది.. తెలం గాణ ఉద్యమకారులు రాయపూడి వెంకట్ నారాయణ కుమార్తె హిమబిందుకు నల్లగొండ పట్టణానికి చెందిన దినేష్ తో వివాహం చేశారు. హిమబిందు మొదటి కాన్పు కోదాడలోని తిరుమల ఆసుపత్రిలో జరగడంతో రెండవ కాన్పు కోసం కూడా ఆమెను తిరుమల హాస్పిటల్ లో శనివారం అడ్మిట్ చేశారు. వైద్యులు సాధారణ ప్రసవం చేస్తుండగా బాబుకు జన్మ ఇచ్చిన అనంతరం మృతి చెందారు.ఐసీయూలో సాయంత్రం సమయంలో నార్మల్ డెలివరీ చేయడంతో పండంటి మగ బిడ్డకు జన్మని చ్చింది. అనంతరం ఐసీయూలోనే ఉంచడంతో కుటుంబ సభ్యులు చూపించాలని పట్టుబట్టారు.కొద్దిసేపటి తర్వాత చూపిస్తాం వైద్యం నడుస్తుందంటూ వారిని సముదాయిం చారు. కొద్దిసేపటి తర్వాత మృతి చెందినట్లుగా తెలప దంతో బంధువులు ఆగ్రహించి అసలేం జరిగిందని ఆసు పత్రి వైద్యులను, సిబ్బందిని నిలదీశారు. నార్మల్ డెలివరీలో శిశువును జన్మనిచ్చిన తర్వాత ఎలా చనిపో యిం దంటూ ఆసుపత్రి వారిని అడిగినా సమాధానం చెప్ప లేదు. ఆపరేషన్ చేయాలని కోరినప్పటికీ పట్టించుకో కుండా ఉదయం ఐదు గంటలకు అడ్మిట్ అయిన గర్భిణీని సాయంత్రం వరకు నార్మల్ డెలివరీ కోసం ఉం చారని, దీంతో డెలివరీ అప్పుడు తీవ్ర రక్తస్రావమై చనిపో యిందని బంధువుల ఆరోపిస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని ఆందోళనకు దిగారు.

**కొద్దిసేపు హై డ్రామా...!**

సుమారు రాత్రి 10:30 కు సమయంలో మృతురాలికి పల్స్ వచ్చినట్లు వదంతులు రావడంతో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. అప్పటికే చనిపోయి మూడు గంటల దాటిన తిరిగి పల్స్ వచ్చిందని ఆపరేషన్ థియేటర్లో ఉన్నవారు చెప్పారు. దీంతో తిరిగి మరల సిపిఆర్ చేసినప్పటికీ ఫలితం లేదు.వైద్యుల హై డ్రామా మధ్య మళ్ళీ మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. ఇదే ఆసుపత్రిలో పలు మార్లు ఇలాంటి ఘటనలే జరుగు తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**కంటతడి పెట్టించిన పసికందు...**

తల్లి గర్భం నుంచి అప్పుడే బయటికి వచ్చిన ఆ పసికందుకు తెలియదు. తనకు జన్మనిచ్చిన తల్లి ఈ లోకానలేదని... తల్లి స్పర్శ కోసం ఆ పసికందు తల్లడిల్లిపోయాడు. కానీ తన తల్లి ఈ లోకాన్ని విడిచి విగత జీవిలా పడి ఉందని, తన దగ్గరికి రాలేదని... ఎంత ఓదార్చిన తల్లి ప్రేమ కు సాటి రాదు కదా... ఆ బిడ్డకు తల్లి లేని లోటు తీర్చలేము కదా

### బాలింత మృతికి కారకులైన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

– ప్రగతిశీలయువజన సంఘం(పివైఎల్)జిల్లా ప్రధాన కార్యదర్శి ధరవత్ రవి



కోదాడ పట్టణంలోని శ్రీ తిరుమల హాస్పిటల్ లో బాలింత జన్మనిచ్చిన తర్వాత మృతి చెందడం అంటే డాక్టర్ల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థమవుతుందని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరవత్ రవి ప్రశ్నించారు. శ్రీ తిరుమల హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్యం మూలంగానే బాలింత మృతి చెందిందని మృతికి కారణమైన డాక్టర్ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఇలాంటి అవంతరాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు హాస్పిటల్లో తనిఖీలు నిర్వహించి వైద్యుల సర్టిఫికెట్లు పరిశీలించి, నకిలీ డాక్టర్ లపై, అర్హతలేని వైద్యులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

• త్వరలోనే పూర్తిస్థాయి రహదారి నిర్మాణం
• ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్‌చెరు, మే 25 (నినాదం న్యూస్):** ఇంద్రేశం - దౌల్తాబాద్ రహదారి పూర్తిస్థాయి మరమ్మతుల కోసం త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఇంద్రేశం చౌరస్తా వద్ద పూర్తిస్థాయిలో ధ్వంసమైన రహదారిని ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. వర్షాకాలంలో వాహనాలు వెళ్లేందుకు.. ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, ప్రజాప్రతినిధులు ఇటీవల తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని ఆయన తెలిపారు. వెంటనే సొంత నిధులతో ఇంద్రేశం చౌరస్తా వద్ద రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరు పట్టణానికి ఇంద్రేశంతో పాటు. రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, బచ్చు గూడెం, పోచారం తో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్దకంచెర్ల వరకు 22 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన నిధుల కేటాయింపు రద్దు కావడం మూలంగా.. తిరిగి రహదారి మరమ్మత్తులు చేపట్టారని. ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. తాత్కాలిక మరమ్మత్తుల కోసం ప్రభుత్వం 50 లక్షల రూపాయల నిధులు కేటాయించగా.. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేవని తెలిపారు. తక్షణ మరమ్మతుల కోసం సొంత నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే మరో మారు ప్రభుత్వంతో చర్చించి పూర్తిస్థాయిలో రహదారి విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బీరంగూడ కిష్టారెడ్డిపేట రహదారి విస్తరణ చేపట్టిన విధంగా ఇంద్రేశం నుండి పెద్దకంజర్ల వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ లాలు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు నర్సింలు, అంతిరెడ్డి, బండి శంకర్, శివారెడ్డి, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళ వివాహానికి ఆర్థికసాయం అందజేత



**పటాన్‌చెరు, మే 25 (నినాదం న్యూస్):** అన్నా అంటే నేనున్నా అంటూ నిరుపేద మహిళ వివాహానికి అండగా నిలిచారు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలుస్తూ..ఎప్పటికప్పుడు తన దాతృత్వాన్ని చాటుకుంటూ మనసున్న మహారాజుగా ప్రజల గుండెల్లో నిలుస్తున్నారు ఎమ్మెల్యే జీఎంఆర్. రాజాగా.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన వాటర్ వర్క్స్ ఉద్యోగి మాణిక్యం ఇటీవల మృతి చెందారు. ఆయన కుమార్తె వివాహం నిశ్చయం కావడంతో. ఆదివారం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ కు పెళ్లి పత్రికను అందించారు. మాణిక్యంతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి గొప్ప మనసు చాటుకున్నారు. భవిష్యత్తులోనూ వారి కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎంపీటీసీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

## 109 సర్వే నంబర్ రైతులకు న్యాయం చేయండి

• వారికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటాం
• బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**పటాన్‌చెరు, మే 25 (నినాదం న్యూస్):** సర్వే నెంబర్ 109లోనీ భూముల రైతులకు మార్కెట్ వేల్యూ ప్రకారం సరైన మద్దతు ధర అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని సీజీఆర్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, పార్టీ నాయకులు రైతులతో కలిసి మీడియా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ ఐటీ పార్క్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సర్వే నెం.109లోని 157 ఎకరాల భూములను రైతుల నుండి స్వీకరిస్తోంది. కానీ వారికి కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తోంది అని ఆరోపించారు. ఎంజాయ్ మెంట్ సర్వే ప్రకారం రైతులకు పరిహారం అందించాలి. అటువంటి రైతులను ప్రభుత్వం గుర్తించి వారికి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక, మండల అవసరాల నిమిత్తం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల కోసం 50 ఎకరాల స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించాలని సూచించారు. రైతులందరికీ మార్కెట్ వాల్యూ ప్రకారం సరైన మద్దతు ధరను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే మండల అవసరాల కోసం స్థలాన్ని కూడా కేటాయించాలని అన్నారు. వారికి న్యాయం జరిగేంత వరకు పార్టీలకు అతీతంగా రైతుల తో కలిసి పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి, బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, వాసుదేవ రెడ్డి,బండాల భాస్కర్, సూర్యనారాయణ,చంద్రారెడ్డి, ఆంజనేయులు యాదవ్, కుంటి మల్లేష్, పూర్రోళ్ల మల్లేష్, రవీందర్, కుంటి పెంటయ్య, బొల్లవోయిన శేఖర్,ఉషన్న రాజు రైతులు పాల్గొన్నారు.

## బొల్లారంలో ఘనంగా తిరంగాయాత్ర



**పటాన్‌చెరు, మే 25 (నినాదం న్యూస్):** బొల్లారం మున్సిపల్ పరిధిలో ఘనంగా తిరంగాయాత్ర నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్లో భారత త్రివిధ దళాల విజయానికి యావత్ దేశం జేజేలు పలుకుతున్న వేళ, బొల్లారం ప్రజలు కూడా తమ సంఘీభావాన్ని తెలిపారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా మన వీర సైనికులకు సంపూర్ణ మద్దతు, అభినందనలు తెలియజేస్తూ ఈ యాత్రను చేపట్టారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని హనుమాన్ మందిరం నుండి కొత్త బస్టాండ్ వరకు ఈ తిరంగాయాత్ర కొనసాగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలు చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. భారత సైనికుల త్యాగాలను, ధైర్యాన్ని స్మరించుకుంటూ, వారి విజయానికి సంతోషం వ్యక్తం చేశారు. ఈ యాత్ర బొల్లారం ప్రజల దేశభక్తిని, సైనికుల పట్ల వారి గౌరవాన్ని చాటింది.ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్ రెడ్డి, పార్టీలకు అతీతంగా నాయకులు వి. చంద్రారెడ్డి, వి. హనుమంత్ రెడ్డి,కే. రాజిరెడ్డి,కెజెఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి, పి. జైపాల్ రెడ్డి,గుండ్ల మహేందర్ రెడ్డి, టీ. రవీందర్ రెడ్డి, పి. లక్ష్మా రెడ్డి,వి. వరప్రసాద్ రెడ్డి,బి. జైపాల్ రెడ్డి, పి. లక్ష్మణ్ రెడ్డి,పి.సీతారాం రెడ్డి,కె. హరికృష్ణ రెడ్డి,టీ. సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,బి. రాజగోపాల్,శ్రీధర్ రెడ్డి, వి. గోపాలమ్మ,టీ. మేఘన రెడ్డి,డి. స్రవంతి రెడ్డి, వి. వెంకటయ్య, పి.చంద్రయ్య,ఎస్ఐ దశరథ,తాహిర్, ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది, బొల్లారం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణీ



**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ముప్పిడి సంమయ్య కు రూ.60,000/-, బొట్టు లత కు రూ.60,000/-, గౌరబోయిన రాజమ్మ కు రూ.28,500/-ల సిఎంఆర్ఆఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం పలు సమస్యలతో వచ్చిన నియోజకవర్గం ప్రజలను కలిసి ఆహ్వానాలు,వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్ఆఫ్ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా చాలా మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి సామాన్యునిడికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి దామోదర్ రాజానర్సింహా ప్రత్యేక చొరువతో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సదుపాయాలు, సేవలు చాలా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళ సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన మహానేత కేసీఆర్





• ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ కైసర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల వద్ద 2బి.హెచ్.కె డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాణా సంచా కాలుస్తూ, గజమాలలతో ఎమ్మెల్యే కు ఘనస్వాగతం పలుకుతూ పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే కెపి. మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన మనసున్న మహానేత, పేదల పక్షపాతి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని తెలిపారు . సుమారు 50 - 60 లక్షల విలువ గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిరుపేదలకు అందించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు బేధాభిప్రాయాలు వీడి ఒక్కతాటిపై ఉండి సమస్యలు లేని సముదాయంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలను ఆదర్శవంతమైన సముదాయంగా నిలుపాలన్నారు. 2 బి.హెచ్.కే ఇళ్ల సముదాయాలలో నెలకొని ఉన్న సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, రానున్న రోజుల్లో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సమ్మయ్య యాదవ్, చెట్ల వెంకటేష్, దూలప్ప, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, సాయిబాబా, మహేష్, శివ నాయక్, నవీన్, ఆసిఫ్, ప్రసాద్, మహిళా నాయకురాలు మామి, 2బి.హెచ్.కె డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సాదుల వేణు, సలహాదారులు ఎస్.కె.సాజిద్, ఉపాధ్యక్షులు ఎం.డి. అతిక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వలీ, కోశాధికారి బింగి యాదగిరి, ఖాసీం, పి.వి.రావు, మనోహర్, శంకర్ గౌడ్, ఎండి. షాబాద్, హర్ష, కృష్ణ, హిరణ్య కుమార్, ప్రసాద్, నర్సింగ్ రావు, రజాక్, బాబు రెడ్డి, ఎండి. అంజాద్ ఖాన్, వంశీ, సత్యా రావు, ప్రమీల, లక్ష్మీ, శ్రీనివాస్, బ్రహ్మ నాయుడు, లోకేష్, కృష్ణ రాజ్, అంజి పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డలోని ఎఫ్.సి.ఎస్ కన్వెన్షన్ నందు నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, జీడిమెట్ల శాఖ 5వ సర్వసభ్య సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చెరువులకు జీవం పోస్తూ మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థికాభివృద్ధిని అందించి, మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషిచేసిన గొప్ప నాయకుడు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అని పేర్కొన్నారు. జీడిమెట్ల డివిజన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఫిషరీస్ కో- అపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డిస్టిక్ ఫిషరీస్ ఆఫీసర్ సుకీర్తి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జీడిమెట్ల శాఖ అధ్యక్షులు చిలుకూరి కృష్ణ, ఉపాధ్యక్షురాలు చిలుకూరి యాదమ్మ, ప్రధాన కార్యదర్శి మద్దూరి వీరేష్, డైరెక్టర్లు తాళ్ల వెంకటేష్, మన్నె శంకర్, అరికల లక్ష్మణ్, మద్దూరి సత్తెమ్మ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలి

• కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం కన్వీనర్ గడ్డం శ్రీనివాస్



**జవహర్‌నగర్ మే 25 (నినాదం న్యూస్):** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరు అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలని ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం రాష్ట్ర కన్వీనర్ గడ్డం శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 42వ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం రాష్ట్ర కన్వీనర్ గడ్డం శ్రీనివాస్ హాజరై మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలోని ప్రతి పౌరులకు విద్యా వైద్య ఉద్యోగ రంగాల్లో ముఖ్యంగా ప్రైవేట్ రంగాల్లో దళితులతో పాటు ఇతర వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని వీటి కొరకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భారతదేశానికే కాక ప్రపంచానికి ఒక దిక్సూచి లాంటిదని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కొందరు వాడు కాదని అంబేద్కర్ అందరివాడే అని తెలిపారు. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేదరికం లేని భారత సమాజాన్ని సృష్టించాలని తద్వారా అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని ఇదే మనము అంబేద్కర్ కు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ మాదిగ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు బైరపాక జేసు దాస్ చక్రవర్తి, మాల కుల సంక్షేమ అధ్యక్షులు దామాల ప్రభాకర్, బీఎస్పీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఇలాకాంత్, బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామగిరి విజయశంకర్, నాగరాజు ,సారంగపాణి, భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు మహంకాళి భిక్షు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రామ అధికారుల పరీక్ష

• కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి, మే25,(నినాదం న్యూస్):** మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కూకట్ పల్లి లో నిర్వహించిన గ్రామ పాలన అధికారి పరీక్షను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి డిఆర్ఓ హరిప్రియ తో కలిసి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఆదివారం కూకట్ పల్లి లోని మహిళా డిగ్రీ కాలేజీలో జరుగుతున్న గ్రామ పాలన అధికారి పరీక్షను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలు జరుగుతున్నదని పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి

• ఫాగింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్



**నాచారం, మే 25 ( నినాదం న్యూస్) :** నాచారం డివిజన్ లో జరుగుతున్న ఫాగింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్. నాచారం డివిజన్ లో ప్రతిరోజు దోమల నివారణ కొరకై ఫాకింగ్ చేస్తూ ఉన్నాము. హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులో ఉన్న గుర్రపు డెక్క పూర్తిగా తొలగించడంతో హెచ్ఎంటి చుట్టుపక్కల ప్రాంతాలలో దోమల సమస్య కొద్దిగా తక్కువ ఉన్నది. పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరగడంతో బాబా నగర్, ఎర్రగుంట, రామ్ రెడ్డి నగర్, నాచారం విలేజ్, అంబేద్కర్ నగర్ చుట్టుపక్కల ప్రాంతాల వారు విపరీతమైన దోమల సమస్యతో ఇబ్బంది పడుతున్నారని చెరువు చుట్టూ విధిగా ఫాగింగ్ చేయాలని ఎంటమాలజీ సూపర్వైజర్ పరమేష్ కు సూచించడమైనది.

## ప్రణాళిక బద్ధంగా కాలనీల అభివృద్ధి

• ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ "వీనస్ రాక్స్ హైట్స్" నందు సుమారు 36.80 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్నీ ప్రాంతాలలో మౌలిక వసతులను కల్పించామన్నారు. రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలను ప్రణాళిక బద్ధంగా, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, చెట్ల వెంకటేష్, తెలంగాణ సాయి, చిన్నా చౌదరి, సమ్మయ్య యాదవ్, బాబీ చౌదరి, దూలప్ప, శివా నాయక్, జునైద్, ఆసిఫ్, ప్రసాద్, వీనస్ రాక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీసీ. వేమా రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, సలహాదారులు శివరాం ప్రసాద్, శంకర్ రెడ్డి, మధు, సంయుక్త కార్యదర్శి బాల నాగ దుర్గా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

• ఎమెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్ పల్లిలోని 15వ వార్డు ప్రణీత్ ఫ్లోరా కాలనీ సభ్యుల ఆహ్వాన మేరకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు పర్యటించారు. ఇటీవల వారి కాలనీలో మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేయించిన సందర్భంగా కాలనీ వాసుల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ హరీష్, సభ్యులు పెద్దినేని, నాగరాజు, ఫ్లోరా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**నాచారం, మే 25 (నినాదం న్యూస్) :** సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్టుగా తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి రాణి 55 వేలు, రాములు 47 వేలు, కోకొండ స్వప్న 55 వేలు, సాయి రెడ్డి మౌనిక రెడ్డి 60 వేలు, తయార బేగం 37 వేలు, జెర్రీపోతుల బాలరాజు ? 60 వేలు, రావుల అశోక్ కుమార్ 47 వేలు చొప్పున మంజూరైన చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్, ఈగ ఆంజనేయులుముదిరాజ్ ,ఉప్పల్ ,మల్లాపూర్,చిలకనగర్ డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, కాప్రా సాయి గౌడ్, రాజేష్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుల తుమ్మల దేవి రెడ్డి, ఆకిటి ఆగం రెడ్డి, విట్టల్ నాయక్, శ్రీకాంత్ రెడ్డి, కుసంగుల సతీష్ ముదిరాజ్, అల్వాల్ భాస్కర్, అలుగురా అనిల్, జనగాం రామకృష్ణ, విజయ్, సతీష్ సత్యనారాయణ, పూజారి హనుమంతు, అమర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఔదార్యం చాటుకున్న సామిల్ వ్యాపారి ప్రభాకర్

### -మునిసిపల్ సిబ్బందికి విందు భోజనం.. కొత్త బట్టల పంపిణీ



**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని ప్రతాపవా డకు చెందిన నవజీవన్ సామిల్ వ్యాపారి రావుల ప్రభాకర్ మున్సిపల్ సిబ్బంది సుమారు 150 మందికి పైగా విందు భోజనం పెట్టడంతో పాటు కొత్త బట్టలను అందజేసి తన ఔధార్యాన్ని చాటుకున్నాడు. వివరాలలోకి వెళితే ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సామిల్ వ్యాపారి రావుల ప్రభాకర్ - శ్రీమతి దంపతుల కుమారుడు రావుల నాగేంద్ర- తారల వివాహ రిసెప్షన్ ఆదివారం స్థానిక వెంకటసాయి గార్డెన్ లో రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ప్రభాకర్ శ్రీమతి దంపతులు కుమారుని వివాహాన్ని పురస్కరించుకొని హుజురాబాద్ మునిసిపల్ కార్మికులు 150 మందికి పైగా కుటుంబాలతో సహా ఆహ్వానించి పెళ్లి విందు భోజనం పెట్టడంతో పాటు మహిళలకు చీరలు, జాకెట్ పీసులు అందజేయగా పురుషులకు ప్యాంటు, షర్టు పీస్ లను అందజేశారు. వివాహానికి హాజరైన బంధుమిత్రులతో పాటు హుజురాబాద్ పట్టణానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అందరూ అతిథుల చేతుల మీదుగా మున్సిపల్ సిబ్బందికి బట్టలను అందజేశారు. పెళ్లి విందుకు ఆహ్వానించడమే ఎంతో భారంగా భావించే నేటి తరుణంలో ప్రభాకర్ తన కుమారుని వివాహాన్ని పురస్కరించుకొని కుమ్మరివాడ, ప్రతాపవాడ, ఫకీర్వాడ, శివాజీ నగర్, హనుమాన్ టెంపుల్ ఏరియా, వరంగల్ రోడ్ ఏరియా, విద్యానగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వెయ్యిల మందికి పైగా ప్రజలను ఆహ్వానించి (పెళ్లి)విందు భోజనం ఏర్పాటు చేశారు. ప్రభాకర్ శ్రీమతి దంపతులు మున్సిపల్ సిబ్బందికి సుమారు 75 వేలకు పైగా విలువ చేసే బట్టలను పంపిణీ చేసి తమ ఔదార్యంను చాటుకున్నందుకు మున్సిపల్ సిబ్బంది కృతజ్ఞతలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.

## అందుబాటులో లేని జీలుగా విత్తనాలు

- అధికారులు స్పందించి రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము



**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఖరీఫ్ సీసన్ లో రైతులకు పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీ పై వెంటనే అందజేయాలనీ తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రైతులు అత్యధికంగా వరి సాగు చేస్తున్నారని అన్నారు. పచ్చి రొట్టె ఎరువుగా వాడే జీలుగ, పెసరు, విత్తనాలు సబ్సిడీపై కొనుగోలు చేసి ప్రతి యేటా మే నెల రైతులకు సరైన సమయం అన్నారు. ఈ సంవత్సరం రుతుపవనాలు ముందుగా వస్తున్నాయని వాతావరణ శాఖ పలుమార్లు సూచించినప్పటికీ. జూన్ నెల వస్తున్నా ఇప్పటివరకు పచ్చి రొట్టె విత్తనాలను రైతులకు సరఫరా చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి కరీంనగర్ జిల్లాలో పచ్చి రొట్టె ఎరువుగా వాడే జీలుగ విత్తనాలను సత్వరమే సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని రైతులకు సరైన సమయంలో విత్తనాలను అందించలేని అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### యువకుడికి జాతీయస్థాయి

## గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు ప్రదానం



**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్):** హుజురాబాద్ పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ఆడెపు సూర్యం సంధ్యారాణి దంపతుల కుమారుడు ఆడెపు ధీరజ్ జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు ముంబైలో అందుకున్నారు. భారతదేశవ్యాప్తంగా టాప్ 100 గ్రేట్ పీపుల్ మేనేజర్స్ ఆఫ్ ఇండియా సెలెక్ట్ చేయగా అందులో నుండి హుజురాబాద్ కు చెందిన ఆడెపు ధీరజ్ ఎంపిక కాగా రెండు రోజుల క్రితం ముంబాయిలో నిర్వహించిన జిఎంఐ సమ్మిట్ లో గ్రేట్ మేనేజర్ ఇన్స్టిట్యూట్ ఇన్ గ్రేట్ మేనేజర్స్ లీగ్ సమ్మేటివ్ 2025 ఇన్ టాటా థియేటర్ ఎన్సిపిఏ లో ఆయనకు అవార్డును, సర్టిఫికెట్ ను అందజేశారు. దేశంలోనే వందమంది వ్యాపారవేత్తలలో హుజురాబాద్ కు చెందిన ధీరజ్ ఎంపిక కావడం జిల్లాకే కాదు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు మిత్రులు, శ్రేయోభిలాషులు, వ్యాపారులు అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

### -ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**.మల్యాల, మే 25 (నినాదం న్యూస్):** ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశలను కొనసాగిద్దామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు .ఆదివారం మండలంలోని సర్వపూర్ పరిధి లోగల కొత్త పెల్లి లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజల హక్కులను రక్షించే గొప్ప ఆయుధమన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే ప్రగతి పథంలోకి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగ ఆనంద్ రెడ్డి ,దారం ఆది రెడ్డి ,మల్యాల సీఐ నీలం రవి మేక లక్ష్మణ్ ముత్యం శంకర్ ,శనిగరపు తిరుపతి, జంగిలి హనుమంతు, సదాశివరెడ్డి, నలవాల సంజీవ్, మిలిటరీ శీను, బండి రవి గౌడ్, సంత ప్రకాష్ రెడ్డి, రమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

- బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి..చికిత్సకు 40 లక్షలు
- దాతల చేయూత కోసం తండ్రి ఆరాటం



**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్):** రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.. మెకానిక్ గా పని చేస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్న ఆ ఇంటిలో ఓ చిన్నారి క్యాన్సర్ బారిన పడడంతో దిక్కుతోచని స్థితిలో దాతల చేయూత కోసం ఎదురు చూస్తున్నాడు. జమ్మికుంట మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన బండారి శ్యాంసుందర్ స్రవంతి దంపతులకు ఇద్దరు పిల్లలు కొడుకు,కూతురు. బండారి శ్రీహాన్ ఎనిమిది సంవత్సరాల బాలుడు గత కొద్ది రోజుల క్రితం తీవ్రంగా అస్వస్థతకు గురికాగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించగా ప్లేట్లెట్స్ తక్కువ కావడంతో హైదరాబాద్ రెయిన్బో ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయిస్తున్న తరుణంలో బాలుడికి బ్లడ్ క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. చికిత్స కోసం 40 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలుపగా ఇప్పటికే ఆ తండ్రి దాదాపు 7 లక్షల రూపాయలను వైద్యానికి ఖర్చు చేశాడు. చిన్నారికి వైద్యం చేయించే డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నాడు. బాలుడు చికిత్స కోసం మానవత్వం ఉన్న దాతలు సహకరించి చేయూతని అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడి పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వం ఆర్థికంగా చేయితనాన్నించాలని పలువురు స్థానికులు కోరారు.

# బిఆర్ఎస్ ప్రజాస్వామ్య పార్టీ.. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను తెలుపవచ్చు


- కెసిఆర్ మా నాయకుడు వారి బాటలో ప్రతి ఒక్క కార్యకర్త నడుచుకుంటారు
- మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**.కరీంనగర్, మే 25(నినాదం న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 20 డివిజన్లో గల ఆరేపల్లిలో ఆదివారం రోజున స్మశాన వాటికలో అభివృద్ధి పనులు మరియు కల్వర్టు నిర్మాణానికి నగర బి ఆర్ ఎస్ అధ్యక్షులు చల్ల హరి శంకర్ స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ తుల రాజేశ్వరి బాలయ్యలతో కలిసి ఎమ్మెల్యే గంగుల భూమి పూజ చేశారు.పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే గంగులకు డివిజన్ వాసులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలను అందించి శాలువాతో సత్కరించారు. ప్రారంభోత్సవం అనం తరం ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ.. డివిజన్ గతంలో గ్రామ పంచాయతీగా ఉండేదని, డివిజన్ వాసులకు స్మశాన వాటిక లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని..స్మశాన వాటిక నిర్మాణానికి 15వ ఫైనాన్స్ నిధుల నుండి సుమారు 49. 50 లక్షల రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఆరేపల్లి నుండి రాణిపూర్ నగునూరు దుర్గామాత ఆలయానికి వెళ్లే దారిలో సాధారణ నిధుల ధ్వార సుమారు 12 లక్షల రూపాయలను వెచ్చించి కల్వర్టును నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నారైల ఆధ్వర్యంలో జూన్ రెండవ తేదీన అమెరి కాలో డలాస్ లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నారని.. ఆ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు తాను, కరీంనగర్ జిల్లాకు చెందిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ లు హాజరవుతున్నట్టు తెలిపారు.టిఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఇటీవల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నామని గుర్తు చేశారు. ప్రతియ డాన్స్ రెండవ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఈఏడు మాత్రం ప్రత్యేకంగా అమెరికాలో ఎన్నారైల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు దాదాపు ఎమ్మెల్యేలందరం హాజరవుతు న్నట్టు తెలిపారు.ఈ నెల 31న న్యూయార్క్ లో బిఆర్ఎస్ ప్రిలిమినరీ సమావేశం ఉంటుందని తెలిపారు. సుమారు 12 రోజులపాటు ఈ పర్యటన ఉంటుందన్నారు.ఎమ్మెల్సీ కవిత కెసిఆర్ కు రాసిన లేక పై ఎమ్మెల్యే గంగుల మాట్లాడారు.బిఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య బద్ధంగా ఉన్న పార్టీ అని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను వారు తెలియజేయ వచ్చునని కానీ బహిరంగ లేక రాయడం కాకుండా కెసిఆర్ కు వ్యక్తిగతంగా విషయాలను చెప్పి ఉంటే బాగుండు అని కేటీఆర్ చేసిన వాఖ్యలను తాను కూడ ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. కెసిఆర్ మాకు నాయకుడని వారి బాటలో ప్రతి ఒక్క కార్యకర్త నడుచుకుంటారు అన్నారు. కెసిఆర్ ఆదేశాలను పాటిస్తామన్నారు. కవిత పార్టీ పెట్టడంఅనేది ఊహాగానాలే అని కొట్టిపడేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట నగర బి ఆర్ ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు తుల బాలయ్య, జంగిలి సాగర్, జంగిలి ఐలేందర్ యాదవ్, దిండిగాల మహేష్, నాయకులు పిల్లి మహేష్ గౌడ్,మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజి సూడా డైరెక్టర్ నేతి రవివర్మా ఆరెపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత పాండును సన్మానించిన నాయకులు

- అణగారిన వర్గాలకు పాండు చేసిన సేవలు అభినందనీయం
- బీసీ నేత జక్కె వీరస్వామి గౌడ్



**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్):** జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామంలో దళితరత్న అవార్డు గ్రహిత బత్తుల పాండును బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట అధ్యక్షులు కొల్లూరి శంకర్ సర్వాయిపాపన్న మోకుదెబ్బ రాష్ట వ్యవస్థాపక అధ్యక్షులు జక్కె వీరస్వామిగౌడ్ శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భముగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొల్లూరి శంకర్ మాట్లాడుతు అణగారిన వర్గాల గొంతుక బత్తుల పాండు అని కొనియాడారు.అనంతరం జక్కె వీరస్వామిగౌడ్ మాట్లాడుతు నా మిత్రుడు నాలో చైతన్యం నింపి నాకు సామాజిక ఉద్యమ ఓనమాలు నేర్పి నిఖార్సయిన ఉద్యమ కారునిగా తీర్చిదిద్ది నాకు ఉద్యమ నేపధ్యాన్ని అందించిన గురు సామానులు బత్తుల పాండు కు దళిత రత్న అవార్డు రావటం గర్వ కారణం అని వీరస్వామిగౌడ్ అన్నారు.ఈ రోజు గౌడ జాతిని బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోయి సేవ చేసే అవకాశం కల్పించి ఈ ప్రాంత బహుజన ఉద్యమానికి కారకుడు బత్తుల పాండు అని వీరస్వామిగౌడ్ అన్నారు.తన ఆశయ సాధన సర్వాయిపాపన్న అంబేత్కర్ కాన్సిరాం కొరకు పాటు పడుతు ముందుకు పోతన్నానని వీరస్వామిగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వాయిపాపన్న మోకుదెబ్బ రాష్ట ఉపాధ్యక్షులు గండి రంజిత్ కుమార్ గౌడ్ జమ్మికుంట మండల కార్యదర్శి జక్కె రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్నేహితులంతా ఒకచోట కలిసి వారి పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకోవడం తోపాటు ప్రస్తుతం వారు చేస్తున్న వివిధ రకాల వృత్తుల తో పాటు అనేకమైన విషయాలను ఒకరికొకరు ఆప్యాయంగా పంచుకొని ఆనందంగా గడిపారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకోవడం సంతోషంగా ఉందని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కష్టసుఖాలను పంచుకున్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకం వల్లనే తాము ఈ స్థాయిలో ఉన్నామని పలువురు విద్యార్థులు తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటాం


- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్



**.కరీంనగర్, మే 25(నినాదం న్యూస్):** కరీంనగర్ జిల్లాలో ఊటూరు, చల్లూరు, పోతిరెడ్డిపల్లి. కొండపాక ఇతర గ్రామాల్లో ఇసుక తవ్వకాలు.క్వారీలు ఏర్పాటును రద్దు చేయాలి. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాను వెంటనే ఆపేయాలి.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. అక్రమంగా ఇసుక తవ్వకాలు. క్వారీలను రద్దు చేయాలి. అక్రమ ఇసుకను తరిల్లిస్తున్న వారిని ప్రభుత్వం జైలులో వేయాలని .రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియారాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్.డిమాండ్ చేశారు.సహజ సంపదను ఇష్టా నుసారంగా దోచుకెళ్తున్న కోట్లు అక్రమ ఇసుక రవాణా మాఫియాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలిని, అనుమతులు లేకుండా తవ్వకాలు చేసి ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని పర్మిషన్ ఉన్న వరకు కాకుండా అనుమతులకు మించి ఇసుకను తరిల్లిస్తున్నారని ఇసుక లారీల వలన గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,రాత్రి. పగలు తేడా లేకుండా నిరంతరం ఇసుక మాఫియా ఇసుక తవ్వకాలు చేసి లారీలతో తార్లీస్తు. ఇష్టారాజ్యంగా ఇసుక లారీలు రోడ్లు ఇరువైపులా అపుతూ అగి ఉన్న ఇసుక లారీలతో గ్రామ ప్రజలు భయాందోళనతో ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని జీవిస్తున్న ప్రజలు బయటకు రాకుండా ప్రాణాలతో వణుకుతున్నా రు. ఇసుక రవాణా చేస్తున్న లారీలు కావాలని లారీలా హారన్లతో గ్రామ ప్రజలకు ఇబ్బందులు తెస్తున్నారు.ఇసుక అక్రమ రవాణా వల్ల గ్రామ ప్రజలు ఇంత ఇబ్బందులు పడుతుం టే. సంబంధిత అధికారులు అవినీతి మత్తులో ఉన్నారని ఇసుక రవాణా మాఫియాకు వత్తాసు పలుకుతూచూసి, చూడనట్లు వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. కోట్లు రూపాలతో గ్రామాల్లో ప్రభుత్వం రోడ్లు నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చింది ఇసుక అక్రమ రవాణా మాఫియా మాత్రం ఇసుక లారీలతో రోడ్లును ఇసుక లారీలతో ప్రజలను. రోడ్లను ధ్వంసం చేస్తున్నారని కుతాడి శివరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణా లారిల వల్ల గ్రామ ప్రజలు భయంతో బంతుకుతున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను రద్దు చేసి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు పెట్టి జైలుకు పంపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇటు ప్రజాధనాన్ని, ప్రభుత్వం ప్రజల కోసం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన రోడ్లను ధ్వంసం చేస్తున్న వారిని. లారీలతో ఇసుకను తరిల్లిస్తున్న ఇసుక రవాణా మాఫీయా చేస్తున్న వారిని వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసు పెట్టి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ద్వారా ప్రజలతో. పార్టీ కార్యకర్తలతో ర్యాలీతో ఇసుక అక్రమ రవాణాను.ఇసుక క్వారిలను ప్రజలతో ఆపుతామని హెచ్చరించారు.

### అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి

# వెంకట్ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డు



**.కరీంనగర్, మే 25(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు తనకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.వి. నరేందర్ రెడ్డి కి నేడు స్థానిక కరీంనగర్ శివారులోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో వివి లక్ష్మీనారాయణ రిటైర్డ్ ఐపిఎస్ పూర్వ జాయింట్ డైరెక్టర్ సిబిఐ, గంప వెంకట్ ఫౌండర్ చైర్మన్ వెంకట్ ఫౌండేషన్, ఇతర అతిధుల చేతుల మీదుగా వెంకట్ ఫౌండేషన్ వై రఘునాథం ఎక్సెంట్ అవార్డు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తున్నందుకుగాను, ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ విద్యను అందిస్తూ, తెలంగాణ రాష్ట్ర విద్యారంగాలలో సమూలమైన మార్పులు తెస్తున్నందుకుగాను నేడు వై.రఘునాథం ఎక్సెంట్ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత 35 సంవత్సరాలుగా విద్యారంగానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని, ఎంతోమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా వారిని ప్రతిష్టాత్మక స్థానాలలో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నా మని చెప్పారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ అవార్డు బాధ్యత మరింత రెట్టింపు చేసిందని ఈ అవార్డు రావడానికి కృషి చేస్తున్న సిబ్బందికి, ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు అంకితమిస్తున్నానని తెలుపుతూ సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

### మద్యం సేవించి వాహనాలు

## నడిపితే కఠిన చర్యలు తప్పవు

### -జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్




**.జమ్మికుంట, మే 25 (నినాదం న్యూస్) :** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. జమ్మికుంట పట్టణ పరిధిలో గత వారం రోజుల నుండి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 25 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని ఆయన తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారందరినీ శనివారం హుజురాబాద్ కోర్టులో హాజరుపరచగా వారికి 31,000 వేలు జరిమానా విధించారని వారు పేర్కొన్నారు. ఇకపై తరచుగా మద్యం సేవించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే లైసెన్స్ రద్దుచేసి జైలుకు పంపిస్తామని మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని దీని ద్వారా మీ కుటుంబ సభ్యులతో పాటు ఎదుటి వారి కుటుంబ సభ్యులు కూడా రోడ్డున పడతారని సిఐ తెలిపారు. సురక్షితమైన ప్రయాణంతో అందరికీ లాభంగా ఉంటుందని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తల్లిదండ్రులు మీ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## కాలనీల అభివృద్ధికి అన్ని విధాల కృషి



**.అల్వాల్, మే 25 (నినాదం న్యూస్):** డైనమిక్ గౌరవ శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశానుసారం కేశవ్ నగర్ వాసుల పిలుపు మేరకు వాళ్ళు ఎదురుకుంటున్న సమస్యల పై పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకోవడం మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ నీరుకొండ జగదీష్ గౌడ్ అన్నారు..గత పదిహేను రోజుల కిందట పవర్ బోర్ రిపేర్ కొరకు నాకు ఫోన్ చేయడం తో వాటర్ వర్క్స్ డిపార్టుమెంటు తో చర్చించి రిపేర్ చేయించానన్నారు కాలనీ వాసుల కోరిక మేరకు అక్కడ ఉన్న ప్రభుత్వ భూమి లో మహిళా సంఘాల ప్రతి నెల జరగబోయే సమైక్య మీటింగ్ కొరకు ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అడిగారని అన్నారు. కాలనీ లో ఫాగింగ్,స్ట్రీట్ లైట్స్,డ్రైనేజీ లాంటి సమస్యలు తెలిపారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు.ఈ సమస్యల పై ఎం ఎల్ ఏ గారితో చర్చించి అతి త్వరలో ఈ సమస్య లు అన్ని పూర్తి చేస్తానని కాలనీ వాళ్ళతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ గౌడ్,ప్రవీణ్ గౌడ్,జనార్ధన్,బాలకృష్ణ,ప్రదీప్ గౌడ్,అమర్,యశోద,లత,విజయ లక్ష్మి, జయమ్మ పద్మమ్మ,ఈశ్వరమ్మ,సుగుణ తదితరులు పాలుగొన్నారు.

## వైరా టిడిపి టౌన్ అధ్యక్షుడిగా బొల్లెపల్లి శ్రీనివాసరావు



**.వైరా మే 25 (నినాదం న్యూస్) :** ఆదివారం వైరా తెలుగుదేశం పార్టీ ఆఫీసులో వైరా టౌన్ అధ్యక్షుడిని ఎన్నుకొనుటకు సమావేశము నిర్వహించటం జరిగినది. వైరా నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రామనాథం హాజరై వారి సమక్షంలో వైరా టౌన్ అధ్యక్షుడిగా బొల్లెపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా పమ్మి అర్జున్ రావు, ప్రధాన కార్యదర్శి గుడ్ల నాగేశ్వరరావుకార్యనిర్వాహక కార్యదర్శులు, చావా రవి, తూనాటి సత్యం,గుడ్ల శేషు, కందిమల్ల శ్రీనివాసరావు ,హరి, రమేష్, దావులూరి దినేష్, పాసుంగులపాటి శ్యాంసుందర్ వీళ్లను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ చెరుకూరి చలపతి రావు హాజరు కావడం జరిగింది మండల నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, మందవడపు మసూధన రావు, అమరనేని వేణు, సూర్యదేవర వెంకటకృష్ణ, మద్దినేని రామారావు, చావా కాంతారావు,చావా రవి, కొమ్మిడిచెట్టి శ్రీధర్, నారాయణ కోటదాసు, వడ్డెబోయిన అయ్యప్ప పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు హాజరయ్యారు.

# అవని

## మీకు కొన్ని ఆహారాలు అలెర్జీని తెప్పిస్తున్నాయా?

### పరీక్షలు లేకుండా ఇంట్లోనే అంచనా వేయడానికి ఉత్తమ మార్గాలివే?

**ఆహార అలెర్జీ లక్షణాలను గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ప్రతిచర్యలు తేలికపాటి నుండి తీవ్రమైనవి, ప్రాణాంతకం కూడా కావచ్చు. శారీరక ప్రతిచర్యలను గమనించడం, ఆహార డైరీల ద్వారా ట్రిగ్గర్‌లను గుర్తించడం, ఎలిమినేషన్ డైట్‌లను ప్రయత్నించడం వల్ల ఇంట్లో సంభావ్య అలెర్జీ కారకాలను గుర్తించడంలో సహాయపడుతుంది. అయితే ఖచ్చితమైన రోగ నిర్ధారణ, నిర్వహణ కోసం, ప్రత్యేకించి లక్షణాలు నిరంతరంగా లేదా తీవ్రంగా ఉంటే, వృత్తిపరమైన వైద్య సలహా తీసుకోవడం చాలా అవసరం. ఒక నిర్దిష్ట ఆహారాన్ని తీసుకున్న వెంటనే సంభవించే రోగనిరోధక ప్రతిస్పందనను ఆహార అలెర్జీ అంటారు. అలెర్జీకి కారణమయ్యే ఆహారంలో కొద్ది మొత్తంలో దద్దుర్లు, విస్తరించిన వాయుమార్గాలు, కడుపు సమస్యలు వంటి లక్షణాలను కలిగిస్తుంది. కొంతమంది వ్యక్తులలో ఆహార అలెర్జీలు తీవ్రమైన లక్షణాలకు లేదా అనాఫిలాక్సిస్‌కు దారితీయవచ్చు. ఇది ప్రాణాంతక ప్రతిచర్య. మీకు ఆహార అలెర్జీ ఉందో లేదో తెలుసుకోవడానికి కొన్ని ప్రత్యేక పరీక్షలు అవసరం కావచ్చు. వాటి లక్షణాలను గుర్తించడం సహాయపడవచ్చు. పరీక్షలు లేకుండా ఇంట్లోనే దానిని దాదాపుగా అంచనా వేయడానికి ఇక్కడ ఉత్తమ మార్గాలు ఇప్పుడు చూద్దాం..**

**ప్రతిచర్యలను గమనించండి**
శరీరంలోని ప్రతిచర్యలను గమనించడం అనేది ఒక వ్యక్తికి ఏదైనా అలెర్జీ ఉందో లేదో గుర్తించడానికి ఒక మార్గం కావచ్చు. వారు దురద, వాపు, ఎరుపు, జీర్ణ సమస్యలు వంటి లక్షణాలను పర్యవేక్షించగలరు. అదనంగా, లక్షణాలు ఎప్పుడు సంభవిస్తాయి. అవి ఎంత తరచుగా వస్తాయి.. తీవ్రతను సమయం గమనించాలి.

**ట్రాక్ చేయండి...**
మీరు ఏమి తీసుకుంటున్నారో ఆహార డైరీలో నమోదు చేయడం వల్ల అలెర్జీకి కారణమయ్యే ఆహారాన్ని గుర్తించడంలో సహాయపడుతుంది. ఇది నమూనాను గుర్తించడంలో కూడా సహాయపడవచ్చు. ఆలస్యమైన ప్రతిచర్యల కోసం ఒక కన్ను వేసి ఉంచండి. ప్రతి ఆహార అలెర్జీ వెంటనే ప్రతికూల ప్రతిచర్యకు దారితీయదు. అలసట, ఉబ్బరం, దురద లేదా మెదడును మసకబారడం వంటి కొన్ని లక్షణాలు గంటల తర్వాత కనిపించవచ్చు. తిన్న తర్వాత, మీ భావాలను నమోదు చేసుకోండి. ప్రత్యేకించి మీరు ఒక నిర్దిష్ట వంటకాలతో ఒక నమూనాను గమనించినట్లయితే.

**ఎలిమినేషన్ డైట్ ప్రయత్నించండి**
ఎలిమినేషన్ డైట్‌ను అమలు చేయడాన్ని పరిగణించండి. ఇది అత్యంత ప్రజాదరణ పొందిన డూ-ఇట్-మీరే టెక్నిక్‌లలో ఒకటి. రెండు నుండి మూడు వారాల పాటు, మీ ఆహారం నుండి ఒక సందేహాస్పద పదార్థాన్ని (పాలు, గోధుమలు లేదా గుడ్లు



వంటివి) పూర్తిగా తొలగించి, మీ లక్షణాలు మెరుగుపడుతున్నాయో లేదో గమనించండి. తరువాత, దానిని తిరిగి ప్రవేశపెట్టి, లక్షణాలు పునరావృతమవుతాయో లేదో గమనించండి. లక్షణాలను తనిఖీ చేయండి. తుమ్ములు, దగ్గు, దురద వంటి ఇతర లక్షణాల కోసం తనిఖీ చేయండి. ఆహార అలెర్జీకి మొదటి సంకేతంగా ప్రజలు గమనించే కొన్ని సాధారణ లక్షణాలు ఇవి. నోటి ప్రాంతంలో వాపు లేదా బుగ్గల లోపలి భాగంలో జలదరింపును విస్మరించకూడదు. అలెర్జీలను సకాలంలో గుర్తించడానికి వైద్య నిపుణుల సహాయం తీసుకోవడం ఉత్తమ మార్గం. లక్షణాలు తిరిగి వస్తూ తీవ్రంగా ఉంటే, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించడానికి ఒక వ్యక్తి నిపుణుల సహాయం తీసుకోవాలి.

# పుష్కరాల్లో జనం పుష్కలం...

- రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల తాకిడి
- నేటితో ముగియనున్న సరస్వతీ పుష్కరాలు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం
- ప్రధాన రహదారుల్లో తగ్గని ట్రాఫిక్ సమస్య





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ మహాదేవపూర్ (నినాదం):** గత పది రోజులుగా కాళేశ్వర క్షేత్రంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు పుష్కలమైన జనం తరలి వస్తున్నారు. 11వ రోజు ఆదివారం సైతం అదే జోరు అదే హోరుతో పుష్కరాలు కొనసాగాయి. తెలంగాణ రాష్ట్రంలోనే త్రిలింగ క్షేత్రంగా పేరుగాంచిన కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో ఈ నెల 15న సరస్వతీ పుష్కరాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. అయితే రాష్ట్రంలోనే సరస్వతీ పుష్కరాలు కాళేశ్వరంలోనే జరుగుతుండటంతో అందరి దృష్టి కాళేశ్వరంపైనే పడింది. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటు న్నారు. తెల్లవారుజాము నుండే భక్తుల రద్దీ పెరిగి, పెద్ద ఎత్తున భక్తులు కాళేశ్వరం చేరుకుంటూ పుష్కర స్నానాలను ఆచరిస్తున్నారు. త్రివేణి సంగమం నదీతీరంలో పవిత్ర పుణ్య స్నానాలు చేసి, భక్తులు స్వామి వారి దర్శనానికి దేవాలయానికి చేరుకుంటున్నారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయానికి చేరుకుని దైవదర్శనం చేసుకున్నారు.

**ఏర్పాట్ల పర్యవేక్షణలో అధికారులు...**
సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులకు ఏర్పాట్లను, దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాట్లుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఘాట్ వద్ద బట్టలు మార్చుకునే గదులు, మంచినీరు, ప్రాథమిక చికిత్సా కేంద్రాలు, పోలీసు సహాయం, అపరిశుభ్రత నివారణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయబడ్డాయి. తాత్కాలిక బస్ స్టాండ్ నుండి సరస్వతి ఘాట్ వరకు, అక్కడి నుండి దేవాలయం సమీపం వరకు ఆర్టీసీ, సింగరేణి ఉచిత షటిల్ బస్సులు ఏర్పాటు ద్వారా భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. పరిశుభ్రత, భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణపై జిల్లా కలెక్టర్ నిత్యం సమీక్ష నిర్వహిస్తున్నారు. పుష్కర సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు, వైదిక కార్యక్రమాలు, సాయంత్రం సరస్వతి నవరత్న మాలా హారతి, సాంస్కృతిక భక్తి ప్రదర్శనలు నిర్వహించబడుతున్నాయి.

**కాంతులీనుతున్న కాళేశ్వరం....**
అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలతో కాళేశ్వరం సరికొత్త కాంతులీనుతోంది. కనీవిని ఎరగని స్థాయిలో భక్త జనం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తోంది. శతాబ్దాలుగా సరస్వతి నదికి పుష్కరాలు జరుపుకునే ఆనవాయితీ కొనసాగుతున్నా అధికారికంగా ఇదే తొలిసారి కావడం విశేషం. ఉత్తరాదిన ఉన్న ప్రయాగరాజ్ వద్ద మాత్రమే పుష్కరాలు నిర్వహించుకునే సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కాళేశ్వరంలో ప్రారంభించింది. దీంతో దేశంలో రెండో చోట సరస్వతి నది పుష్కరాలు నిర్వహించుకునే సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్టయింది.

**ఎక్కడ చూసినా జనం... జనం...**
కాళేశ్వరం సరస్వతి పుష్కరాల్లో పవిత్ర పుష్కర స్నానాలు కోసం దేశం నలుమూలల భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. పుష్కరాల గురించి విస్తృతంగా ప్రచారం జరగడంతో రోజు రోజుకు భక్తుల సంఖ్య రెట్టింపు అవుతోంది. దీంతో కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం అంతా భక్తులతో కిక్కిరిసిపోతోంది. ప్రతి రోజు వేకువ జాము నుండి మొదలు రాత్రి వరకూ కూడా నదీ తీరం జనమయం అవుతోంది. ఓ వైపున కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య స్నానాలు, మరో వైపున త్రివేణి సంగమానికి చీరె సారె సమర్పించడం, నీటి పక్కన సైకత లింగాలకు పూజలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో సరస్వతి సంగమం అంతా ఆధ్యాత్మికతతో నిండిపోయింది.

**మరో హైలట్‌గా త్రివేణి హారతి...**
సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరంలో త్రివేణి హారతి అత్యంత హైలెట్ గా నిలుస్తోంది త్రివేణి సంగమంలో నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి. నది హారతి నిర్వహించేందుకు కాశీ నుండి ప్రత్యేకంగా పండితులను రప్పించారు. కాశీ పూజారులు పుష్కరాలు ప్రారంభం రోజు రోజు రాత్రి నుండి త్రివేణి సంగమ తీరాన నిర్వహిస్తున్న హారతి తంతు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయితే కాశీ గంగలో నీటి ప్రవాహంపై బోట్లలో కూర్చుని తిలకించాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రముఖులతో పాటు సాధారణ భక్తులు కూడా హారతిని వీక్షించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అవసరమైన ఏర్పాట్లు చేశారు. రోజూ రాత్రి గంటకు పైగా నిర్వహించే హారతిని వీక్షించేందుకే పెద్ద ఎత్తున భక్తులు కాళేశ్వరంలో ఉండిపోతున్నారు.

### పిండ ప్రధానాలు.. పితృతర్పణలు

త్రివేణి సంగమ తీరంలో భక్తులు పూర్వీకులను స్మరించుకుంటూ పితృ తర్పణాలు కోసం చాలా మంది మొగ్గు చూపుతున్నారు. సాధారణంగా తమ కుంటుంబ సభ్యులు చనిపోయిన రోజున అమశ్రాద్ధం నిర్వహించే తంతు కొనసాగిస్తారు. కానీ పుష్కర నది తీరంలో తీర్థవిధి నిర్వహించేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం భారతీయ సాంప్రదాయం. ఏటా తమ కుటుంబ సభ్యులకు తిథి కార్యక్రమం చేసినప్పుడు మూడు తరాలను మాత్రమే స్మరించుకునే ఆనవాయితీ కొనసాగుతుంది. కానీ పుష్కర నదీ తీరంలో అయితే తమ గోత్రీకులతో పాటు, చనిపోయిన బంధువులు,



స్నేహితులను కూడా స్మరిస్తూ వారి పేరుతో పిండ ప్రధానం చేయడం శ్రేయస్కరంగా ఉంటుంది. ఇలాంటి ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి, సంప్రదాయాలను పాటించేందుకు త్రివేణి సంగమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు.

### త్రివేణి సంగమంలో ప్రముఖుల పుష్కర స్నానాలు...


దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర క్షేత్రంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని ఆదివారం పలువురు ప్రముఖులు త్రివేణి సంగమంలో పుష్కరస్నానాలు ఆచరించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ కుటుంబసభ్యులతో కలిసి పుష్కర స్నానమాచరించి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యోగానంద సరస్వతీ స్వామీజీ, సినీ నటుడు తనికెళ్ల భరణితో పాటు పలువురు పుష్కర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పుష్కర స్నానాలకు వచ్చిన ప్రముఖులకు ఆలయ అర్చకులు, కమిటి సభ్యులు స్వాగతం పలికారు.అనంతరం ఆలయ ఈఓ మహేష్ వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



# నినాదం మార్కెట్ NINADAM MARKET

## చమురులో భారత్ తర్వాతే చైనా!

**దిల్లీ:** గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిని చైనానే ముందుండి నడిపించింది. వచ్చే దశాబ్దంలో మాత్రం భారత్ ఆ పనిచేస్తుందని మూడీస్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రపంచ చమురు వినియోగదారుల్లో చైనా, భారత్ వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ రెండు దేశాల్లో గిరాకీ వృద్ధి విషయంలో అంతరాలున్నాయని తెలిపింది. మూడీస్ ఇంకా ఏమంటోందంటే.. గిరాకీ వృద్ధి, దిగుమతిపై ఆధారపడడం భారత్‌లో ఎక్కువగా ఉండబోతోంది. చైనాతో పోలిస్తే వచ్చే దశాబ్దంలో భారత్‌లోనే గిరాకీ వృద్ధి వేగంగా ఉండనుంది. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడడం, అదే



సమయంలో విద్యుత్ వాహనాల(ఈవీ) వ్యాప్తి ఆ దేశంలో ఎక్కువ కావడంతో అక్కడ చమురుకు గిరాకీ తగ్గనుంది. చైనాలో వచ్చే 3-5 ఏళ్లలో చమురు వినియోగం గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. అదే సమయంలో భారత్‌లో 3-5 శాతం వార్షిక వృద్ధి నమోదు కావొచ్చు.

**ఇరు దేశాల మధ్య తేడా అదే..**
రెండు దేశాలూ చమురు-గ్యాస్‌పై భారీగా ఆధారపడ్డవే అయినా.. చమురు దిగుమతులపై చైనా ఆధారపడడం తగ్గుతుంది. దేశీయంగా ఉత్పత్తి పెరగడం, అనిశ్చితుల మధ్య గిరాకీ తగ్గడం ఇందుకు నేపథ్యం.

**ముఖ్యంగా చైనా జాతీయ చమురు** కంపెనీ(ఎన్‌ఓసీ)లు.. భారత చమురు కంపెనీలతో పోలిస్తే వచ్చే 3-5 ఏళ్లలో ఉత్పత్తి వృద్ధిలో ముందు ఉండనున్నాయి. చైనా ఎన్‌ఓసీలు తవ్వకం, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇక రిఫైనింగ్, పెట్రోరసాయనాల రంగాల్లో చాలా వరకు ప్రాజెక్టులు పూర్తి కావడంతో ఆ రంగంలో పెట్టుబడులు తగ్గనున్నాయి. కానీ భారత్‌లో మాత్రం ఇంకా రిఫైనింగ్, పెట్రోరసాయనాల ప్లాంట్లపై వచ్చే అయిదేళ్ల పాటు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి రావొచ్చు. దేశీయ చమురు-గ్యాస్ ఉత్పత్తిపై భారత ఎన్‌ఓసీల ప్రణాళికలు బాగున్నా.. అమలు జరగాల్సి ఉంది. భారత్‌లో కర్బన నియంత్రణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. చైనాతో పోలిస్తే భారత ఎన్‌ఓసీలకు హరిత సాంకేతికతలపై పెట్టుబడుల విషయంలో తక్కువ ఒత్తిడి ఉంది. అదే చైనాలో హరిత విధానాల విషయంలో కఠిన నిబంధనలు ఉన్నాయి.

**డ్రాగన్ దేశంలో గిరాకీ పరిస్థితి ఇలా..**
చైనాలో చమురు గిరాకీ 2030 కల్లా ఏటా 800 మిలియన్ టన్నుల వరకు చేరొచ్చు. ఆర్థిక వృద్ధి మందగమనానికి తోడు ఆ దేశం స్వచ్ఛ ఇంధనం వైపు మళ్లుతుండడంతో చమురు గిరాకీ వృద్ధిపై ప్రభావం పడతనుంది. ఈవీలు, పునరుత్పాదక ఇంధనంపై దృష్టి కారణంగా డీజిల్, పెట్రోలుపై ఆధారపడడం తగ్గవచ్చు. అయితే విమాన ఇంధనం, నాఫ్తా వినియోగం పెరిగే అవకాశం ఉంది. రిఫైనింగ్ సామర్థ్యం సైతం 1 బిలియన్ టన్నులకు చైనా పరిమితం చేసింది.

**మన దేశంలో..**
భారత్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని 2030 కల్లా ఏటా 309 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేర్చుకోవాలని భావిస్తోంది. ఏప్రిల్ 1, 2024 నాటికి 256.8 మి. మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంది. ఆర్థిక వృద్ధి రాణిస్తుండడం, పారిశ్రామికీకరణ, మౌలిక రంగంపై భారీ పెట్టుబడులు తదితరాల వల్ల భారత్‌లో రవాణా ఇంధనాల్లో గిరాకీ వృద్ధి పెరగనుంది. ఇక భారత చమురు మార్కెటింగ్ కంపెనీలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లు ఇటీవలి సంవత్సరాల్లో రిఫైనింగ్ సామర్థ్యాల పెంపు కోసం భారీ పెట్టుబడులు పెట్టాయి.

**సహజ వాయువు విషయంలోనూ..**
ఇక గ్యాస్ గిరాకీ వృద్ధి విషయంలోనూ చైనాతో పోలిస్తే భారత్‌లోనే కాస్త అధికంగా నమోదు కావొచ్చు. భారత్ తన ఇంధనాల్లో సహజ వాయువు వాటాను ప్రస్తుత 6 శాతం నుంచి 2030 కల్లా 15 శాతానికి చేర్చుకోవాలని భావిస్తోంది. ఎరువులు, పెట్రోరసాయనాల వంటి పారిశ్రామిక రంగాల విస్తరణకు తోడు, పట్టణ-పాక్షిక పట్టణ ప్రాంతాల్లో సహజ వాయువు వినియోగం పెరుగుతుండడంతో 2030 కల్లా ఏటా 4-7 శాతం మేర గిరాకీ వృద్ధి నమోదు కావొచ్చు.

## ఇంటర్వ్యూ అంటే భయం..!

### 68 శాతం ఉద్యోగార్థులది ఇదే మాట - అప్నా.కో నివేదిక

**ఉద్యోగం సాధించడంలో ఇంటర్వ్యూ ఎంతో కీలకం. కానీ, ఉద్యోగార్థుల్లో మూడింట ఒక వంతు మాత్రమే దీనికి సిద్ధంగా ఉంటున్నారు. దేశంలోని నిపుణులు ఇంటర్వ్యూల కోసం ఎలా సిద్ధమవుతున్నారనే విషయంపై అప్నా.కో 'ఇంటర్వ్యూ రెడినెస్ ఇండెక్స్ 2025'ను నిర్వహించింది. మొత్తం 10,261 మందిపై నిర్వహించిన ఈ సర్వేలో 32 శాతం మంది మాత్రమే ఇంటర్వ్యూలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డిజిటల్ సాధనాలు ఇంటర్వ్యూ సంసిద్ధతను పెంచడంలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆన్‌లైన్ శిక్షణ, మాక్ ఇంటర్వ్యూలు, ఏఐ ఆధారిత వేదికలను ఉపయోగించిన ఉద్యోగార్థులు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇవి ఉపయోగించని వారిలో కేవలం 24 శాతం మంది మాత్రమే తాము ఇంటర్వ్యూ కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు.**

ఆరేళ్లకు పైగా అనుభవం ఉన్న వారిలో 49 శాతం ఉద్యోగులు కొత్త సంస్థకు మారే క్రమంలో ఇంటర్వ్యూలకు ఎలాంటి ఇబ్బందీ లేదని తెలిపారు. 3-6 ఏళ్ల ఉన్న అనుభవం ఉన్న వృత్తి నిపుణులలో 34 శాతం, 1-3 ఏళ్ల అనుభవం ఉన్న నిపుణుల్లో 29 శాతం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఏడాదికన్నా తక్కువ అనుభవం ఉన్న ఫ్రెషర్లు కేవలం 21 శాతం మందే ఇంటర్వ్యూల కోసం సిద్ధంగా ఉన్నట్లు భావిస్తున్నారు.

ఆందోళన, ఊహించని ప్రశ్నల భయం కొత్త వారి ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

యువ నిపుణులు (18-24 ఏళ్లవారు) ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు 26 శాతం కంటే తక్కువే సిద్ధంగా ఉన్నారు.

ప్రథమ శ్రేణి నగరాల్లో ఎక్కువ మంది కొత్త ఉద్యోగాల్లోకి మారేందుకు ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు ఇబ్బంది లేదని చెబుతుండగా.. ఇతర నగరాల్లోని వారు అధిక శాతం మంది తమకు కష్టమేనని పేర్కొంటున్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, ఐటీలాంటి టెక్ నిపుణులు ఇంటర్వ్యూ పెద్ద కష్టమేమీ కాదనే అభిప్రాయంలో ఉన్నారు. అదే సమయంలో హెచ్‌ఆర్, మార్కెటింగ్, ఆపరేషన్స్ వంటి రంగాల్లోని వారు 30 శాతం లోపే ఈ మాట చెబుతున్నారు.

'అభ్యర్థుల బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని వెలికి తీయడంలో ఇంటర్వ్యూలు ఎంతో కీలకం. కానీ, వారు సిద్ధంగా లేకపోవడంతో ఉద్యోగ నియామకాల విషయంలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఏఐ ఆధారిత సాంకేతికత వంటి వాటిని ఉపయోగించి శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని అప్నా.కో వ్యవస్థాపకుడు, సీఈఓ నిర్మిత్ పరీఖ్ తెలిపారు. నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే మంచి ఉద్యోగావకాశాలు అందుకోగలరని సూచించారు.



## యాపిల్.. భారత్‌లో ప్లాంట్లు నిర్మించుకోవచ్చు!

### అక్కడ తయారైన ఉత్పత్తులు అమెరికాలో విక్రయించాలంటే సుంకాలు చెల్లించాల్సిందే

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్




**న్యూయార్క్ :** యాపిల్ తన ప్లాంట్లను నిర్మించడానికి భారత్‌కు వెళ్లొచ్చని, కానీ ఆ టెక్ కంపెనీ సుంకాలు లేకుండా అమెరికాలో తన ఉత్పత్తులను విక్రయించడానికి వీలుండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అణుశక్తిని పెంచడానికి ఓవల్ కార్యాలయంలో బహుళ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'టిమ్ కుక్ యాపిల్ ప్లాంట్లు నిర్మించడానికి భారతదేశానికి వెళ్తున్నానని నాతో అన్నారు. అక్కడకు వెళ్లడం ఫర్వాలేదు కానీ సుంకాలు లేకుండా ఇక్కడ ఆ ఉత్పత్తులను విక్రయించడం కుదరదని చెప్పాన'ని ట్రంప్ వెల్లడించారు. ఐఫోన్లను అమెరికాలో సుంకాలు లేకుండా విక్రయించుకోవాలంటే ఇక్కడే ఉత్పత్తి చేయాలని నేను ప్రతిపాదించానని తెలిపారు. దీనికి యాపిల్ సుముఖంగా లేకపోతే 25 శాతం సుంకాలు చెల్లించి ఇక్కడ ఉత్పత్తులను విక్రయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. భారత్‌లో చౌకగానే..: భారత్‌లో తయారయ్యే ఐఫోన్లపై అమెరికా సుంకాలు విధించినప్పటికీ మన దేశంలో ఐఫోన్ల తయారీ ఖర్చు అమెరికాలో కంటే తక్కువే అవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో తక్కువ ఉత్పత్తి వ్యయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటివి దీనికి దోహదం చేస్తాయని పేర్కొంది.

**జీటీఆర్ఐ నివేదిక ప్రకారం..:**
భారత్‌లో ఒక ఐఫోన్ అసెంబ్లింగ్ ఖర్చు సుమారు 30 డాలర్లు కాగా, అమెరికాలో 390 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుంది. భారత్‌లో కార్మికుల జీతాలు తక్కువగా ఉండటమే దీనికి కారణం. మన దేశంలో ఒక కార్మికుడికి నెల సంపాదన సగటున 230 డాలర్లు (రూ.19,000). అదే అమెరికాలో కనీస వేతన చట్టాల ప్రకారం ఈ సంపాదన 2,900 డాలర్ల (రూ.2.4 లక్షలు) వరకు ఉంటుంది. అంటే దాదాపు 13 రెట్ల వ్యత్యాసం ఉంది. అలాగే భారత ప్రభుత్వం అందించే పీఎల్ఐ పథకం కూడా యాపిల్‌కు అదనపు లాభాల్ని అందిస్తోంది. దీంతో ఐఫోన్లపై 25% సుంకం విధించినా భారత్‌లో చౌకగానే తయారవుతాయి.

# నకిలీ విత్తనాలకి అడ్డుకట్ట పడేనా





**ఆసిఫాబాద్, మే 25 (నినాదం న్యూస్):** నకిలీ పత్తి విత్తనాల దందా ఇష్టారాజ్యమైంది. ఆసిఫాబాద్ జిల్లాలోని తూర్పు నియోజకవర్గం సీర్పూర్ కాగజ్ నగర్ లో యధేచ్ఛగా అక్రమార్కులు ఈ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఏటా వందలాది క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఈ ప్రాంతానికి తీసుకోవచ్చి విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలను నియంత్రించడం అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో రైతులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టినా సరైన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. గడిచిన రెండు నెలల్లో జిల్లా టాస్కోర్స్ పోలీసులు కాగజ్ నగర్. చింతల మానేపల్లి. పెంచికల్ పేట్ మండలాల్లో మూడుచోట్ల దాడులు చేసి సుమారు రూ.80 లక్షల విలువ చేసే 27 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. ఇందులో ఒక్క కాగజ్ నగర్ లోనే రూ 60 లక్షలు విలువ చేసే రెండు టన్నుల బీటీ3 నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. అంటే ఏ స్థాయిలో నకిలీ దందా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

**.ఇతర సరుకుల మాటున జిల్లాకు..** నకిలీ విత్తనాల తరలింపులో కేటుగాళ్లు కొత్త పంథా అవలంబిస్తు న్నారు. ఎవరికి అనుమానం రాకుండా వాహనాల్లోతరలిస్తున్నారు. నిత్యావసర సరుకులు. వడ్ల బస్తాలు. ఉల్లిగడ్డలు. గండి మాటున ఉంచి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే విత్తనాలు తరలించే వాహనాలకు కారు. బైక్ లాంటి వాటిని ఎస్కార్ట్ గా వినియోగిస్తున్నారు. ఎక్కడైనా పోలీసులు తనిఖీ చేస్తున్నట్లు కనిపిస్తే వెంటనే వాహనాన్ని వెనిక్కి పంపి.. మరోదారి కూడా తరలిస్తున్నారు. ఈ అక్రమార్కుల పై కఠినమైన చర్యలు లేకపో వడంతో పట్టుబడి కేసులు నమోదైన వారిలో ఎలాంటి మార్పు లేకుండా ఉంది.

**.సిర్పూర్ నియోజకవర్గంలో విచ్చలవిడిగా..** సిర్పూర్ నియోజకవర్గంలో నకిలీ విత్తనాలు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ కు చెందిన కొందరు వ్యాపారులు వందలాది క్వింటాళ్ల నకిలీ విత్తనాలు తెచ్చి అమ్ముతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగజ్ నగర్ కేంద్రంగా దహెగాం. పెంచి కల్ పేట్. చింతలమానేపల్లి. బెజ్జూర్. కౌటల లాంటి మండలాల్లోని గ్రామాల్లో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఖరీఫ్ సాగు సీజన్ సమీపించిన నేపథ్యంలో నకిలీ విత్తనాలు జిల్లా రైతులను కలవర పెడుతున్నాయి. సంబంధిత అధికారులు నకిలీ విత్తనాలను నిర్మూలించాలన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య
# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**.సుల్తానాబాద్, మే 25 (నినాదం న్యూస్):**
ఆనందోత్సవాల మధ్య 2004-2005 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఆదివారం సుల్తానాబా ద్ మండలం నారాయణపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదు వుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత వివిధ రంగాల్లో స్థిరపడ్డ అలనాటి పూర్వ విద్యార్థులు అంత ఒకే చోటు కు చేరుకొని ఒకరికొకరు కలుసుకొని పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ,యోగ క్షేమాలు అ డిగి తెలుసుకున్నారు.అలాగే తమ విద్య బుద్ధు లు నేర్పినగురువులు రామ్ కిషన్ రావు, శ్రీనివాస్, జగత్ పాల్,భరత్ కుమార్,చంద్రమౌళి, లక్ష్మీనా రాయణ, జ్యోతి లకు పూర్వ విద్యార్థులు జ్ఞాపిక లు అందజేసి శాలవాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాగర్ రావు, మహేందర్, విద్యా సాగర్,ఉమేష్ రాజు,మంజుల,కస్తూరి,స్వప్న,సం ధ్య, స్రవంతి, పూర్వ విద్యార్థులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గ్రామ పాలన అధికారి పరీక్షలు

### -అదనపు కలెక్టర్ డి.వేణు

**.పెద్దపల్లి, మే25(నినాదం న్యూస్):**
పెద్దపల్లి జిల్లాలో గ్రామ పాలన అధికారి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు.ఆదివారం అదనపు కలెక్టర్ డి.వేణు పెద్ద కాల్వల లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పాలన అధికారి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ,గ్రామ పాలన అధికారి పరీక్షలకు పెద్దపల్లి జిల్లాలో 90 మంది అభ్యర్థులు హాజరవు కావాల్సి ఉండగా 82 మంది అభ్యర్థులు హాజరయ్యారని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్




**.ఆసిఫాబాద్, మే 25(నినాదం న్యూస్):**
ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్ గెలుపొందారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు గాను 8 మందితో కూడిన ఎన్నికల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో క్లబ్ అధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సాక్షి రిపోర్టర్ వారణాసి శ్రీనివాస్, కోశాధికారిగా ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కలకుంట్ల శ్రీధర్ లు గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతామని ముక్తాకంఠంతో పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన క్లబ్ సభ్యులకు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించిన ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులకు క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు రామ్మోహన్, హనుమయ్య, సురేష్, అబ్దుల్ రెహమాన్, మహేష్, కృష్ణంరాజు, తారు, మీర్జా సలీంలతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది సిపిఐ ఒక్కటే

### -సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




**.జమ్మికుంట,మే 25 (నినాదం న్యూస్):**
పేద ప్రజల కోసం అనునిత్యం పోరాటాలు చేస్తూ పేదల అభ్యు న్నతికి పాటుపడే పార్టీ సిపిఐ ఒక్కటే నని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం రోజున ఇల్లంద కుంట మండల మహాసభ మల్యాల గ్రామంలో మాదారపు రత్నాకర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ సిపిఐ పార్టీ మార్క్సిజం, లెని నిజం పునాదులపై ఆవిర్భవించిందని సమాజంలో అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం నిర్విరామ పోరాటం చేస్తుందని భూమి లేని నిరుపేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, యువతకు ఉపాధి హక్కుల సాధన కోసం, పేద పిల్లలకు ఉచిత విద్య, వైద్యం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు.దున్నేవాడికే భూమి కావాలని భూమి కోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, బానిసత్వం పోవాలని విరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సిపిఐ నాయకత్వం వహించిందని 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిన పార్టీ అని 4,500 మంది అమరవీరులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని ఆయన తెలిపారు.దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చి 11 సంవత్సరాలు అవుతున్న పేదవాడి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని, ఉద్యోగ ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. కార్పొరేట్ బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేయడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పంజాల శ్రీనివాస్, ఇజ్జిగిరి రాంగోపాల్, బుర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు ఎండీ మునీర్ అస్తమయం

- అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన పాత్రికేయుడు
- కార్మిక క్షేత్రంలో విషాద ఛాయలు
- సిఎం సంతాపం



**.మంచిర్యాల ప్రతినిధి, మే 25(నినాదం న్యూస్):** సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు, సకల జనుల సమ్మె సింగరేణి కన్వీనర్ కామ్రేడ్ ఎండి మునీర్ (60) శనివారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాదపడుతూ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందమర్రికి చెందిన ఆయన సింగరేణిలో ఉద్యోగిగా చేరిన ఆయన జర్నిలిస్టుగా, ఉద్యమకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. సింగరేణిలో కార్మికుల పక్షాన నిలిచాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి జేఏసీ చైర్మన్ గా ఉండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమ సంఘాలను ఏకం చేసి ముందుండి నడిపించాడు.

**.మంచిర్యాలలో విషాద చాయలు..**
మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ఎండీ మునీర్ సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వహించారు. జర్నలిస్టుగా ప నిచేయడంతో సింగరేణి యాజమన్యం విముఖత చూపడంతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పటినుంచి వటు పత్రికల్లో సేవలు అందించారు. సింగరేణి కార్మికుల సమస్యలు వెలికితీస్తూ వారి పక్షాన నిలబడ్డాడు. సింగరేణిలో విప్లవ కార్మిక సంఘాలతో కలిసి పోరాటం చేశాడు. ఆయన మృతి చెందడంతో జిల్లాలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మునీర్ అంత్య క్రియలు మంచిర్యాల జిల్లా స్వగ్రామం మందమర్రిలో నిర్వ హించారు.మునీర్ అంత్యక్రియలు మంచిర్యాల జిల్లా స్వగ్రామం మందమర్రిలో నిర్వహించారు.

**.సిఎం సంతాపం..**
సీనియర్ పాత్రికేయుడు ఎండీ మునీర్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతావం ప్రకటించాడు. ఆయన మరణం పాత్రికేయ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# అపూర్వ కలయిక.. ఆడిపాడిన స్నేహ గణం





**.మంచిర్యాల ప్రతినిధి, మే 25 (నినాదం న్యూస్):** వారంతా ఒకే చోట చదువుకున్న మిత్రులు. పదో తరగతి పూర్తయ్యాక వివిధ కోర్సుల్లో చదివి ఉన్నత స్థానంలో ఎదిగారు. పాఠశాల జ్ఞాపకాలు ఎప్పటికీ మర్చిపోలేనివి. జీవితంలో చెరగని ముద్ర వేస్తాయి. ఆ మధురమైన క్షణాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ శ్రీ లక్ష్మీ శిశు మందిర్ హై స్కూల్ 2003 2004 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా జరిగింది. 21 సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లంతా మళ్లీ చదువులమ్మ ఒడిలో కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, నాటి చిలిపి అల్లరి చేష్టలు, మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదిలో కూర్చొని ఒకసారి పాత జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందించారు. మిత్రులందరు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ , రాజ్ కుమార్, కనకయ్య, రాజలింగు, రమణారెడ్డి, పూర్వ విద్యార్థులు దిలీప్, తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని నక్సలిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం

### -అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**. నిజామాబాద్ ప్రతినిధి, మే 25 (నినాదం న్యూస్) :** మాన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మార్వాడిగల్లీ బూత్ నెంబర్ 43 బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ నరేంద్రమోదీ సందేశాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధ న్ పాల్ మాట్లాడుతూ నరేంద్రమోదీ జాతిని ఉద్దేశించి గొప్ప సందేశాన్ని ఇచ్చారని అన్నారు.ఆపరేషన్ సిందూర్ లో భారత సైన్యం చూపిన వీరత్వానికి ప్రపంచదేశాలు ఆశ్చర్యపోయాయన్నారు.ఆపరేషన్ కాగర్ తో 2026 మార్చ్ లోపు దేశంలో నక్సలిజాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.ఎందరో జాతీయ వాదులను, మన జవానుల మృతికి కారకుడైనా నంబల కేశవరావు వంటి కరుడుకట్టిన తీవ్రవాదులను హతమార్చడం వల్ల దేశ ప్రజలందరు సంబురాలు చేసుకుంటున్నారన్నారు.వ్యవసాయ రంగంలో భారత దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించిందని అన్నారు మన తెలంగాణలో సంగారెడ్డి జిల్లాలో డ్రోన్ పరికరంతో 50 ఎకరాలలో మహిళలు పొలాలకు స్ప్రే చేసిన విధానం నిదర్శనం అన్నారు.వ్యవసాయ డ్రోన్ పరికరాలకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తూ మహిళను, యువతను వ్యవసాయ రంగంలో ప్రోత్సాహిస్తుందని అన్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రతి వ్యక్తి యోగ అలవాటు చేసుకోవాలన్నారు ప్రపంచ యోగ దినోత్సవం జూన్ 21న ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఖేలో ఇండియా పేరుతో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సాహించే విదంగా జాతీయ, అంతర్జాతీయ, ఓలంపిక్ స్థాయిలో రానించే విదంగా క్రీడాకారులను ప్రోత్సాహించడం జరుగుతుందన్నారు.తేన ఉత్పత్తులలో భారతదేశం అగ్ర స్థానంలో ఉందన్నారు ముఖ్యంగా గిరిజన మహిళలు, యువత ఈ రంగంలో రానిస్తున్నారని తెలియజేసారు.భారత దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుపుతు గొప్ప ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత్ ను ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో బిజెపి కేంద్రప్రభుత్వం పని చేయడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో సీతారాం పండే, కమల్, కృష్ణ, గోపాల్ ,వినయ్, ధనరాజ్,మారుతి,జయ ప్రకాష్, బాలకిషన్,ఓం అటల్, అశోక్, రఘునాథ్ చౌదరి, శ్రీను,పవన్ ముందడ,సత్యనారాయణ, నాగలా,సుఖీరాజ్. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఒక వరం




**.నిజామాబాద్ ప్రతినిధి, మే 25 (నినాదం న్యూస్ ) :** ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాణిక్ భవన్ స్కూల్ లో నిర్వహించిన ప్రతిభా పురస్కారం 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోదీ అగ్రవర్ణంలో ఉన్న పేద విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే విదంగా ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ తీసుకురావడం గొప్ప చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.అగ్రవర్ణ కులాలలో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం విద్యాతోపాటు క్రీడలు, యోగ, కళా సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులు ఈ రోజుల్లో ఎక్కువ సెల్ ఫోన్ కు బంధీలు అవుతున్నారని దాని ధ్వరా బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు ముఖ్యంగా తల్లి, తండ్రులు వీలైనంత వరకు పిల్లలను సెల్ ఫోన్ కు దూరంగా ఉంచాలని సూచించారు.విద్యార్థులకు చిన్నప్పటినుండే మన ఆచార అలవాట్ల గురించి హిందూ ధర్మ సంస్కృతి సాంప్రదాయాలను అలవాటు చేయాలనీ సూచించారు.అనంతరం పదోతరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్ లలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సన్మానించి మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ధన్ పాల్ శ్రీనివాస్, ఇంగు ప్రసాద్, రవీందర్, భోజ రాజు, చిరంజీవ రాజు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**.భీమదేవరపల్లి మే 25 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మాణిక్య పూర్ గ్రామంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ సెకండియర్ పాఠశాల లో మూడు గ్రామాలలో నుండి ఈ పాఠశాలలో విద్యార్థులుగా చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది... జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి (2000-2001) చదువుకున్న రోజుల్లో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు తప్పు చేస్తే దండించిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. చిరిగిన చొక్కా అయినా వేసుకో మంచి బుక్కు కొనుక్కో అంటూ తమను క్రమశిక్షణగా మారుపేరుగా మార్చిన ప్రతి గురువుకు పేరుపేరునా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.. తరగతి గదుల్లో ఆడిన ఆటలు పాటలు ఆకతాయితనంతో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని సరదాగా మాట్లాడుకున్నారు. ఇక్కడే పుట్టి ఎక్కడెక్కడో స్థిరపడిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించుకున్నారు. కష్టం వస్తే తోబుట్టువులుగా మేము ఉన్నామని చిన్ననాటి స్నేహితురాళ్లకు భరోసా ఇచ్చారు మీ ఇంట్లో పండగలు జరుగుతే పిలవకుండా పరవాలేదు కానీ కష్టం వస్తే అన్నయ్య అని పిలవండి అండగా నిలబడతాము. అంటూ ఒకరినొకరు కన్నీళ్లు పెట్టుకున్నారు బరువెక్కిన హృదయాలతో చిన్ననాటి స్నేహితులు నిష్క్రమించారు.. ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు



**.జమ్మికుంట,మే 25 (నినాదం న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మోత్కులగూడెం 190 వ బూత్ అధ్యక్షులు తాటికంటి మల్లేష్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బిజెపి నాయకులు వీక్షించారు. ఈసందర్భంగా మోడీ తన మనసులోని మాటను దేశ ప్రజలతో పంచుకున్నారు, కాశ్మీర్ లోని పాహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత దేశ ప్రజలు మొత్తం ఏకతాటిపైకి వచ్చి పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదులను అంతమొందించాలని ప్రజలు వారిలోని ఆక్రోశాన్ని వివిధ రకాల నిరసనల రూపంలో వ్యక్తంచేశారు, దాని స్ఫూర్తితోనే భారత ఆర్మీ పాకిస్థాన్ దేశంలోకి వారి ఇళ్ళలోకి వెళ్లి ఉగ్రవాద సంస్థలను ధ్వంసం చేసి ఉగ్రవాదులను అంతమొందించి, సమర్థవంతంగా వారి లక్ష్యాన్ని పూర్తి చేసిందని కొనియాడారు, అలాగే మన తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లాలో మహిళా రైతులు వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని డ్రోన్ల ద్వారా రోజులో రెండు మూడు గంటల్లో వ్యవసాయం చేస్తూ మన తెలంగాణా ఆడబిడ్డలు దేశానికి ఆదర్శంగా నిలిచారని, వారిని స్కై వారియర్స్ గా కొనియాడారు, చేతి వృత్తుల్లో నైపుణ్యం పెంచుకుని డిజిటల్ పద్ధతిలో అనూహ్య వేగంగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని దీనిని దేశ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి శక్తి కేంద్ర ఇంచార్జ్ ఆకుల రాజేందర్, బూత్ అధ్యక్షులు తాటికంటి మల్లేష్, మదిర పద్మలత, పొనగంటి రవి, ఉడుగుల మహేందర్, కైలాసకొటి గణేష్, యగ్గని చందు, ఆకుల పోచయ్య, బిట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్‌తో
# దేశం ఖ్యాతి పెరిగింది

### -మన్‌కి బాత్ వీక్షించిన పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు




**.కరీంనగర్, మే 25(నినాదం న్యూస్):** కరీంనగర్ పట్టణం విద్యానగర్ 39 వ డివిజన్ బిజెపి శ్రేణులతో కలిసి పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్ కి బాత్ కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 3వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని, అప్పటినుండి ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమవు తుందన్నారు. ముఖ్యంగా ఆ నెలలో జరిగిన అంశాలు వివిధ రంగాల్లో భారతీయులు సాధించిన విజయాలను ప్రధాని మోదీ ప్రజలతో పంచుకుంటారని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ వల్ల దేశ ఖ్యాతి ఎంతో పెరిగిందని, ఐక్యత ,ప్రదర్శనల తో ప్రతి ఒక్కరు దేశానికి అండగా నిలిచిన అంశాన్ని ప్రధానంగా పీఎం మోదీ ప్రస్తావించారని తెలిపారు. ముఖ్యంగా ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం ప్రతినెల 23 జాతీయ భాషలు, 31 మండలి కాళ్లలో అన్ని కేంద్రాల ద్వారా ఆకాశవాణి ప్రసారం చేస్తుందన్నారు. అలాగే ఇంగ్లీష్ సహా 11 అంతర్జాతీయ భాషల్లోనూఇదిప్రసారమవుతుందన్నారు . సామాన్యులతో అనుసంధానానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ ప్రోగ్రాం ప్రధాని మోదీని ప్రజలకు మరింత చేరువ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో .గుండారపు సంపత్, ప్రదీప్.న్యాత ప్రవీణ్.లక్ష్మణ్ .అశోక్ .చైతన్య అభి .రాంచరణ్,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



**.పెద్దపల్లి రూరల్, మే 25(నినాదం న్యూస్):** జిల్లాలోని పెద్దపెల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు బబ్బూరి శ్యామ్ కు చెందిన ఆవు పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ షాక్ తగిలి మృతి చెందింది.పొలం వద్ద ఆవు మేత తింటూ ట్రాన్స్ఫర్ వద్దకు వెళ్ళగా అక్కడ విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు రైతు విలపిస్తూ వెల్లడించారు.సుమారు ఈ ఆవు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, నిరుపేద రైతును ప్రభుత్వం ఆదుకోవాలని ఊరేడుపేట ప్రజా ప్రతినిధులు, రైతులు కోరారు.

# పుష్కర ఏర్పాట్లు భేష్...

**అధికార యంత్రాంగానికి గవర్నర్ కితాబు**

**పుష్కర స్నానమాచరించిన గవర్నర్ దంపతులు**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ మహాదేవపూర్ (నినాదం):**
పన్నెండ్లకోసారి వచ్చే సరస్వతీ పుష్కరాలు కాళేశ్వర క్షేత్రంలో త్రివేణి సంగమంలో అత్యంత వైభవంగా నిర్వహించడంపై రాష్ట్ర గవర్నర్ అధికార యంత్రాంగానికి ప్రశంసల జల్లులు కురిపించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంగమంలోని సరస్వతి ఘాట్ లో శాస్త్రోక్తంగా పుష్కర స్నానం ఆచరించి సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. అక్కడి నుంచి గవర్నర్ దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు స్వాగతం పలుకగా ఆలయ పూజారులు పరివట్టం, పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు గవర్నర్ దంపతులకు ఆశీర్వచనం అందించి, శ్వేత వస్త్రం, లడ్డు ప్రసాదం, చక్కెర పొంగలి అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం గురించి గవర్నర్ దంపతులకు వివరించారు. కాగా పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన గవర్నర్ అధికారులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయమని కొనియాడారు. గత 11 రోజుల నుండి పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు పుష్కర స్నానాలు ఆచరించాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు.

# నేనున్నా... అధైర్య పడకండి..

**మూగజీవాలు కోల్పోయిన రైతులకు అండగా మంత్రి పొంగులేటి..**



**ఖమ్మం, మే 25 (నినాదం) :**
నేనున్నానని... అధైర్య పడకండని.. 75 మూగజీవాలు కోల్పోయిన రైతులతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.. ఆదివారం మధ్యాహ్నం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండా గ్రామంలో కొందరి రైతులకు చెందిన సుమారు 75మేకలు మృత్యువాత పడ్డాయి.. మేతకు వెళ్లిన మేకలు మృత్యువాత పడడంతో రైతుల ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి.. దీంతో స్థానిక గిరిజన రైతులు కన్నీరు మున్నీరయ్యారు.. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ తదితరులు రైతులను ఓదార్చి మూగజీవాల ఘటనను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రామ హాయం రఘురాం రెడ్డి తక్షణమే రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని ఫోన్ ద్వారా రైతులకు హామీ ఇచ్చారు.

# క్యాన్సర్‌పై పరిశోధనకు కన్నెకంటి ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్

**ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో క్యాన్సర్ వైద్యంపై ప్రచురించిన పరిశోధన ఫలితాలపై అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు**

**క్యాన్సర్‌పై పరిశోధనచేసి అంతర్జాతీయ స్థాయిలో సాంఘిక సంక్షేమ గురుకులాల సత్తాచాటిన గురుకుల పూర్వవిద్యార్థి కన్నెకంటి ప్రవీణ్‌కుమార్**

**పారా ఆఫ్తాల్మిక్ మెడికల్ ఆఫీసర్‌గా కూతురు, కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించిన కొడుకు, ఎకనామిక్స్‌లో డాక్టరేట్ సాధించిన తండ్రి**

**తెల్దారుపల్లి వాసి అరుదైన రికార్డ్**

**డాక్టర్స్ ఫ్యామిలీగా ప్రశంసలందుకుంటున్న కుటుంబం**



**ఖమ్మం,మే 25 (నినాదం):**
ప్రస్తుతం క్యాన్సర్ వైద్యంలో ఉపయోగిస్తున్న మెడిసిన్స్ కాంబినేషన్స్ కంటే ఉత్తమమైన కాంబినేషన్స్ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించిన కన్నెకంటి ప్రవీణ్ కుమార్ కు హైదరాబాద్ చైతన్య డిమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన కన్నెకంటి ప్రవీణ్ కుమార్ రసాయనశాస్త్ర విభాగంలో "డిసైన్ అండ్ సింతసిస్ ఆఫ్ న్యూ ఇమిడజోల్ డెరివేటివ్స్ యాస్ యాంటి క్యాన్సర్ ఏజెంట్స్" అనే అంశంపై నాలుగు సంవత్సరాలుగా పరిశోధనలు చేశారు. ప్రొఫెసర్ టి.నర్సింహ స్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ సైన్సెస్( ఐఐసిటి) మరియు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజి (సిసియంబి) సహకారంతో తాను చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలనివ్వడంతో డాక్టరేట్ అందుకున్నాడు. అంతేకాకుండా క్యాన్సర్ వ్యాధి ట్రీట్మెంట్‌లో వాడే మందులపై తాను చేసిన ప్రయోగాలను ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రకటించి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాడు. క్యాన్సర్ వైద్యంలో ప్రస్తుతం వాడుతున్న మందులలో వాడే రసాయనాల కాంబినేషన్స్ కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదుల్లో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపాడు. సంక్షేమ గురుకులాల్లో చదివి అంతర్జాతీయ స్థాయిలో 'యాంటి ప్రోస్టేట్ క్యాన్సర్', 'హ్యూమన్ లంగ్ క్యాన్సర్',బ్రెస్ట్ క్యాన్సర్ పై పరిశోధనా పత్రాలు అత్యంత ప్రామాణికంగా వెలువరించి గురుకులాల సత్తా చాటడం అభినందనీయమని శంకరణ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఐనాల సైదులు, నామా పురుషోత్తం హర్షం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం దమ్మపేట ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డా.కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలను గురుకులాల్లోనే చదివించి ఆదర్శంగగా నిలిచారని వారన్నారు. కొడుకు ప్రవీణ్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించగా ఇప్పటికే పారా ఆఫ్తాల్మిక్ మెడికల్ ఆఫీసర్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సేవలందిస్తున్నారు కూతురు కన్నెకంటి ప్రతిభ. ఉద్యోగం చేస్తూ ఎకనమిక్స్‌లో డాక్టరేట్ సాధించి తన విద్యార్థులకు స్పూర్తినిచ్చిన కన్నెకంటి వెంకటేశ్వర్లు ఇద్దరు పిల్లలు ఉన్నత విద్యనందుకొని తన గ్రామం తెల్దారుపల్లిలో ఎందరికో ఆదర్శంగా నిలవడం అత్యంత అభినందనీయమని గురుకుల పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. ఆదివారం ఖమ్మంలో ప్రవీణ్ కుమార్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ సైన్సెస్( ఐఐసిటి) మరియు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజి(సిసియంబి) పురుషోత్తం, భగవత్, సౌగంధి యసస్విని, సాయిలిఖిత, ప్రతిభ, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్స్ సమస్యల పరిష్కారానికి కమిటీ

**దిగ్విజయంగా ముగిసిన తానాకాన్ 2025 కరీంనగర్ సదస్సు**

**చిన్న, మధ్య తరగతి హాస్పిటల్స్‌కు సింగిల్ విండో పద్ధతి ద్వారా అనుమతులు**

**రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**




**కరీంనగర్, మే 25(నినాదం న్యూస్) :**
తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హెూమ్ డాక్టర్స్ అసోసియేషన్ 2025 రాష్ట్ర వ్యాప్త సదస్సు రెండో రోజు కార్యక్రమాల నిర్వహణ ముగింపు కార్యక్రమం స్థానిక ప్రతిమ హెూటల్ నందు దిగ్విజయంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్న మధ్యస్థాయి హాస్పిటల్స్ ఎదుర్కొంటున్న సమస్యలు అట్లే వివిధ స్థాయిలలో డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటి మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్‌బాబు, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే మానకొండూరు, డాక్టర్ సంజయ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే, అడ్లూరి లక్మణ్ కుమార్ ధర్మపురి ఎమ్మెల్యే, కే.సంజయ్ కోరుట్ల ఎమ్మెల్యే, పాల్వాయి హరీష్‌బాబు సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్గొని కార్యక్రమానికి వన్నె తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్, తెలంగాణాలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన డాక్టర్‌లు చిన్న మధ్యస్థాయి హాస్పిటల్ అనుమతుల కొరకు, ఎదుర్కొంటున్న సమస్యలు 50, 50 కంటే తక్కువ బెడ్స్ హాస్పిటల్‌కి పర్మిషన్‌లకు సింగిల్ విండో పద్ధతి ద్వారా అనుమతులు ఇవ్వాలని, వైద్య కమిషన్ ఏర్పాటుకు సహకరించాలని మినిస్టర్‌కు నివేదించగా దీనిపై స్పందించిన ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు సమస్య పరిష్కారానికి ఒక కమిటీని వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమ ములో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆర్గనైజేషన్ చైర్మన్, డాక్టర్స్అరుణ్ కటారి ప్రెసిడెంట్ ఎలెక్ట్ తానా తెలంగాణ స్టేట్, చాట్ల శ్రీధర్, డాక్టర్ రాజకుమార్, మంగీలాల్, సునీల్ రెడ్డి, డాక్టర్ మహేష్, సూర్యనారాయణరెడ్డి, జగన్ మోహన్‌రావు, బిఎన్.రావు, విజేందర్‌రెడ్డి, టీకేకే నాయుడు, లక్ష్మణ్, డాక్టర్ నాగ రఘురాం, డాక్టర్ విజయ మోహన్‌రెడ్డి, శ్రీలతరెడ్డి, శైలజ, మమతారెడ్డి, వై.నరేంద్ర, వి.జయరాం, డాక్టర్ ఇ.శైలజ, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ రమణాచారి, డాక్టర్ రామ్‌కిరణ్, డాక్టర్ అలిమ్, డాక్టర్ ఎం ఎల్ఎన్ రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

NINADAM CINEMA

## స్పిరిట్‌లో త్రిప్తి నటించడంపై ఆర్జీవీ షాకింగ్ ట్వీట్..





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయారు. పూర్తిగా సోషల్ మీడియాకు కూడా దూరం అయిన ఆయన కల్కి-2, సలార్-2, ఫౌజీ వంటి చిత్రాలు చేస్తున్నారు. అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆయన 'స్పిరిట్' సినిమా చేయనున్నారు. అయితే మొదటిసారి ఇందులో డార్లింగ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ మూవీ నుంచి అప్డేట్స్ వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులో ప్రియాంక చోప్రా, రుక్మిణి వసంత్ హీరోయిన్లుగా నటిస్తున్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. కానీ ప్రియాంక అత్యధిక రెమ్యునరేషన్ డిమాండ్ చేయడంతో ఆమెను తొలగించారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే.. మూవీ మేకర్స్ ఈ సినిమాలో హీరోయిన్‌ను ప్రకటించడంతో సెన్సేషన్‌గా మారింది. ఇందులో ప్రభాస్ సరసన బాలీవుడ్ హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రి నటిస్తున్నట్లు తెలుపుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా ఈ సినిమా ఏకంగా 9 భాషల్లో తెరకెక్కనున్నట్లు వెల్లడించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. దీంతో ఈ పోస్టులు చూసిన వారంతా అసలు ఆమె సెట్ అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఈ విషయంపై రామ్ గోపాల్ వర్మ ట్విట్టర్ ద్వారా స్పందించాడు. "సందీప్ రెడ్డి వంగా త్రిప్తి ట్రెమండస్ ప్రదర్శనను స్క్రీన్‌పై చూడబోతున్నారు. ఇంతకు ముందే 'యానిమల్'లో చూశారు. ఇక ఇప్పుడు 'స్పిరిట్'ఆమెను హీరోయిన్‌గా పెట్టడం మంచి నిర్ణయం. ఆమె ఈ సినిమాలో నటించడం తనకు బిగ్ థింగ్ అవుతుంది. బాలీవుడ్‌లో సెన్సేషన్‌గా మారుతుంది. కంగ్రాట్స్ త్రిప్తి ఇదే నీకు సరైన సమయం 'స్పిరిట్' ద్వారా ఆకాశంలోకి ఎగురుతావు. ఇండస్ట్రీలో స్టార్‌గా మారుతావు" అని రాసుకొచ్చారు. ఇక అది చూసిన త్రిప్తి ధన్యవాదాలు చెప్పుతూ ఆర్జీవీ కామెంట్లు తనకు ఎంతో విలువైనవని రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## తల్లి కాబోతున్న స్టార్ హీరోయిన్.. ఇక ఇండస్ట్రీకి దూరం కానుందా?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ 'సంఘర్ష్' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చింది. ఇక ఆ తర్వాత 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో గుర్తింపు తెచ్చుకుంది. పలు హిట్ సినిమాల్లో నటించిన ఆమె స్టార్ హీరోయిన్‌గా ఇండస్ట్రీలో రాణిస్తోంది. ఈ క్రమంలోనే.. అలియా భట్ తన కో స్టార్ అయిన రణ్‌బీర్ కపూర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇక ఈ జంటకు ఓ పాప కూడా ఉంది. అయితే ఇప్పుడు ఆమెకు రెండున్నరేళ్లు. పెళ్లై ఓ పాపకు జన్మనిచ్చినప్పటికీ మళ్లీ ఇండస్ట్రీకి రీ ఎంట్రీ ఇచ్చింది. ఇక చివరగా అలియా భట్ గత ఏడాది 'జిగ్రా' సినిమాలో నటించింది. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద మెప్పించింది. ప్రస్తుతం ఆమె 'అల్ఫా' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె అలియా పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫొటోలను, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఆమె ప్రెగ్నెంట్ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కేన్స్‌లో డిఫరెంట్ డ్రెస్‌లో దర్శనమిచ్చిన అలియా కడుపు కాస్త ముందుకు వచ్చినట్లు కనిపించడంతో ఆమె రెండో సారి ప్రెగ్నెంట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే కనుక నిజమైతే ఇక ఇండస్ట్రీకి దూరం అయినట్లే అని పలువురు అంటున్నారు. కానీ అభిమానులు మాత్రం వాటిల్లో నిజం లేదని కొట్టి పారేస్తున్నారు. ఇక చివరగా కేన్స్‌లో అలియా ఓ బ్లాక్ కలర్ డ్రెస్ ధరించి నాజుకుగా కనిపించడంతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## ఇండియన్ ఆర్మీకి భారీ విరాళం ప్రకటించిన ప్రీతిజింటా..

**ధైర్యవంతులైన రక్షకులకు అండగా నిలుద్దామంటూ కామెంట్స్**



బాలీవుడ్ హీరోయిన్ ప్రీతి జింటా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. పలు చిత్రాల్లో నటించి ఫుల్ ఫేమ్ తెచ్చుకుంది. అలాగే ఆమె తెలుగు స్టార్స్ మహేష్ బాబు, వెంకటేష్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించింది. గత కొద్ది కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. అంతేకాకుండా ఐపీఎల్‌లోనూ హుషారుగా పాల్గొంటుంది. పంజాబ్ కింగ్స్ సహ యజమానిగా కూడా వ్యవహరిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటున్న ప్రీతిజింటా పలు విషయాలపై స్పందిస్తూ క్లారిటీ ఇస్తోంది. తాజాగా, ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రీతిజింటా ఇండియన్ ఆర్మీకి భారీ విరాళం ప్రకటించింది. కమాండ్‌లోని ఆర్మీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రీతి జింటా రూ. 1.10 కోట్ల విరాళం ఇచ్చింది. జైపూర్‌లో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా సౌత్ వెస్ట్రన్ కమాండ్ ఆర్మీ కమాండర్, ప్రాంతీయ అధ్యక్షుడు శప్తా శక్తి ఆర్మీ కుటుంబాలు హాజరైన సందర్భంగా ఈ విరాళం అందచేయడం జరిగింది. ఇక ఈ విసయంపై ఆమె మాట్లాడుతూ.. "మన సాయుధ దళాల ధైర్యవంతులైన కుటుంబాలకు సహాయం అందించడం గౌరవం బాధ్యత. మన సైనికులు చేసిన త్యాగాలను ఎప్పటికీ నిజంగా తిరిగి చెల్లించలేము. అయితే, మనం వారి కుటుంబాలకు అండగా నిలిచి ముందుకు సాగడంలో వారికి మద్దతు ఇవ్వగలం. భారత సాయుధ దళాల పట్ల నాకు ఎంతో గర్వంగా ఉంది. మన దేశం కోసం పోరాడే ధైర్యవంతులైన రక్షకులకు అచంచలమైన మద్దతుగా నిలుస్తాము" అని చెప్పుకొచ్చింది. ఇక ఈ విషయం సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్ అవుతుండటంతో.. అసలు విషయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## దయచేసి వెంటనే సహాయం అందించండి..

**నా కుటుంబంతో ఖాట్మండులో ఇరుక్కుపోయానంటూ నిర్మాత ఎమోషనల్ ట్వీట్**



టాలీవుడ్ నిర్మాత బన్నీ వాసు నిత్యం పలు చిత్రాలు తెరకెక్కిస్తున్నారు. 2011లో నిర్మాణ రంగంలోకి వచ్చిన ఆయన ఎంతోమంది స్టార్స్‌తో కలిసి పని చేశారు. ఇక ఇటీవల బన్నీ వాసు సింగిల్, తండేల్ వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుని లాభాలు పొందారు. ఆయన ఓ వైపు సినిమాలు నిర్మిస్తూనే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ పలు విషయాలపై స్పందిస్తుంటారు. తాజాగా, బన్నీ వాసు ఫ్యామిలీతో కలిసి నేపాల్ రాజధాని ఖాట్మండుకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ నేపథ్యంలోనే ఇబ్బందుల్లో పడిన ఆయన సాయం కోరుతూ ట్విట్టర్ ద్వారా ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. "హలో ఎయి రిండియా... నేను బన్నీ వాస్ (ఉదయ శ్రీనివాసు). నేను AI 0218 ఫ్లైట్ ద్వారా ఖాట్మండు నుంచి ఢిల్లీకి ప్రయాణిం చాల్సి ఉంది. అయితే మీరు ఆ ఫ్లైట్‌ను రద్దు చేశారు. అప్పుడప్పుడు ఇలాంటి పరిస్థితులు జరుగుతాయని నేను అర్థం చేసుకోగలను. నేను బిజినెస్ క్లాస్ ప్రయాణీకుడినే కాకుండా తెలుగు సినీ పరిశ్రమలో పేరొందిన నిర్మాతని కూడా. ఖాట్మండులో అనీష్ అనే మీ సిబ్బం దిని సంప్రదించే క్రమంలో ఓ కౌంటర్ నుంచి మరో కౌంటర్‌కి తిరుగుతున్నా ఆయన ఎక్కడా కనిపించడం లేదు. రాత్రి 9 గంటల ఫ్లైట్ గురించి నాకు స్పష్టమైన సమాచారం కావాలని అడుగుతున్నా మీ నుంచి సరైన స్పందన రావడం లేదు. నా కుటుంబం, పిల్లలతో కలిసి ప్రయాణి స్తున్నందున దయచేసి వెంటనే సహాయం అందించాలని కోరుతున్నా" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అది చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు. ఇక దీనిపై స్పందించిన ఎయిరిండియా.. సమస్యను పరిష్కరించడానికి కాస్త సమయాన్ని కోరుతూ వ్యక్తి ప్రయాణ వివరాలు ఎవరితో పంచుకోవద్దని రిక్వెస్ట్ చేస్తూ రిప్లై ఇచ్చారు.

## మరో దేశపు వంటకాల్ని ఆస్వాదిస్తున్న అనసూయ ఫ్యామిలీ..

హాట్ బ్యూటీ అనసూయ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ సమయం దొరికినప్పుడల్లా.. భర్త పిల్లలతో కలిసి వెకేషన్స్‌కు చెక్కేస్తుంది. అక్కడ సరదాగా గడిపిన ఆనందాలన్నీ సోషల్ మీడియాలోని అభిమానులతో షేర్ చేసుకుంటుంది. అయితే తాజాగా అనసూయ ఫ్యామిలీ శ్రీలంకలోని కాండీ, పిన్నవాలా టెంపుల్ ఆఫ్ టూత్ రెలిక్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. తాజాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వీడియోలు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఫ్యాన్స్‌తో పంచుకుంది. అక్కడ భర్త, పిల్లలతో విమానంలో వెళ్లోన్న ఫొటోలు, అక్కడి ప్రకృతిని ఆస్వాదిస్తోన్న వీడియోలు పంచుకుంది. ముఖ్యంగా పెద్ద పెద్ద ఏనుగులకు ఆహారం పెడుతోన్న వీడియోలు మరింత హైలెట్‌గా నిలిచాయి. ఈ పోస్టుకు హాట్ బ్యూటీ అనసూయ ఓ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. "మరో దేశాన్ని.. మరో సంస్కృతిని.. మరో వంటకాలను .. మరో జీవనశైలిని అన్వేషిస్తున్నాం" అని వ్యాఖ్యలు జోడించింది. ఇక అనసూయ సినిమాల విషయానికొస్తే... హాట్ యాంకర్ మంచి కంటెంట్ ఉన్న సినిమాలతో దూసుకుపోతుందని చెప్పుకోవచ్చు. ఏకంగా అగ్ర హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ... తనకంటూ సొంత ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది. ఇక ఈ నటి బుల్లితెరపై ఎక్కువగా కనిపించడం లేదు.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741